www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 28-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 353 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి రా.8:43 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పునర్వసు ఉ.9:35 తదుపరి పుష్యమి, వర్జ్యం: సా.5:14 నుంచి 6:46 వరకు, దుర్ముహూర్తం: ఉ.6:37-8:11, అమృతఘడియలు: ఉ.7:18-8:49, రా.2:26-3:58, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:37, సూర్యాస్తమయం: 6:17

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మా నాన్నతో పోటీ పడలేను



సీఎం అవుతానన్న ప్రచారంపై లోకేశ్ స్పష్టీకరణ

3 నెలల్లో సోషల్ మీడియా చట్టం.. జగన్ హయాంలో 'లడ్డూ' అపవిత్రం

అయినా, రాజకీయాలకతీతంగా హిందువులందరికీ క్షమాపణ చెబుతున్నా

కల్తీ బాధ్యులను వదిలిపెట్టబోం.. పవన్ కల్యాణ్ జీవితాంతం పెద్దన్నే

రెడ్‌బుక్‌లో జగన్ పేరు ఉందో లేదో త్వరలోనే తెలుస్తుంది

ముంబైలో ఆంగ్ల చానల్ చర్చా వేదికలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు

2

ఢిల్లీ మద్యం కేసు

మాయ.. మిథ్య!

కేజ్రీవాల్, కవిత, సిసోడియా సహా నిందితులందరికీ క్లీన్‌చిట్

సీబీఐ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు

సీబీఐని కడిగి పారేసిన రౌజ్ అవెన్యూ జడ్జి జితేంద్ర సింగ్

కేసు, దర్యాప్తు మొత్తం తప్పుల తడక

ముందే నిర్ణయించుకుని ఊహల ఆధారంగా కేసు నమోదు

అక్కడా ఇక్కడ విన్న మాటల ఆధారంగా కేసును నిర్మించారు

కేజ్రీవాల్, సిసోడియా, కవితలకు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యమూ లేదు

రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై సమాచారం లేకుండా నిందితుడిగా చేర్చడం రూల్ ఆఫ్ లాకే విరుద్ధం

మాగుంట ప్రకటన ఆధారంగా కేజ్రీవాల్‌ను కుట్రలో ఇరికించారు

అప్రూవర్ల మాటలనే పరమ సత్యాలుగా సీబీఐ భావించింది

ఇలాంటి కేసును అల్లినందుకు దర్యాప్తు అధికారినే విచారించాలి

జడ్జి జితేంద్రసింగ్ వ్యాఖ్యలు



కవిత విజయ సంకేతం



సీబీఐ కోర్టు తీర్పు నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భావోద్వేగం

కేజ్రీవాల్‌పై చేసిన ఆరోపణలు ప్రధానంగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి అనే సాక్షి ఇచ్చిన వాంగ్మూలంలోని ఒకే ఒక వాక్యంపై ఆధారపడి ఉన్నాయి. 'కవిత మిమ్మల్ని సంప్రదిస్తారు' అని దాదాపు 10-12 మంది సమక్షంలో చెప్పినట్టు ప్రాసిక్యూషన్ పేర్కొంది. అయినా వారిని విచారించలేదు. సాక్షులుగా చేర్చలేదు. డాక్యుమెంటరీ ఆధారాలు, ఆర్థిక లావాదేవీల మూలాలు, ఇతర స్వతంత్ర సాక్ష్యాల మద్దతు లేనంతవరకూ.. ఇలాంటి వాంగ్మూలాలు కేవలం వినికిడి సమాచారంగానే మిగిలిపోతాయి.

పలు కేసులలో, ప్రధాన నేరంపై దర్యాప్తు ముగియకముందే, కేవలం డీఫాల్ట్ బెయిల్ రాకుండా అడ్డుకోవడానికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగుతోంది. దీనివల్ల పీఎంఎల్‌ఏ విచారణ ప్రారంభమవుతుంది కానీ, అసలు నేరంపై దర్యాప్తు అసంపూర్తిగా ఉండిపోతోంది. అసలు నేరం లేనప్పుడు మనీలాండరింగ్ నేరం స్వతంత్రంగా నిలబడదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. పీఎంఎల్‌ఏ నేరం స్వతంత్రమైనది కాదు. అది చట్టబద్ధంగా నిలబడే అసలు నేరంతో ముడిపడి ఉంటుంది. పునాది కూలిపోతే దానిపై కట్టిన భవనం కూడా కూలిపోక తప్పదు. - జడ్జి జితేంద్ర సింగ్

ఆప్‌పై మోదీ, షా కుట్ర

మేం అవినీతిపరులం కాదని కోర్టు కూడా చెప్పింది

దేశానికి ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి

ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు పెట్టాలి

బీజేపీకి 10కన్నా ఎక్కువ సీట్లొస్తే రాజకీయ సన్యాసం.. కేజ్రీ సవాల్

ఎవరీ జితేంద్రసింగ్?



సంచలన తీర్పునిచ్చిన ప్రత్యేక జడ్జి వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ

12 13

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసును సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందినీ నిర్దోషులుగా తేల్చింది. అభియోగాల నమోదు దశలోనే అభిషేక్ బోయిన పల్లి, శరత్ రెడ్డి, బుచ్చిబాబు గోరంట్ల,

మిగతా 13వ పేజీలో...

బిహారీ మార్కు కిరికిరి!

సునీల్ నాయక్‌కు 'చట్టపరమైన' రక్షణ

అరెస్టు చేయాలంటే అనుమతి కావాల్సిందే

ఏకంగా బీఎన్ఎస్ఎస్ చట్టానికే సవరణ

కేంద్ర బలగాల కోసం కేంద్రం తెచ్చిన సెక్షన్

అందులోని వెసులుబాటు వాడుకున్న బిహార్

రాష్ట్ర పోలీసు బలగాలకూ వర్తించేలా మార్పు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మా వాళ్లు ఎక్కడ, ఏ రాష్ట్రంలో, ఎలాంటి కేసులో ఇరుక్కున్నా సరే! మా వాళ్లు కాబట్టి మేం అండగా ఉంటాం' అని బిహార్ సర్కారు తేల్చేసింది. ఏకంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్లకే సవరణలు చేసేసింది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో

మిగతా 11వ పేజీలో...



సునీల్ నాయక్

మేలో టీచర్ల బదిలీలు

20 వేల మంది బదిలీ అయ్యే అవకాశం

డెసిమల్ పాయింట్లు కొనసాగింపు

3

ఏపీకి మరో ప్రముఖ సంస్థ

జపాన్ కంపెనీ ప్రాటీరియల్ మెట్‌గ్లాస్ ప్లాంట్ రాక

బ్లూజెట్ హెల్త్‌కేర్‌కు నేడు భూమిపూజ

2

విడాకులు ఇప్పించండి

టీవీకే చీఫ్ విజయ్ భార్య సంగీత పిటిషన్

భర్తకు మరో నటితో సంబంధంపై ఆరోపణలు

11



2

హైకోర్టు కొత్త సీజేగా జస్టిస్ లీసా గిల్!

చీఫ్ జస్టిస్ ఠాకూర్ పదవీ విరమణకు 2 నెలల ముందే ఏపీ హైకోర్టుకు బదిలీ

సుప్రీం కొలీజియం కొత్త విధానంలో భాగంగా రాక

సీజే స్థానం ఖాళీ కాగానే కొత్త బాధ్యతల్లోకి..

ఏపీ హైకోర్టు తొలి మహిళా సీజేగా రికార్డు!



2

కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్

నేడు బాధ్యతల స్వీకరణ

ఆన్‌లైన్ గేమ్స్ వద్దనడమే పాపం!

తల్లిదండ్రులకే కత్తిపోట్లు

సౌదీలో రాజమండ్రి కుర్రాడి ఘాతుకం

3

తల్లిదండ్రులను చంపాక ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్

అది తిన్నాక భవనంపై నుంచి దూకి ఆత్మహత్య



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

మా అబ్బాయి పెళ్లికి రండి

▸▸ సీఎం చంద్రబాబుకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన కుమారుడు సూర్య విక్రమాదిత్య పెళ్లికి సీఎం చంద్రబాబుతో సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలసి ఆయన హైదరాబాద్ నుంచి శుక్రవారం ఉదయం విజయవాడకు వచ్చారు. ముందుగా కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి పాదాల చెంత వివాహ పత్రికను ఉంచి పూజలు చేశారు. అక్కడ నుంచి నేరుగా ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లి వివాహ పత్రికను అందజేశారు. పెళ్లికి రావాలని ఆహ్వానించారు. భట్టి, దుద్దిళ్లను సత్కరించిన సీఎం... వారికి శ్రీవారి ప్రతిమను అందజేశారు. అనంతరం భట్టితో సీఎం చంద్రబాబు సుమారు గంటపాటు ఏకాంతంగా భేటీ అయ్యారు. సీఎం నివాసం నుంచి అసెంబ్లీకి వచ్చిన భట్టి, దుద్దిళ్లకు... మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ ఆహ్వానం పలికారు. స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చాంబర్‌లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, కామినేని శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్, తెనాలి శ్రావణకుమార్ తదితరులకు భట్టి తన కుమారుడి పెళ్లి పత్రికలు అందించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చాంబర్‌కు వెళ్లారు. ఆయన లేకపోవడంతో పత్రికను మంత్రి మనోహర్‌కు అందించారు. సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు గిడుగు రుద్రరాజుతో కలసి విజయవాడ ఆంధ్రరత్న భవన్‌కువెళ్లిన తెలంగాణ నేతలు... అక్కడ ఏపీసీసీ నేతలకు వివాహ ఆహ్వాన పత్రికను అందించారు.

బొత్సకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స

అమరావతి, విజయనగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యన్నారాయణ గురువారం అనారోగ్యంతో ఇబ్బంది పడ్డారు. మెరుగైన వైద్యం కోసం ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆసుపత్రిలో చేరారు. గురువారం రాత్రి విజయవాడలో ఉన్న బొత్సకు రక్తపోటు పెరిగింది. స్థానిక వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స చేశారు. శుక్రవారం ఉదయాన్నే హైదరాబాద్ వెళ్లిన బొత్స సిటీ న్యూరో ఆసుపత్రిలో చేరారు. అయితే... ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందంటూ వివిధ మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అయితే 'నా ఆరోగ్యంపై వచ్చిన వదంతులను నమ్మొద్దు. రెగ్యులర్ చెకప్ కోసం ఆసుపత్రికి వెళ్లా. జిల్లా వాసులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అంటూ బొత్స ఓ ప్రకటన చేశారు. కాగా, హైదరాబాద్ ఆసుపత్రిలో చేరిన బొత్స త్వరగా కోలుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

'నీరు-చెట్టు' పనుల్లో ఎలాంటి అక్రమాల్లేవు!

▸▸ 386 మంది జలవనరుల శాఖ ఇంజనీర్లకు క్లీన్‌చిట్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాం (2014-19)లో భూగర్భ జలాల మట్టాలు పెంచేందుకు చేపట్టిన నీరు-చెట్టు పథకం కార్యక్రమాల్లో అధికారులు ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని విజిలెన్స్ శాఖ తాజా దర్యాప్తు తేల్చింది. దీంతో జలవనరుల శాఖకు చెందిన 386 మంది ఇంజనీరింగ్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలన్న గత సర్కార్ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గత ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడితే.. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలిచిందని ఆ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

వివేకా హత్య కేసులో మళ్లీ సీబీఐ విచారణ

కడప, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ విచారణ రెండేళ్ల తర్వాత మళ్లీ మొదలైంది. సుప్రీంకోర్టు సూచన మేరకు వివేకా హత్య కేసులో ఏ2గా ఉన్న సునీల్‌యాదవ్ సోదరుడు కిరణ్‌కుమార్ యాదవ్, అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన కాల్ డేటాపై సీబీఐ విచారణ చేపట్టింది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు సీబీఐ అధికారి రోహిత్‌యాదవ్ వచ్చారు. సునీల్‌యాదవ్ తమ్ముడు కిరణ్ యాదవ్‌ను సీబీఐ విచారణకు పిలిచింది. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించిన భరత్‌యాదవ్ తమ్ముడు మహేంద్రకుమార్ యాదవ్‌ను, అర్జున్‌రెడ్డిలను కూడా విచారణకు పిలిచింది. ముందుగా మహేంద్రకుమార్ యాదవ్‌ను సీబీఐ అధికారి గంటన్నర పాటు విచారించారు. కిరణ్ యాదవ్, మహేంద్రయాదవ్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపై ప్రశ్నించినట్లు తెలిసింది. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో కిరణ్‌యాదవ్.. సునీల్‌యాదవ్‌తో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. కిరణ్ యాదవ్, అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల ఆధారంగా ప్రశ్నించినట్లు తెలిసింది. వివేకా హత్య విషయం ఉదయం 6.15 గంటల ప్రాంతంలో బాహ్య ప్రపంచానికి తెలిసింది. కానీ కిరణ్‌యాదవ్ ఫోన్ నుంచి తన సోదరుడి స్నేహితుడు అర్జున్‌రెడ్డికి వాట్సాప్ మెసేజ్ ద్వారా అర్ధరాత్రి 1.40 గంటలకే వెళ్లినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. ఇదే విషయంపై సీబీఐ అధికారి ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ నెల 20న కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డిలను హైదరాబాద్‌లో విచారించారు. సీబీఐ అధికారి ఎదుట విచారణ అనంతరం మహేంద్ర యాదవ్ విలేకరులతో మాట్లాడాడు. కిరణ్‌యాదవ్‌కు ఎందుకు ఫోన్ చేశావని సీబీఐ అధికారి ప్రశ్నించారని తెలిపాడు. వివేకా హత్య జరగకముందు నుంచి కూడా తాము ఫోన్‌లో మాట్లాడేవారమని, తామంతా బంధువులమని చెప్పాడు. అనంతరం కిరణ్‌యాదవ్ విలేకరులతో మాట్లాడాడు. అర్జున్‌రెడ్డి, తనకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణల గురించి సీబీఐ అధికారి అడిగారని, ప్రశ్నలకు సమాధానమిచ్చానని అన్నాడు. ఈ కేసు విచారణ పూర్తి స్థాయిలో జరిగి, న్యాయం జరగాలంటే తాము ప్రాణాలతో ఉండాలన్నారు. అంతకుమించి ఏమీ చెప్పలేమని, కోర్టులో ఉన్న అంశమని అన్నాడు. శనివారం కూడా సీబీఐ పలువురిని విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

విశాఖ యువకుడి మ్యాట్రిమోనియల్ మోసం

▸▸ హైదరాబాద్ వాసికి రూ.11 లక్షలు టోకరా.. చెన్నైలో అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి ఉపాధి కోసం కంబోడియాకు వెళ్లిన యువకుడు... అక్కడ సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపాడు. మ్యాట్రిమోనియల్ సైట్‌లో అందమైన యువతిలా నకిలీ ప్రొఫైల్ సృష్టించి హైదరాబాద్ యువకుడి నుంచి రూ.11.17 లక్షలు కాజేశాడు. ఆ యువకుడి ఫిర్యాదుపై స్పందించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం నిందితుడిని చెన్నై ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన 28ఏళ్ల యువకుడికి ఒక విదేశీ నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. 'నా పేరు అంజలి కందుల. షాదీ డాట్ కామ్‌లో మీ ప్రొఫైల్ చూశాను. నాకు నచ్చింది. నేను కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా. ఇక్కడే స్థిరపడ్డాను. బాగా సంపాదించా' అంటూ పరిచయం చేసుకుంది. 'కొద్ది కాలం స్నేహంగా ఉందాం. ఇద్దరికీ కుదిరితే పెళ్లి చేసుకుందాం' అని నమ్మించింది. ఆ తరువాత తన అంకుల్ నిర్వహిస్తున్న బ్యాక్ కాయిన్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడులు పెడితే రూ.కోట్లు సంపాదించవచ్చని నమ్మబలికింది. ప్రారంభంలో చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెట్టిన బాధితునికి వర్చువల్‌గా రూ.12.5 లక్షలు లాభాలు వచ్చినట్లు చూపించారు. వాటిని విత్‌డ్రా చేయాలంటే... పెద్ద మొత్తంలో పెట్టాలని చెప్పి రూ.11,17,834 గుంజారు. అయినా ఆ సొమ్ము విత్‌డ్రా చేయడం సాధ్యం కాలేదు. బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పెద్దపూడి ప్రసన్నకుమార్‌ను అరెస్టుచేశారు.


మా నాన్నతో పోటీ పడలేం

▸▸ సీఎం అవుతానన్న ప్రచారంపై లోకేశ్ స్పష్టీకరణ

▸▸ 'కల్తీ' బాధ్యులను వదిలిపెట్టబోం

▸▸ ముంబైలో ఆంగ్ల చానల్ చర్చా వేదికలో

▸▸ మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు



ముంబైలో నిర్వహించిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా' చర్చలో మాట్లాడుతున్న లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మాకు గల్లీ రాజకీయాలంటేనే ఇష్టం. ఢిల్లీ రాజకీయాలు మాకొద్దు' అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా సీఎం చంద్రబాబు ఢిల్లీ రాజకీయాల్లోకి వెళతారు.. లోకేశ్ సీఎం అవుతారంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన ఇలా స్పందించారు. 'ఐడియాస్ ఆఫ్ ఇండియా' పేరుతో ఓ ఆంగ్ల చానల్ ముంబైలో నిర్వహించిన చర్చలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీనిపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పష్టమైన సమాధానం ఇచ్చారు. చంద్రబాబు 75 ఏళ్ల యువకుడని, ఇప్పట్లో ఆయనతో పోటీ పడలేమని లోకేశ్ వ్యాఖ్యానించారు. "దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా క్వాంటమ్ వ్యాలీపై ఆలోచన చేయని సమయంలోనే చంద్రబాబు దానిపై మంత్రివర్గ సహచరులతో తన ఆలోచనను పంచుకున్నారు. స్టాన్‌ఫోర్డులో చదివిన నేనే క్వాంటం వ్యాలీపై సమాచారం ఇవ్వాలని చాట్‌జీపీటీలో కోరాల్సి వచ్చింది. చంద్రబాబు ఆలోచనలు ఎంత ముందు చూపుతో.. ఎంత యంగ్‌గా ఉంటాయో చెప్పేందుకు ఇది ఒక ఉదాహరణ" అని వివరించారు. చంద్రబాబుతో పనిచేయడం తేలిక కాదని, మనం 50 కేజీలు బరువు మోస్తుంటే ఆయన మరో 10 కేజీలు మోయాలని టాస్క్ పెడతారని లోకేశ్ వివరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను జీవితాంతంపెద్దన్నగానే చూస్తానని లోకేశ్ తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

90 రోజుల్లో సోషల్ మీడియా చట్టం

"సామాజిక మాధ్యమాలకు పిల్లలను దూరంగా ఉంచాలనే ఆలోచన నుంచి వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. 13 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాల్లో ఉండకూడదని నేను బలంగా విశ్వసిస్తాను. అదే సమయంలో కొన్ని రకాల కంటెంట్‌ను 16 ఏళ్లలోపు వారికి దూరంగా ఉంచాలి. మూడు నెలల్లో దీనిపై సోషల్ మీడియా చట్టాన్ని తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం.."

క్షమాపణలు చెబుతున్నా..

"తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం అనేది జగన్ హయాంలో జరిగినా... రాజకీయాలకు అతీతంగా ప్రపంచంలోని హిందువులందరికీ నేను బేషరతుగా క్షమాపణలు చెబుతున్నా. ప్రసాదాన్ని కల్తీ చేసిన బాధ్యులపై మేం కఠిన చర్యలు తీసుకుంటాం. సిట్ నివేదిక ప్రకారం, టీటీడీ మాజీ చైర్మన్ సహా ఏ ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోలేరు. తిరుమలలో వరల్డ్ క్లాస్ టెస్టింగ్ ఫెసిలిటీ నిర్మిస్తున్నాం."

ఐదేళ్ల వేధింపులకు సమాధానమే రెడ్‌బుక్

"గత ఐదేళ్లలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. వారిని ఆనాడు అవమానాలు, వేధింపులకు గురిచేసినవాళ్లకు సమాధానమే రెడ్ బుక్. చట్ట ఉల్లంఘన చేసినవాళ్లు, అందుకు ప్రేరేపించిన రాజకీయ నాయకులు, వేధింపులకు గురిచేసిన వాళ్ల పేర్లు ఆ బుక్‌లో ఉంటాయి. రాజకీయ పార్టీగా టీడీపీ ప్రాంతీయ పార్టీయే. కానీ, దేశ ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నది మా విధానం. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం.గత ఎన్నికల్లో ఎక్కడా ప్రత్యేక హోదా సాధిస్తామని హామీ ఇవ్వలేదు. ఏపీకి అత్యధిక నిధుల సాధనే మా లక్ష్యం." అని లోకేశ్ అన్నారు.



సంజయ్‌దత్‌తో లోకేశ్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్‌ను కలవడం ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఓ ఆంగ్ల చానల్ చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు ముంబైకి వెళ్లిన లోకేశ్ అక్కడ సంజయ్‌దత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఏపీలో సినిమా షూటింగ్‌లకు సింగిల్ విండోలో అనుమతులు ఇవ్వడం, ఫిల్మ్ సిటీ నిర్మాణం వంటి అంశాలపై చర్చించినట్లు లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

రెడ్‌బుక్‌లో జగన్ పేరు ఉందా?

▸▸ ఉందో లేదో త్వరలో తెలుస్తుంది

▸▸ 'ఆంగ్ల చానల్' ప్రశ్న..లోకేశ్ జవాబు

ఆంగ్ల చానల్ : రెడ్‌బుక్ నిండా జగన్.. జగన్.. అని రాసుకున్నారా?

లోకేశ్ : రెడ్‌బుక్‌లో జగన్ పేరు ఉందో లేదో త్వరలో అందరికీ తెలుస్తుంది.

ఆంగ్ల చానల్ : తిరుమల లడ్డూ విషయాన్ని మాట్లాడుతూనే, కోవా బన్ను వ్యాపారం చేసే ముస్లింకు అండగా ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

లోకేశ్ : నేను హిందువునైనా అన్ని మతాలనూ గౌరవిస్తాను. కోవా బన్ను వ్యాపారిని మతం పేరుతో అవమానించడం బాధించింది. అతనికి అండగా ఉండటం బాధ్యతగా భావించా.

ఆంగ్ల చానల్ : చంద్రబాబుకు హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారన్న గుర్తింపు ఉంది. ఇప్పుడు ఏపీలో మళ్లీ కొత్తగా హైదరాబాద్ లాంటి నగరాన్ని అభివృద్ధి చేయడంలో ఒత్తిడి ఏమైనా ఎదుర్కొంటున్నారా?

లోకేశ్ : ఎలాంటి ఒత్తిడీ ఎదుర్కోవడం లేదు. దీన్ని సవాల్‌గా పరిగణిస్తున్నాం. ఏపీలో మేం ఒక నగరాన్నే కాదు, మొత్తం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అందులో భాగమే..విశాఖ, అమరావతి, తిరుపతి ఆర్థికమండళ్ల అభివృద్ధి. అమరావతి.. అద్భుతమైన భవిష్యత్తు నగరం. అమరావతి పడవను మిస్ అయితే భవిష్యత్తులో బాధపడతారు.

ఆంగ్ల చానల్ : రాష్ట్రం అప్పుల్లో ఉన్న పరిస్థితుల్లో ఐటీ కంపెనీలకు 99 పైసలకే భూములు ఎందుకు పందేరం చేస్తున్నారు?

లోకేశ్ : ప్రభుత్వ భూములను ఎవరికీ విక్రయించేయడం లేదన్న విషయాన్ని ముందుగా గుర్తుపెట్టుకోవాలి. భూములు ఇవ్వడం ద్వారా ఐటీ కంపెనీలను ఆకర్షిస్తున్నాం. భవిష్యత్తులో వాటి ద్వారా సమకూరే ఆర్థిక ప్రయోజనాలు రాష్ట్రాభివృద్ధికి ఎంతో దోహదపడుతాయి. కాగ్నిజెంట్ సంస్థకు భూమి కేటాయించడం ద్వారా 25 వేల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేశాం. ఏడాదికి రూ.1500 కోట్ల ఆర్థిక కార్యకలాపాలకు విశాఖను వేదికగా చేశాం. రాష్ట్రానికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం.. చంద్రబాబు అయితే ప్రభుత్వం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌యే. ఎన్డీయే కూటమి ఉన్న మిగిలిన రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్ ఉంది.

హింస పరిష్కారం కాదు

▸▸ లొంగిపోయిన మావోయిస్టు నేతలతో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): హింస ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారానే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టు అగ్ర నేతలు శుక్రవారం సీఎంను సచివాలయంలో కలిశారు. దేవ్‌జీ, రాజిరెడ్డి, ప్రసాదరావు, కల్పన, చొక్కారావు, నర్సింహారెడ్డిలను ఎస్ఐబీ అధికారులు సచివాలయానికి తీసుకువచ్చారు. సాయుధ పోరాటాన్ని విరమించి ప్రధాన జనజీవన స్రవంతిలోకి రావడానికి అవకాశం కల్పించిన సీఎంకు మావోయిస్టు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల భద్రత, పునరావాస ప్రయోజనాల కల్పనలో ఎలాంటి లోపాలు ఉండబోవని సీఎం రేవంత్ ఈ సందర్భంగా మావోయిస్టు నాయకులకు హామీ ఇచ్చారు. రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నానని తిప్పిరి తిరుపతి(దేవ్‌జీ) ప్రకటించిన నేపథ్యంలో.. "ఏదైనా పార్టీలో చేరాలని అనుకుంటున్నారా" అని సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. ప్రజాక్షేత్రంలో ఉండి కార్యచరణ ప్రణాళిక రూపొందించుకున్న తర్వాత నిర్ణయం తీసుకుంటానని తిరుపతి సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. ములుగు ప్రాంతం నుంచి తన రాజకీయ ప్రవేశం ఉంటుందని చొక్కారావు వివరించినట్లు తెలిసింది.

సౌందర రాజన్ కన్నుమూత

▸▸ ప్రధాన అర్చకుడిగా చిలుకూరు బాలాజీ ఆలయానికి గుర్తింపు

▸▸ ఆలయాల స్వతంత్రతను కాపాడేందుకు కృషి చేశారన్న చంద్రబాబు



మొయినాబాద్, అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆలయాల స్వయం ప్రతిపత్తి, హుండీ లేని ఆధ్యాత్మిక పాలన కోసం కృషి చేసిన చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు ఎం.వీ. సౌందర రాజన్(90) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు ముగ్గురు కుమారులు. ఆయన భార్య వసుమతి 2018లో మరణించారు. చిలుకూరు బాలాజీ ఆలయం వెనుక శనివారం దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేసినట్లు సౌందర రాజన్ తనయుడు, ఆలయ ప్రస్తుత అర్చకుడు రంగరాజన్ వెల్లడించారు. సౌందర రాజన్ ఓయూలో పీహెచ్‌డీ చేశారు. వర్సిటీలో కీలక పదవులు నిర్వహించారు. చివరగా ఓయూ రిజిస్ట్రార్‌గా పనిచేసి 1999లో రిటైరయ్యారు. తర్వాత తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. ఆలయంలో హుండీ తీసేశారు. సౌందర రాజన్ మరణంపై తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆలయాల సంప్రదాయాలు, స్వతంత్రతను కాపాడేందుకు జీవితాంతం కృషి చేశారని చంద్రబాబు చెప్పారు.

ఏపీకి మరో ప్రముఖ సంస్థ

▸▸ శ్రీసిటీలో జపాన్ కంపెనీ ప్రొటీరియల్ యూనిట్

▸▸ మెట్‌గ్లాస్ ఇండియా లిమిటెడ్ పేరుతో ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన మరో ప్రముఖ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు రానుంది. అధునాతన మెటీరియల్స్ తయారీ సంస్థ ప్రొటీరియల్ లిమిటెడ్ ఏపీలోని శ్రీసిటీలో అత్యాధునిక అమార్ఫస్ మెటల్ మెటీరియల్ మెట్‌గ్లాస్ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించనుంది. విద్యుత్ ఆదా కోసం ట్రాన్స్‌ఫార్మర్లలో కోర్ మెటీరియల్‌గా వాడే మెట్‌గ్లాస్ వల్ల విద్యుత్ నష్టం దాదాపు 33 శాతం తగ్గనుంది. భారత్‌లో తొలిసారిగా ఎనర్జీ సేవింగ్ టెక్నాలజీ తరహా అధునాతన సాంకేతికతతో కూడిన ప్లాంట్ ఏపీకి రావడం విశేషం. ఈ ప్లాంట్ కోసం తొలి దశలో 77-80 మిలియన్ డాలర్ల పెట్టుబడి (దాదాపు రూ.700 కోట్లు) పెట్టనున్నట్లు ప్రొటీరియల్ సంస్థ సీఈవో సీన్ స్టాక్ తెలిపారు. ఢిల్లీలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏపీలో ప్రారంభించబోయే మెట్‌గ్లాస్ ఉత్పత్తి కేంద్రం వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. విద్యుత్ ఆదా కోసం ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ కొత్త కంపెనీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకోసం మెట్‌గ్లాస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక సంయుక్త భాగస్వామ్య సంస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కంపెనీలో ప్రొటీరియల్ 74 శాతం, షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ 26 శాతం వాటాలు కలిగి ఉన్నాయని తెలిపారు. తిరుపతిలోని శ్రీసిటీలో ఏర్పాటయ్యే ఈ కంపెనీలో ఈ ఏడాది అక్టోబరు నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుందన్నారు. ప్రారంభంలో ఏడాదికి 30 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కంపెనీని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రారంభంలో 200 మందికి, రెండో దశ పూర్తయ్యే సరికి మొత్తం 500 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి జపాన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రొటీరియల్ సంస్థ ఇప్పటికే అమెరికా, జపాన్‌లో మెట్‌గ్లాస్‌ను ఉత్పత్తి చేస్తోంది.



విలేకరుల సమావేశంలో ప్రొటీరియల్ సీఈవో సీన్ స్టాక్

ఏఎస్ఐపీ టెక్నాలజీస్‌కు రూపాయికే ఎకరా

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ(ఏఎస్ఐపీ) టెక్నాలజీస్‌కు ఎకరా భూమిని రూపాయికే అందిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ నిర్ణయిం తీసుకుంది. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) విధానంలో భాగంగా ఈ సంస్థ రాష్ట్రంలో తొలిసారిగా విశాఖలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. దీనికోసం విశాఖ జిల్లా ఆనందపురం మండలం, తర్లువాడ గ్రామంలో 30 ఎకరాలు కేటాయిస్తూ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

రైడెన్ ప్రతిపాదనలు అదానీకి బదలాయింపు

విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ స్థాపించదలచిన ఏఐ డేటా సెంటర్‌కు అందిస్తున్న ప్రోత్సాహకాలు, కేటాయించిన భూములను ఐటీశాఖ అదానీ డేటా సెంటర్‌కు బదలాయించింది. ఈ మేరకు ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

బ్లూజెట్ హెల్త్‌కేర్‌కు నేడు భూమిపూజ

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ ఏపీలో రూ.2,300 కోట్ల పెట్టుబడితో మెగా ఫార్మా ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్కులో 102 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మాస్యూటికల్ కంపెనీకి శనివారం మంత్రి లోకేశ్ భూమి పూజ చేయనున్నారు. నిర్మాణ పనులను దశలవారీగా పూర్తిచేసి 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు వల్ల 1,750 ప్రత్యక్ష, 250 పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయని, విశాఖపట్నం పారిశ్రామికంగా మరింత బలోపేతం అవుతుందని అంచనా వేస్తున్నారు. కొత్త ప్లాంట్‌లో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జడ్ఎల్‌డీ) టెక్నాలజీని వినియోగించడం వల్ల ఇది ఎనర్జీ వినియోగాన్ని 70శాతం తగ్గిస్తుంది. ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అక్షయ్ బన్సరీలాల్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివేన్ అక్షయ్ అరోరా నేతృత్వంలో ఈ ప్లాంట్ పనులు జరగనున్నాయి.

వారీ ఎనర్జీ స్టోరేజ్‌కు 300 ఎకరాలు

అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో వారీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయదలచిన లిథియం అయాన్ బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ కోసం 300ఎకరాల భూమిని ఎకరా రూ.50లక్షల చొప్పున కేటాయిస్తూ పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు స్థాపనకు మొత్తం రూ.8,175కోట్లు పెట్టుబడి పెడతామని, 3,000 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వారీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ప్రతిపాదించింది. దీనికి ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీ, మంత్రిమండలి ఆమోదించాయి.

ఆర్ష ధాతుకు 12.31 ఎకరాలు

పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడులో ఏర్పాటు చేయనున్న ఆర్ష ధాతు గ్రీన్ నానోటెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 12.31 ఎకరాలు కేటాయిస్తూ పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఎంఎస్ఎంఈ పాలసీలో భాగంగా ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఈ ప్రోత్సాహకాలు, భూ కేటాయింపులు జరిగినట్టు పరిశ్రమల శాఖ పేర్కొంది.

జీతం వస్తోంది కదా.. సంతోషించండి!

▸▸ నియమించిన చోట ఉద్యోగం చేయాల్సిందే

▸▸ గ్రూప్-1 ఉద్యోగులకు సుప్రీంకోర్టు ఆదేశం

▸▸ హైకోర్టు తీర్పును సమర్థించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల(2018) వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో ఇప్పటికే సర్వీసులో ఉన్న వారికి ప్రాధాన్యత లేని(నాన్ ఫోకల్) పోస్టులు కేటాయించాలంటూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. అయితే, ఈ తీర్పును సవాల్ చేస్తూ కొందరు గ్రూప్-1 ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ బిందాల్, జస్టిస్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. "నియామకాల్లో అవకతవకలు జరిగినప్పటికీ మీకు ఉద్యోగాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా జీతాలు వస్తున్నాయి కదా?." అని ధర్మాసనం ప్రశ్నించింది. "మీకు ప్రాధాన్యత ఉన్న పోస్టులు ఇస్తే ఏంటి?. అప్రాధాన్య పోస్టులు ఇస్తే ఏంటి?. ఎక్కడ ఉన్నా మీరు డ్యూటీ చేయాల్సిందే. అసలు జీతాలు ఆగిపోకుండా వస్తున్నందుకు మీరు సంతోషపడాలి." అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పు చాలా బాగుందని, ఆ తీర్పును తాము పూర్తిగా సమర్థిస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వం నియమించిన చోటే ఉద్యోగాలు చేయాలని ఆదేశిస్తూ పిటిషన్లను డిస్మిస్ చేసింది.

హైకోర్టు కొత్త సీజేగా జస్టిస్ లీసా గిల్!

▸▸ ఏపీ హైకోర్టు తొలి మహిళా సీజేగా రికార్డు!



అమరావతి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రానున్నారు. ప్రస్తుతం పంజాబ్- హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం గురువారం కేంద్రానికి సిఫారసు చేసింది. ప్రస్తుత ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వచ్చే నెల 24న పదవీ విరమణ చేయనుండగా ఆయన స్థానంలో జస్టిస్ లీసా గిల్ బాధ్యతలు చేపడతారు. కాగా ఏపీ హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా చరిత్రకెక్కుతారు. అప్పటివరకు తదుపరి సీజే హోదాలో హైకోర్టులో కొనసాగుతారు. అంతకు ముందే పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్తారని ప్రచారం కూడా జరుగుతోంది.


కొలీజియం కొత్త విధానం..

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకంలో సుప్రీంకోర్టు కొలీజియం కొత్త విధానం ప్రవేశపెట్టింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో గురువారం సమావేశమై, న్యాయ పరిపాలనలో సామర్థ్యం, నాణ్యతలను మరింత పెంచడానికి.. సీజే బాధ్యతలు తీసుకునే న్యాయమూర్తిని ఆ పదవికి ఖాళీ ఏర్పడడానికి రెండు నెలల ముందే సంబంధిత కోర్టుకు బదిలీ చేయాలని నిర్ణయించింది. దీని వల్ల ఆ హైకోర్టు వ్యవహారాల పై అవగాహన పెరుగుతుందనేది కొలీజియం భావన. అందులోభాగంగానే జస్టిస్ లీసాను ఏపీ హైకోర్టుకు, జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారిని మద్రాస్ హైకోర్టుకు తదుపరి సీజేలుగా నియమించారు. ప్రస్తుతం ఆయన కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

జస్టిస్ లీసా గిల్ నేపథ్యం..

జస్టిస్ లీసా గిల్ పాఠశాల విద్యను చండీగఢ్‌లో, ఆ తర్వాత జీసీజీ కళాశాలలో డిగ్రీ, పంజాబ్ వర్సిటీ నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. అనంతరం పంజాబ్- హరియాణా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. క్రిమినల్, సివిల్, సర్వీస్, రెవెన్యూ, రాజ్యాంగపరమైన కేసులు వాదించడంలో నైపుణ్యం గడించారు. 2014 మార్చి 31 నుంచి పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

నూతన సీఎస్‌గా సాయిప్రసాద్



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్ పదవీ కాలం శనివారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో గతేడాది నవంబరు 29నే సాయిప్రసాద్ నియామక ఉత్తర్వులు విడుదలయ్యాయి. శనివారం ఉదయం ఆయన అమరావతి సచివాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. 1991 బ్యాచ్ ఏపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన జి.సాయిప్రసాద్ ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సీఎంకు ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన 1992లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. అక్కడి నుంచి వివిధ కీలకమైన పోస్టుల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కర్నూలు, చిత్తూరు కలెక్టర్‌గా, ట్రాన్స్‌కో జేఎండీగా, ఈపీడీసీఎల్ సీఎండీగా, సీపీడీసీఎల్ సీఎండీగా, కేంద్ర ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శిగా, ఏపీ సీఎం కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా.. ఇంకా అనేక హోదాల్లో పనిచే శా రు. 2024లో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితుల య్యారు. 2025లో సీఎం ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగానూ బాధ్యతలు స్వీకరించారు. సాయిప్రసాద్ ఈ ఏడాది మే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. మరోవైపు ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్న పి.ఫలచంద్రరావును ప్రభుత్వం బదిలీ చేసింది. పాలనాపరమైన కారణాలతో ఆయన్ను సాంఘిక సంక్షేమ విభాగం అదనపు కార్యదర్శిగా బదిలీ చేస్తూ శుక్రవారం సీఎస్ కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

పాతికేళ్ల ప్రేమ.. పెళ్లయిన కొన్ని గంటలకే

వరుడి హత్య

రాళ్లతో కొట్టి చంపిన వధువు సోదరులు.. ప్రేమించుకుని అన్నవరంలో వివాహం

- తిరిగి ఇంటికొచ్చిన కొద్దిసేపటికే ఘోరం
- పెద్దలను ఒప్పించడానికి పాతికేళ్లుగా ప్రయత్నం
- కులాలు వేరు కావడంతో ఒప్పుకోని వధువు కుటుంబం?
- తూర్పుగోదావరి జిల్లా ద్వారపూడిలో ఘటన
- వధువు రాయవరం డిప్యూటీ తహశీల్దార్



అన్నవరంలో పెళ్లి తరువాత సంధ్యకు అరుంధతి నక్షత్రం చూపుతున్న సూర్యప్రకాశ్



తన ఇంటి ఎదుట హత్యకు గురైన సూర్యప్రకాశ్

మండపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించుకున్న ఆ జంట తమ దారి తాము చూసుకోలేదు. కుటుంబ సభ్యులను ఒప్పించడానికి పాతికేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. కులాలు వేరనే కారణంగా వధువు కుటుంబం తొలినుంచీ ససేమిరా అంటోంది. ఇక.. చివరకు అన్నవరంలో తాళి కట్టి..ఆమెతో తన ఇంటికి చేరుకున్న వరుడు ఆ తర్వాత కొద్ది సేపటికే వధువు సోదరుల చేతిలో హత్యకు గురయ్యాడు. రాళ్లతో కొట్టి దారుణంగా చంపేశారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో గురువారం రాత్రి ఈ ఘోరం జరిగింది. ద్వారపూడికి చెందిన పోలిపల్లి సూర్యప్రకాశ్, జెడ్.మేడపాడుకు చెందిన అయినవిల్లి సంధ్య ఆరో తరగతి చదువుతున్నప్పుడే ప్రేమలో పడ్డారు. వారిద్దరు పదో తరగతి వరకు (1995-2000) ద్వారపూడిలోనే చదివారు. పెళ్లి చేసుకుందామనుకున్నా కుటుంబ బాధ్యతల కారణంగా వాయిదా వేసుకుంటూ వచ్చారు. సంధ్యకు తండ్రి లేడు. తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. ప్రస్తుతం ఆమె రాయవరం డిప్యూటీ తహశీల్దార్‌గా చేస్తుండగా, సూర్యప్రకాశ్ ద్వారపూడిలో బట్టల వ్యాపారం చేస్తున్నాడు. ఇద్దరివీ వేర్వేరు కులాలు. దీంతో వారి వివాహాన్ని సంధ్య కుటుంబీకులు తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. వధూవరులిద్దరికీ సుమారు 40 ఏళ్లు వచ్చేశాయి. ఇటీవల పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుని, ఇరు కుటుంబాలకు సమాచారం ఇవ్వకుండా గురువారం కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వివాహం చేసుకున్నారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో సూర్యప్రకాశ్.. సంధ్యతో కలిసి ద్వారపూడిలోని తన ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సంధ్య సోదరులు అయినవిల్లి చంద్రపాల్, గిరిబాబు దురుసుగా ప్రకాశ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. పెద్దగా కేకలు వేస్తూ హడావుడి చేశారు. సర్దిచెపుదామని ప్రకాశ్ బయటకు రాగా తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఆ సమయంలో ప్రకాశ్ ఇంట్లో కూడా ఎవరూ లేరు. 'మాకు చెప్పకుండా పెళ్లి చేసుకుంటావా.. ఏం చేస్తామో చూడు' అంటూ ప్రకాశ్‌పై దాడికి దిగారు. కొట్టవద్దని సంధ్య బతిమలాడినా, వినలేదు. ప్రకాశ్‌పై పిడిగుద్దులు కురిపిస్తూ, రాళ్లతో కొట్టారు. దీంతో రక్తపు మడుగులో కొట్టుకుంటూ ఆ తర్వాతి కొద్దిసేపటికే ప్రాణాలొదిలారు. అది చూసి సంధ్య ఒక్కసారిగా నిశ్చేష్టురాలైపోయింది. లే... ప్రకాశ్ అంటూ భర్తను పట్టుకుని రోదించింది. స్థానికులు గమనించేసరికే ఘోరం జరిగింది. వెంటనే సంధ్య సోదరులను స్తంభాలకు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ దొరరాజు తెలిపారు. కాగా, సంధ్య సోదరుల్లో ఒకడు ప్రైవేటు ఉద్యోగి కాగా, మరొకడు ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు.

ఆన్‌లైన్ గేమ్స్ వద్దనడమే పాపం!

కన్న తల్లిదండ్రులపైనే కత్తిదూసిన బాలుడు.. సౌదీలో రాజమండ్రి కుర్రాడి ఘాతుకం

- విచక్షణ మరిచి పదేపదే కత్తిపోట్లు
- తల్లిదండ్రులను చంపి ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్
- అది తిన్నాక భవనంపై నుంచి దూకి ఆత్మహత్య
- రియాద్‌లో ప్రవాసీ కుటుంబీకుల విషాదాంతం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



తల్లిదండ్రులు రవి, శ్రీదేవిలతో యెజ్రప్రభాకర్

ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారిన కొడుకును మందలించడమే ఆ తల్లిదండ్రులు చేసిన పాపం!. ఎడారి దేశం.. గల్ఫ్‌లో ఓ ప్రవాసాంధ్ర బాలుడు కన్న తల్లిదండ్రులనే అతి కిరాతకంగా హతమార్చాడు. ఆపై ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డరిచ్చి, అది తిన్నాక కొంత సేపటికి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజధాని రియాద్ నగరంలో తెలుగు ప్రవాసీయులు ఎక్కువగా నివసించే హరా అనే ప్రాంతంలో గురువారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. ఇక్కడ నివసిస్తున్న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన గాలి రవి(49), గాలి శ్రీదేవి(43) దంపతులను ప్లస్2 చదువుతున్న వారి ఒక్కొగానొక్క కొడుకు యెజ్రప్రభాకర్ దారుణంగా నరికి చంపాడు. రవి బ్యాంకు ఉద్యోగి కాగా, శ్రీదేవి ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. కొడుకు యెజ్రప్రభాకర్ స్థానిక భారతీయ పాఠశాలలో ప్లస్ 2 చదువుతూ ప్రస్తుతం జరుగుతున్న సీబీఎస్ఈ వార్షిక పరీక్షలకు హాజరవుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన ప్రభాకర్.. తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి రూ.5 లక్షల విలువైన ఎక్విప్‌మెంటను కొలుగోలు చేయించుకున్నాడు. అయితే, చదువును గాలికి వదిలేసి.. రోజులో అత్యధిక భాగం ఆన్‌లైన్ గేమ్స్‌లో తలమునకలై ఉండడంతో వారు మందలిస్తూ వస్తున్నారు. ఇదే విషయమై గురువారం రాత్రి మరోసారి తల్లిదండ్రులు మందలించడంతో.. ప్రభాకర్ ఆగ్రహంతో రగిలిపోయాడు. విచక్షణ కోల్పోయి.. తల్లిదండ్రులిద్దరిపైనా కత్తిదూశాడు. అనేకమార్లు పొడిచిపొడిచి చంపేశాడు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ ఇచ్చి భుజించాడు. కొంతసేపటికి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణం తెలిసి రియాద్‌లోని తెలుగు ప్రవాసీ సమాజం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. రవి, శ్రీదేవి దంపతులు ఇక్కడ అందరితో కలిసిమెలిసి ఉంటారని, కన్న కొడుకు చేతిలోనే ఇంతదారుణంగా బలైపోతారని అనుకోలేదని పలువురు ప్రవాసీయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, హరా ప్రాంతంలోని కొన్ని కమ్యూనిటీ(నివాస ప్రాంతాలు)ల్లో యువత చదువులకు స్వస్తిపలికి, ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్స్‌లో తలమునకలై ఉండడం తల్లిదండ్రులకు పెద్ద సమస్యగా మారింది.

తాగునీటిలో 'ఈ-కోలి'

- అందుకే శ్రీకాకుళంలో డయేరియా.. 11 నమూనాల్లో బ్యాక్టీరియా గుర్తింపు
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్



శ్రీకాకుళంలో తాగునీటి పైపులైన్ పరిశీలిస్తున్న వీరపాండియన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'శ్రీకాకుళం నగరంలో సేకరించిన తాగునీటి నమూనాల్లో ప్రమాదకరమైన 'ఈ-కోలి' బ్యాక్టీరియా ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. డయేరియా వ్యాప్తికి ఇదే ప్రధాన కారణం' అని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి శ్రీకాకుళంలోని డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. సేకరించిన నీటి నమూనాల్లో 11 చోట్ల ఈకోలి బ్యాక్టీరియా ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. కాగా.. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు డయేరియా లక్షణాలతో కురుపాం సామాజిక ఆసుపత్రిలో చేరారు. వారిలో ఇద్దరిని శుక్రవారం ఉదయం డిశ్చార్జి చేశారు.

మేలో టీచర్ల బదిలీలు

- 20 వేల మంది బదిలీ అయ్యే అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలు మే నెలలో చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది సుమారు 20వేల మంది టీచర్లు ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం ఉందని అంచనా. బదిలీల్లో ఇచ్చే సర్వీస్ పాయింట్లకు గతేడాది తరహాలో డెసిమల్స్‌లోనే పాయింట్లు ఇవ్వనున్నారు. పలు అంశాలపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో మంగళగిరిలోని విద్యాభవన్‌లో సమావేశం నిర్వహించారు. టెన్త్ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల బాధ్యతల కేటాయింపుపై ప్రధానంగా చర్చ జరిగింది. చాలామంది టీచర్లను దూర ప్రాంతాల్లోని కేంద్రాలకు కేటాయించారని, వాటిని మార్చాలని ప్రతినిధులు కోరారు. బాగా ఎక్కువ దూరం కేటాయించిన వారిని మారుస్తామని అధికారులు చెప్పారు. 50 శాతంపైగా టీచర్లకు బాధ్యతలు ఇచ్చిన 79 పాఠశాలల్లో నిబంధనల మేరకు మార్పులు చేయనున్నారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమైనప్పుడు అన్ని తరగతుల విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు నిర్వహించాలని అధికారులు స్పష్టం చేశారు.

నేటినుంచి 3వ ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని కిమ్స్ విద్యాసంస్థల ప్రాంగణం వేదిక కానుంది. ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో జరిగే ఈ సభల నిర్వహణ కోసం కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు) ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభా ప్రాంగణానికి దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వేదికగా నామకరణం చేశారు. కిమ్స్ ప్రాంగణంలో మూడు ప్రధాన వేదికలతో పాటు 16 చిన్న వేదికల ద్వారా తెలుగు సభలను నిర్వహిస్తున్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థిని గీతికకు మొదటి ర్యాంకు



కె.గీతిక

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థిని కె.గీతిక ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రథమ ర్యాంకు సాధించినట్టు విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. మొత్తం 300 మార్కులకు గాను ఆమె 285 మార్కులు సాధించినట్టు ఆయన వెల్లడించారు.

రూ.5,400 కోట్లతో టీటీడీ వార్షిక బడ్జెట్!

- నేటి ధర్మకర్తల మండలి సమావేశంలో ఆమోదం

తిరుమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం శనివారం తిరుమలలో జరగనుంది. చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు, ఉన్నతాధికారులు అన్నమయ్య భవనంలో జరిగే ఈ సమావేశంలో పాల్గొననున్నారు. దాదాపు 87 అంశాలతో తయారుచేసిన అజెండా అంశాలపై చర్చ జరగనుంది. ప్రధానంగా 2026-27 వార్షిక బడ్జెట్ దాదాపు రూ.5,400 కోట్లతో ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. అలాగే హుండీలో నగదు రహిత కానుకల సమర్పణ కోసం 'శ్రీవారి ముడుపు పత్రం' విధానంపై చర్చ జరిపి తీర్మానం చేయనున్నారు. గతంలో బోర్డు తీసుకున్న నిర్ణయాలు, వాటి పురోగతిపై కూడా సభ్యులు చర్చిస్తారు.

జగన్ కనుసన్నల్లోనే లడ్డూ కల్తీ : శ్రీనివాసానంద

విజయవాడ(గవర్నర్‌పేట), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ కనుసన్నల్లోనే శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో అపచారం జరిగిందని పలువురు వక్తలు మండిపడ్డారు. శుక్రవారం విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసనంద సరస్వతి మాట్లాడారు. లడ్డూ ప్రసాదాన్ని కల్తీచేసి మహాపచారానికి పాల్పడ్డారని, దీనికి బాధ్యులను దేవుడు తప్పనిసరిగా శిక్షిస్తారనే నమ్మకం ఉందన్నారు. అమరావతి శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, మాచర్ల శివరామ దీక్షితుల వారి పీఠం మాతాజీ తదితరులు ప్రసంగించారు. సమావేశంలో సాధు పరిషత్ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తూ పలు తీర్మానాలు ఆమోదించారు.

జనసేన కేంద్ర కార్యాలయంలో యువకుడి వీరంగం

మంగళగిరి సిటీ/కవిటి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి బైపాస్ రోడ్డులోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. శ్రీకాకుళం జిల్లా గొర్లెపాడు పంచాయతీ ఖాజూరు గ్రామానికి చెందిన నారద నీలాద్రి శుక్రవారం ఉదయం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చాడు. సెక్యూరిటీ కంట పడకుండా ఇతర వాహనాల చాటున లోపలకు ప్రవేశించాడు. అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో సెక్యూరిటీ ప్రశ్నించారు. వారిని నెట్టివేస్తూ బయటకు వచ్చి ఇనుప రాడ్డుతో రెండు కార్ల అద్దాలను ధ్వంసం చేశాడు. మరో కారుపై దాడి చేసేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ అడ్డుకుని మంగళగిరి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నీలాద్రిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో కుట్ర కోణం దాగి ఉందా అనే అంశంపై విచారిస్తున్నారు.

అనంతలో 37.1 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగింది. రాయలసీమలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2నుంచి 4డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. శుక్రవారం దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 37.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు ఉపరితల ద్రోణి ప్రభావంతో రాయలసీమలో అక్కడక్కడా జల్లులు కురిశాయి. శనివారం కూడా సీమలో జల్లులు కురిసే అవకాశం ఉందని, కోస్తాలో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది.

బిడ్డా... మమ్మల్ని క్షమించు!

19 ఏళ్లయినా నీకు న్యాయం చేయలేకపోయాం.. మా పోరాటం అరణ్య రోదనగా మిగిలిపోయింది

- ఆయేషా తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం
- కుమార్తె అవశేషాలను అప్పగించిన బెజవాడ సీబీఐ కోర్టు



విజయవాడ కోర్టు నుంచి ఆయేషా శరీర అవశేషాలను ర్యాలీగా తీసుకెళుతున్న ఆమె తల్లిదండ్రులు ఇక్బాల్ బాషా, సంషాద్ బేగం తదితరులు

విజయవాడ/తెనాలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'బిడ్డా... మమ్మల్ని క్షమించు. 19 ఏళ్లయినా నీకు న్యాయం చేయలేకపోయాం. పోలీసు, సీబీఐ, న్యాయవ్యవస్థల్లో ఏ ఒక్కటి నీకు న్యాయం చేయలేదు'.. అంటూ ఆయేషా మీరా తల్లిదండ్రులు కోర్టులో కన్నీళ్లు మున్నీరయ్యారు. బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా హత్యాచారం కేసును విజయవాడలోని సీబీఐ కోర్టు ఇటీవల కొట్టివేసిన విషయం తెలిసిందే. రీపోస్టుమార్టం కోసం సీబీఐ సేకరించిన బాధితురాలి అవశేషాలను తీసుకొనేందుకు ఆయేషా తల్లిదండ్రులు ఇక్బాల్, సంషాద్ బేగం, ముస్లిం మత పెద్దలు శుక్రవారం తెనాలి నుంచి విజయవాడ వచ్చారు. బెజవాడ బార్ అసోసియేషన్ కార్యాలయం నుంచి న్యాయవాదులు, మహిళా సంఘాలతో కలిసి ఆయేషాకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. సీబీఐ కోర్టు వరకు ర్యాలీ చేశారు. ఆయేషా తల్లిదండ్రులు తమ ఆవేదనను న్యాయాధికారి అన్నపూర్ణకు విన్నవించుకున్నారు. "ఈ కేసులో బాధితులను నిందితులు చేశారు. నిందితులను సాక్షులు చేశారు. మా పోరాటం ఒక అరణ్య రోదనగా మిగిలింది. మాకు న్యాయం కావాలి" అని విలపించారు. సంతకాలు చేసే క్రమంలో "బిడ్డా... మమ్మల్ని క్షమించు. నీకు న్యాయం చేయలేకపోయాం" అంటూ బోరున విలపించారు. అనంతరం కోర్టు నుంచి ఎంజీ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి అవశేషాలను సీల్డ్ బాక్స్‌లో గుంటూరు జిల్లా తెనాలికి అంబులెన్స్ ద్వారా తీసుకెళ్లారు. ఆయేషా శరీర భాగాలను తెనాలి చెంచుపేట ముస్లిం శ్మశానవాటికలో తిరిగి ఖననం చేశారు. ముస్లిం యువకులు, కూటమి నాయకులు ర్యాలీగా వచ్చి వారి కుటుంబానికి సంఘీభావం తెలియజేశారు.

హైకోర్టు జడ్జితో విచారణ చేయాలి

దోషులకు శిక్ష పడిన రోజే ఈ కేసు మూతపడినట్టవుతుందని ఇక్బాల్ అన్నారు. ఖననం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని.. హైకోర్టు సిటింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీబీఐ తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. ప్రాణాలతో ఉన్నంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విజయవాడలో తల్లి సంషాద్ మాట్లాడుతూ.. సామాన్యులకు న్యాయం జరగదని తమ కేసు ద్వారా తేలిందన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఇంటి దొంగ!

బాధితులకు అప్పగించాల్సిన బంగారు నగలు తాకట్టు.. అధికారుల హెచ్చరికలతో రెండు రోజుల్లో తిరిగి జమ

- గతంలోనూ రికవరీ సొమ్ము నుంచి రూ.50 వేలు స్వాహా
- ట్రెజరీకి చెల్లించాల్సిన ట్రాఫిక్ చలాన్ల మొత్తం మాయం
- తిరుపతి రూరల్ స్టేషన్ కానిస్టేబుల్‌పై ఆరోపణలు
- ఎస్పీ దృష్టికి వెళ్లకుండా తొక్కిపెట్టిన ఎస్‌బీ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ బాధితులకు అప్పగించాల్సిన బంగారు నగలు తాకట్టు పెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. గతంలోనూ ఆయన రూ.50వేల రికవరీ సొమ్ముతో పాటు ట్రాఫిక్ చలాన్ల మొత్తాన్ని కూడా నొక్కేశారని పోలీసు వర్గాలే ఆరోపిస్తున్నాయి. దొంగల నుంచి రికవరీ చేసిన నగదు, నగలను వాటి సొంతదారులకు కోర్టు ద్వారానే పోలీసులు అప్పగిస్తారు. దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తయ్యేవరకు చోరీ సొత్తు ఆయా పోలీస్ స్టేషన్లలోనే భద్రపరుస్తారు. ప్రతీ స్టేషన్‌లోనూ ఎంతో కొంత మొత్తం రికవరీ సొత్తు ఉండటం సాధారణమే. ఇలాగే తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికవరీ సొత్తు నుంచి సుమారు రూ.12 లక్షలు విలువజేసే 90 గ్రాముల బంగారు నగలు మాయమైనట్టు విశ్వసనీయ సమాచారం. అప్రమత్తమైన అధికారులు ఇంటి దొంగను గుర్తించి నిలదీశారు. ఉన్నతాధికారులకు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించడంతో... అవసరానికి కుదువ పెట్టుకున్నానని చెప్పిన సదరు కానిస్టేబుల్ రెండు రోజుల్లో ఆ నగలు తిరిగి ఇచ్చేసినట్టు తెలుస్తోంది.

గతంలోనూ ఇదే తీరు..

2023లోనూ ఈ కానిస్టేబుల్ ఇదే పోలీస్ స్టేషన్‌లో ఉంచిన రికవరీ సొమ్ము నుంచి రూ.50వేలు కాజేస్తూ సీసీ కెమెరాకు దొరికిపోయినట్లు సమాచారం. అయినా ఆ డబ్బులు ఆయన తిరిగి ఇవ్వకపోవడంతో తన ఆధీనంలోని సేఫ్ లాకర్ (బీరువా) నుంచి నగదు చోరీ అయినందుకు బాధ్యత వహిస్తూ అప్పటి స్టేషన్ రైటర్ ఆ మొత్తాన్ని జమ చేసినట్టు తెలుస్తోంది. అలాగే పదేళ్ల క్రితం ఆయన ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో పని చేసినప్పుడు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్రాఫిక్ చలాన్ల మొత్తాన్ని నొక్కేసినట్టు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. అప్పట్లో వాహన చలాన్లను మాన్యువల్‌గా రాసేవారు. చలానా బుక్‌లను జిల్లా పోలీసు కార్యాలయం జారీ చేసేది. కొత్తబుక్ తీసుకొచ్చే బాధ్యతను అప్పటి ఎస్ఐ ఈ కానిస్టేబుల్‌కు అప్పగించారు. ఈయన చలానా పుస్తకాలు జారీచేసే సిబ్బందికి ముడుపులు సమర్పించి కొత్త రసీదు పుస్తకం తీసుకొని, ట్రెజరీలో చెల్లించాల్సిన మొత్తాన్ని స్వాహా చేసినట్టు సమాచారం. శాఖాపరమైన చర్యలకు బాధ్యులు కాకుండా ఉండేందుకు అప్పటి ఎస్ఐ ఆ మొత్తాన్ని చెల్లించి బయటపడినట్టు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. రూరల్ కానిస్టేబుల్ నగలు కాజేసిన విషయం స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) సిబ్బందికి తెలిసినప్పటికీ వారు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు దృష్టికి తీసుకెళ్లలేదని తెలుస్తోంది. ఇలాంటి విషయాలపట్ల ఎస్పీ కఠినంగా వ్యవహరిస్తారన్న భయంతో సదరు కానిస్టేబుల్ ఎస్‌బీ సిబ్బంది కాళ్లావేళ్లా పడటంతో వారు మౌనంగా ఉన్నట్లు సమాచారం.

హాథీరాంజీ మఠానికి

కొత్త మహంత్‌ను నియమించొద్దు!

స్టే విధించిన సుప్రీంకోర్టు.. మఠం ఆస్తుల విక్రయాలు, బదిలీలకు వీల్లేదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ స్వామి హథీరాంజీ మఠం మఠాధిపతి (మహంత్) పదవి నుంచి అర్జున్‌దాస్‌ను తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధార్మిక పరిషత్ తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ఆయన స్థానంలో కొత్త మఠాధిపతిని నియమించవద్దని స్పష్టంచేసింది. అలాగే మఠానికి చెందిన ఆస్తులను విక్రయించడం లేదా అన్యాక్రాంతం చేయడం లాంటి చర్యలకు పాల్పడవద్దని ఆదేశించింది. తనను అకారణంగా తొలగించారంటూ అర్జున్ దాస్ దాఖలుచేసిన వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం..తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొత్త మఠాధిపతి నియామక ప్రక్రియపై స్టే విధించింది. మఠం ఆస్తులను ప్రస్తుతానికి విక్రయించకూడదని లేదా బదిలీ చేయకూడదని స్పష్టం చేసింది. వివాదం పరిష్కారమయ్యేంత వరకు మఠం ఆస్తులు, ఆదాయ వ్యయాలకు సంబంధించి పక్కాగా ఖాతాలను నిర్వహించాలని ఆదేశించింది. ఈ వ్యవహారంతో పాటు ఆస్తుల నిర్వహణపై అవసరమైతే జ్యుడీషియల్ అధికారుల ద్వారా పూర్తి స్థాయి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది.

కజ్జికాయల కోసం

చిన్నల్లుడి గొడవ!

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో ఓ వింత ఫిర్యాదు పోలీసు గ్రూపులో నవ్వుల పువ్వులు పూయించింది. ఉరవకొండలో గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఓ ఇంటికి ముగ్గురు అల్లుళ్లు రాగా, చిన్నల్లుడు మినహా.. మిగిలిన ఇద్దరికీ అత్తింటివారు కాస్త ఎక్కువ మర్యాద చేశారు. దీంతో ఆగ్రహించిన చిన్నల్లుడు గొడవకు దిగడంతో అత్త 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఓ కానిస్టేబుల్ ఆ ఇంటికి వెళ్లి చిన్నల్లుడిని ప్రశ్నించగా, 'చూడండి సార్.. పెద్దల్లుళ్లిద్దరికీ కజ్జికాయలు పెట్టారు. నాకు పెట్టడం లేదు. ఇదేం మర్యాద..? మీరే న్యాయం చెప్పండి' అని తనకు జరిగిన అవమానం గురించి వివరించాడు. దీంతో ఆ కానిస్టేబుల్ కజ్జికాయలను ముగ్గురు అల్లుళ్లకూ తానే సమంగా పంచి తిరిగొచ్చారు. ఈ విషయం ఉన్నతాధికారులకు గ్రూపులో నివేదించగా అది చూసి పోలీసు అధికారులు, సిబ్బంది నవ్వు ఆపుకోలేకపోయారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పొంగిన ప్రేమలు!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ఒకే ఒక్కరోజు ఇజ్రాయెల్ పర్యటనతో ఇరుదేశాల సంబంధాల్లో నవశకానికి నాందిపలికారని మీడియా చర్చల్లో కొందరు విశ్లేషకులు మురిసిపోతున్నారు. 'సేమ్ పించ్' అంటూ దేశాధినేతలు ఇద్దరూ జోకులు వేసుకోవడం నుంచి దేశాల మధ్య సాన్నిహిత్యం వరకూ స్నేహం ఒక్కసారిగా అనేకమెట్లు ఎక్కిందని సంతోషిస్తున్నారు. ఇరుదేశాలూ తమబంధాన్ని అదనంగా 'ప్రత్యేక' చేర్చి వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయిని పెంచుకోవడమే కాక, రేపోమాపో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని కూడా చేసుకోబోతున్నాయి. మిత్రుడికంటే ఎక్కువ అని మోదీని నెతన్యాహూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. పర్యటన ఆరంభం నుంచి తిరిగి విమానం ఎక్కించే వరకూ మోదీని క్షణం కూడా విడిచిపెట్టలేదు. అంత గౌరవంగా చూసుకొని, ఎంతో ఘనంగా సత్కరించి పంపుతున్నప్పుడు మీరూ వచ్చి మా ఆతిథ్యాన్ని స్వీకరించండి అని ఆహ్వానించడం మర్యాద కనుక మోదీ అదే చేశారు.

వాణిజ్యం, వ్యవసాయం, విద్య, ఇంధనం, సైబర్‌స్పేస్ తదితర మొత్తం పదిహేడు రంగాల్లో ఉభయదేశాల మధ్యా ఒప్పందాలు కుదిరాయి. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా మిలటరీ హార్డ్‌వేర్ రెండుదేశాలూ కలిసి అభివృద్ధిచేస్తాయి. దీర్ఘకాలిక భాగస్వామ్యం స్థాయి మరింత హెచ్చింది కనుక రక్షణ రంగంలో ఇజ్రాయెల్ సహకారంతో పాటు వాటా కూడా హెచ్చుతుంది. కృత్రిమమేధ, క్వాంటమ్, కీలక ఖనిజాల రంగాల్లోనూ ఇజ్రాయెల్ సహకారం లభించబోతోంది. ఇక, శాంతి, స్థిరత్వం, ఘర్షణలు, ఉగ్రవాదం ఇత్యాది పదజాలంతో మోదీ చేసిన ప్రకటనలు నెతన్యాహూకు ఎంతో సంతృప్తి కలిగించి ఉంటాయి. డిసెంబరులోనే నెతన్యాహూ ఈ పర్యటన తేదీని ప్రకటించిన నేపథ్యంలో, మోదీ మద్దతు సాధించడానికి ఈ స్వల్ప సమయాన్ని నెతన్యాహూ ఎంతో ప్రణాళికాబద్ధంగా వినియోగించుకున్నట్టుంది. ఈ ఏడాది ఆయన ఎన్నికలు ఎదుర్కోబోతున్న తరుణంలో మిగతా దేశాధినేతల రాకపోకలు ఆయనకు అవసరం. ప్రపంచమంతా తనను హీరోగా చూస్తున్నదని చెప్పుకోవడం ముఖ్యం. మోదీ పర్యటన ఈ విషయంలో ఆయనకు రాజకీయంగా ఉపకరిస్తుంది. ఏడేళ్ళక్రితం పర్యటనలో కంటే మోదీని నెతన్యాహూ అధికంగా కీర్తించడం, ఆలింగనాలు చేసుకోవడం అందుకే. గాజాను సంపూర్ణంగా నేలమట్టం చేసి, శాంతి ఒప్పందం అంటూ ఒకటి ఎట్టకేలకు కుదిరినప్పటికీ, ఇప్పటికీ పాలస్తీనియన్లకు తగినంత ఆహారం అందనివ్వకుండా, దాడులు కొనసాగిస్తున్న నెతన్యాహూతో నేరుగా భేటీ కావడానికి మిగతాదేశాధినేతలు సంకోచిస్తున్న తరుణంలో మోదీ పర్యటన జరిగింది. వేలాదిమంది పాలస్తీనియన్లను సంహరించి, లక్షలాదిమందిని తరిమికొట్టి, మహామారణకాండకు కారకుడైన నెతన్యాహూ గాజా తదనంతరం వెస్ట్‌బ్యాంక్ సంపూర్ణ దురాక్రమణకు కుట్రలకు తెరదీసిన నేపథ్యంలో, ముస్లిం దేశాలతో పాటు, యూరప్ కూడా తీవ్రంగా గర్హిస్తున్నది. అందరూ తనను వదిలేసిన ఈ పాడుకాలంలో మోదీ తనకు అండగా వచ్చినందుకు నెతన్యాహూకు సంతోషం కలగడం సహజం. అవినీతి మీద విచారణలు, కేసులు ఒకపక్క ఉండగా, మరోపక్క 2023నాటి ఘటనలో భద్రతా వైఫల్యం కూడా నెతన్యాహూ పీకకు చుట్టుకుంది. తనవద్ద ఉన్న ఇజ్రాయెలీ బందీలను హమాస్ అప్పగించిందే తప్ప, సుదీర్ఘయుద్ధంలో నెతన్యాహూ సైన్యాలు ఎవరినీ విడిపించింది లేదు. హమాస్ అంతుచూస్తానన్న ఆయన శపథం కూడా నెరవేరలేదు. యుద్ధాన్ని సాగదీసి ఇజ్రాయెలీ ప్రజలకు, సైన్యానికి, ఖజానాకు తీవ్ర నష్టం కలిగించాడన్న ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో, హమాస్ ఉగ్రదాడిని ప్రస్తావించి, ఆ ఘోరకలిలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల భారత్ తన బాధను పంచుకుంటున్నదంటూ ప్రకటించిన మోదీ, తదనంతరం నెతన్యాహూ సాగించిన మారణ కాండలో డెబ్బైరెండువేల మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయిన ఊసెత్తకపోవడం ఇజ్రాయెల్ ప్రధానికి నచ్చింది. పశ్చిమాసియాలో శాంతి మీద భారత ప్రయోజనాలు ఆధారపడివున్నాయని అంటున్న భారత ప్రధాని అక్కడి మిగతాదేశాలతో సత్సంబంధాల గురించి పెద్దగా పట్టించుకోకుండా, ఇజ్రాయెల్ పక్షాన గట్టిగా నిలబడతామని హామీ ఇచ్చినందుకు నెతన్యాహూ తెగ సంతోషించివుంటారు. మిగతాదేశాలు తనను యుద్ధపిపాసిగా వెలివేస్తే, అంతర్జాతీయ న్యాయస్థానం యుద్ధనేరస్తుడిగా ముద్ర వేస్తే, మోదీ వచ్చి పలుమార్లు ఆలింగనం చేసుకున్నందుకు నెతన్యాహూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. విమానం ఎక్కబోతున్న మోదీని ఏకంగా ముద్దాడేంత ప్రేమ పొంగుకొచ్చింది అందుకే.

> ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న ఎన్నికల అనంతరం కాంగ్రెస్ దిగువ సభ లేదా ఉభయ సభలపై రిపబ్లికన్లు నియంత్రణ కోల్పోయే అవకాశమున్నది. అదే జరిగితే ట్రంప్ పదవీ కాలంలో మిగిలిన రెండు సంవత్సరాలలోనూ ఆయన పాలన అప్రయోజనకరమవుతుంది. ట్రంప్ ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థలను గౌరవిస్తూ మళ్లీ నియమ ఆధారిత వాణిజ్య పద్ధతులను అనుసరించవచ్చు. అప్పటివరకు భారత్‌కు సానుకూల ప్రత్యామ్నాయాలు ఏవీ లేవు. శీఘ్రగతిన మారిపోతుండే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సదా సంసిద్ధమై ఉండడమే తరుణోపాయం.

అమెరికాతో అనుక్షణ అనిశ్చితి!

సమస్త దేశాలపై తాను విధించిన సుంకాలను కొట్టివేస్తూ అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అహాన్ని దెబ్బతీసింది. ప్రపంచం హర్షిస్తున్న ఆ తీర్పు పట్ల ట్రంప్ మహాశయుడు మూర్ఛ రోగిలా ప్రతిస్పందించారు! అంతర్జాతీయ అత్యవసర పరిస్థితి ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద ఏప్రిల్ 2, 2025న అమెరికా అధ్యక్షుడు సమస్త దేశాలపై 'ప్రతీకార' సుంకాలు విధించిన విషయం విదితమే.

సుప్రీంకోర్టు తీర్పును ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. సుంకాలను వ్యతిరేకించిన సర్వోన్నత న్యాయమూర్తులను ఆయన నానా దుర్భాషలాడారు (గౌరవనీయ న్యాయమూర్తులను విమర్శించడంలో ట్రంప్ ఉపయోగించిన పరుష పదజాలం మన దేశంలో అయితే కోర్టు ధిక్కారం కిందకు వచ్చి ఉండేది). అమెరికా సర్వోన్నత న్యాయమూర్తులు తమ రాజ్యాంగ స్ఫూర్తికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. ఇందుకు వారు అభినందనీయులు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

గౌరవనీయ న్యాయమూర్తులను దూషించడంతోనే ట్రంప్ ఆగిపోలేదు. ఆ తీర్పు వెలువడిన తరువాత ఇతరేతర చట్టాలను ఉపయోగించుకుని అవే సుంకాలను సమస్త దేశాలపై ట్రంప్ మళ్లీ విధించారు. అవి: వాణిజ్య చట్టం, 1974లోని సెక్షన్ 122; వాణిజ్య విస్తరణ చట్టం, 1962లోని సెక్షన్ 232; వాణిజ్య చట్టం, 1974లోని సెక్షన్ 301 (ఈ చట్ట నిబంధన కింద పలు దేశాల ఎగుమతులపై దర్యాప్తునకు ఆదేశిస్తానని ట్రంప్ హెచ్చరించారు); స్మూట్–హాలే టారిఫ్ చట్టం, 1930లోని సెక్షన్ 338.

సరే, అమెరికా సుప్రీంకోర్టు తీర్పు అనంతరం భారత్ పరిస్థితి ఏమిటి? అమెరికాకు మన ఎగుమతులు దాదాపు అన్నిటిపైన 15శాతం సుంకం వసూలు చేస్తారు (ఫిబ్రవరి 2, 2026న ప్రకటించిన సుంకం రేటు 18 శాతం). వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ కింద ఉక్కు, అల్యూమినియం, సెమీ కండక్టర్లు, కొన్ని ఆటో విడిభాగాలపై 50శాతం సుంకం అమల్లో ఉంది. ఈ సుంకాలన్నీ హెచ్చు స్థాయిలో ఉన్నాయి. ఇవన్నీ మన ఎగుమతులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి, సందేహం లేదు. సుప్రీంకోర్టు తీర్పు అనంతర పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు భారత ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఉభయ దేశాలపై ఆ తీర్పు తక్షణ ప్రభావమేమిటో ఒక పరిణామం చెప్పకనే చెప్పింది: అమెరికా–భారత్ మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి తుదిరూపునిచ్చి సంతకాలు చేసేందుకు అవసరమైన చర్చలను వాయిదా వేయాలని ఇరుపక్షాలూ అంగీకరించాయి. అయితే ఆ చర్చలు ఎప్పుడు జరిగేది ఏ దేశమూ నిర్దిష్ట తేదీని పేర్కొననే లేదు!

ఇదిలావుండగా సుంకాల పరిణామాలపై అమెరికా కాంగ్రెస్ నుంచి పలు వాదనలు వినవస్తున్నాయి. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఐఈఈపీఏ సుంకాలను కొట్టివేసేంత వరకు, కార్యనిర్వాహక వర్గం, అంటే అధ్యక్షుడు ట్రంప్ పాలనా యంత్రాంగం పన్ను విధింపు అధికారాలను స్వాయత్తం చేసుకోవడంపై అమెరికా కాంగ్రెస్ నిస్సహాయంగా ఉండిపోయింది. తీర్పు వెలువడిన తరువాత కూడా ఏమీ చేయలేని పరిస్థితిలోనే కాంగ్రెస్ ఉన్నది. సుంకాల విధింపునకు తనకు అధికారాలు ఇవ్వాలని కాంగ్రెస్‌ను ట్రంప్ అభ్యర్థించే అవకాశం లేదు. సుంకాల విధింపు విషయంలో కాంగ్రెస్ ఇప్పటికే తనకు అధికారాల నిచ్చిందని ఆయన విశ్వసిస్తున్నారు. ట్రంప్ సుంకాల భారాన్ని తప్పించుకునేందుకు ఇటీవలే అమెరికా



వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న దేశాలు కూడా నిస్సహాయంగా ఉన్నాయి. ఫిబ్రవరి 2న ఒక సంయుక్త ప్రకటనపై సంతకం చేసిన భారత్ సంగతి మరి చెప్పనవసరం లేదు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న ఏ దేశ ప్రతినిధి కూడా తనను కలిసి తాము వాణిజ్య ఒడంబడిక నుంచి వైదొలగనున్నట్టు చెప్పలేదని అమెరికా వాణిజ్యమంత్రి జమియెసన్ గ్రీర్ చెప్పారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న దేశాలు 'మంచి బాలురు' అని వారు 'మంచి బాలురు'గానే ఉండిపోవాలని ఆయన పరోక్షంగా సూచిస్తున్నారు. ట్రంప్ అయితే సూటిగా హెచ్చరికలు జారీ చేశారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం నుంచి వైదొలిగిన దేశాలపై చాలా కఠినమైన భారీ సుంకాలు విధిస్తామని ఆయన ఇప్పటికే రెండుసార్లు హెచ్చరించారు. మంచి బాలురు మంచి బాలురుగా ఉండకుండా ఎదురుతిరిగితే అందుకు తగిన శిక్ష నెదుర్కోవలసి ఉంటుందనేది ట్రంప్ హెచ్చరికలలో అంతర్ గర్భితంగా ఉన్న బెదిరింపు. ట్రంప్ మాటలను తేలిగ్గా తీసుకోవడానికి వీలులేదు. ఈ పెద్దమనిషి చపలచిత్తుడు. పైగా పక్షపాత వైఖరులతో వ్యవహరించే వ్యక్తి. సుంకాలను కేవలం పన్నులుగా కాకుండా ఆయుధాలుగా ఆయన పరిగణిస్తున్నారు.

ప్రపంచ దేశాలన్నీ ఏకమై అమెరికాకు వ్యతిరేకంగా నిలబడాలని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా పిలుపునిచ్చారు. అర్థవంతమైన, అవశ్యం పాటించవలసిన పిలుపు అది. బహుశా చైనా మినహా, మరే దేశమూ అమెరికాను ఒంటరిగా ధిక్కరించగల స్థితిలో లేదు. అసమానతలు అనంతంగా ఉన్న ప్రపంచమిది. అత్యంత శక్తిమంతమైన దేశాధ్యక్షుడు నియమరహితంగా ఎవరూ ఊహించలేని రీతుల్లో వ్యవహరిస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలకు భారత్ తలొగ్గింది. జపాన్, దక్షిణ కొరియా లాంటి అభివృద్ధి చెందిన దేశాలకూ ఈ పరిస్థితి తప్పలేదు. అధ్యక్షుడు ట్రంప్ అమెరికాలో ప్రజాదరణను కోల్పోతున్నారు. ఆయన పాలనప్రశస్తంగా ఉందని అంగీకరిస్తున్ వారు అంతకంతకూ తగ్గిపోతున్నారని పలు సర్వేలు ధ్రువీకరిస్తున్నాయి. ఉద్యోగాలు దుర్లభమైపోతున్నాయి. ధరలు భరించలేని రీతిలో పెరిగిపోతున్నాయి. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతోంది. ట్రంప్ అనుసరిస్తున్న వలసల వ్యతిరేక విధానానికి ప్రజామోదం ఉన్నది. అయితే దానిని అమలుపరుస్తున్న తీరుతెన్నులు మానవ హక్కులు, బాలల హక్కులు, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని హరించివేస్తున్నాయి.

అమెరికా అంతర్గత వ్యవహారాలలో పరిణామాలు ట్రంప్ పలుకుబడిని దెబ్బతీశాయి. ఆయన రాజకీయ ప్రాబల్యాన్ని బలహీనపరిచాయి. నవంబర్ 2026లో జరగనున్న ఎన్నికలలో ఆయనకు పరాజయాలు అనివార్యమనే అభిప్రాయం గట్టిగా వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ దిగువ సభ లేదా ఉభయ సభలపై రిపబ్లికన్లు నియంత్రణ కోల్పోయే అవకాశమున్నది. అదే జరిగితే ట్రంప్ పదవీ కాలంలో మిగిలిన రెండు సంవత్సరాలలోనూ ఆయన పాలన అప్రయోజనకరమవుతుంది. అయితే ట్రంప్ ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థలను గౌరవిస్తూ మళ్లీ నియమ ఆధారిత వాణిజ్య పద్ధతులను అనుసరించవచ్చు. అప్పటివరకు భారత్‌కు సానుకూల ప్రత్యామ్నాయాలు ఏవీ లేవు. శీఘ్రగతిన మారిపోతుండే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సదా సంసిద్ధమై ఉండడమే తరుణోపాయం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

భారత్ పరిణత ప్రజాస్వామ్యమేనా?

న్యూఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శనకు తీవ్ర ప్రతిస్పందనలు వెల్లువెత్తాయి. ఆగ్రహం, పరిహాసం, నీతి పాఠాలు... ఆ ఘటన చోటుచేసుకున్న కొద్ది నిమిషాలలోనే సామాజిక మధ్యమాలలో ఈ అసంకల్పిత ప్రతిస్పందనలు వ్యక్తమయ్యాయి. ప్రైమ్ టైమ్ టీవీ షోలలో ఆ నిరసన ప్రదర్శన ఉదంతానికి సంబంధించిన వీడియోను మళ్లీ మళ్లీ చూపారు. యాంకర్ల వ్యాఖ్యలు: కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన 'దారితప్పిన నిరసన', 'నివ్వెరపరిచింది', 'కలవరపరుస్తోంది' ఇంకా, 'దేశ ప్రతిష్ఠను మంట గలిపింది' అని కూడా గట్టిగా అన్నారు.



నిజానిజాలను తరచి చూద్దాం. యువజన కాంగ్రెస్ కార్యకర్తల నిరసనపై విమర్శనాత్మక ప్రతిస్పందనలు పూర్తిగా న్యాయబద్ధమైనవే. ఒక అంతర్జాతీయ సదస్సు సందర్భంగా అటువంటి నిరసన ప్రదర్శన ఒక పేలవమైన రాజకీయ వ్యక్తీకరణ అని నేను భావిస్తున్నాను. ఇంకా సంతకాలు చేయని భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆ అంతర్జాతీయ ఏఐ సదస్సుకు ఎలాంటి సంబంధం లేదు. అయినా కాంగ్రెస్ కారకర్తలు తమ నిరసనకు అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. మీరు ఆ నిర్ణయంతో ఏకీభవించవచ్చు లేదా ఏకీభవించకపోవచ్చు. ప్రజాస్వామిక చర్చ కచ్చితంగా అటువంటి అభిప్రాయ భేదాలపైనే ఆరంభమౌతుంది. ప్రతి నిరసన వివేకవంతమయింది కాదు. ప్రతి నినాదం ప్రతి ఒక్కరినీ ఒప్పించలేదు. యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన వలే ప్రతి నిరసన కూడా మీడియా దృష్టిని తమపై కేంద్రీకరింప చేసుకునే లక్ష్యంతోనే నిర్వహించడం కద్దు. మీరు ఒక నిరసన ప్రదర్శనను ఏవగించుకోవచ్చు. అయితే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు చట్టబద్ధత లేకుండా చేయడం అంగీకరించాల్సిన విషయం కాదు. శాంతియుతంగా నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ కాంగ్రెస్ విభాగం అధ్యక్షుడిని బెయిల్ మంజూరుకు ఆమోదయోగ్యం కాని న్యాయ నిబంధనల కింద అరెస్ట్ చేశారు. 'జాతికి వ్యతిరేకంగా 'కుట్ర' చేశారని కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలపై అభియోగాలు మోపారు. ఇది నిరసన ప్రదర్శనలపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఢిల్లీ పోలీసులు గుజరాత్ పోలీసులు పరిపూర్ణత నిచ్చిన నిబంధనలనే అనుసరించి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఎటువంటి బహిరంగ సమావేశాలనైనా అడ్డుకునేందుకై గుజరాత్ పోలీసులు తరచూ నిరంతరాయంగా సెక్షన్ 144ను అమలుపరిచేవారు. పోలీసులు ఆ సెక్షన్‌ను అలా అమలుపరచడం న్యాయ సమ్మతం కాదని, పౌరుల హక్కులపై రాజ్యాంగ విరుద్ధంగా ఆంక్షలు విధించడమేనని గుజరాత్ హైకోర్టు గత ఏడాది ఒక తీర్పులో స్పష్టం చేసింది.

ఒక విధంగా మోదీ–షాల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న గుజరాత్ రాజ్యాధికార నమూనా జాతీయ స్థాయికి చేరుకున్నది. ఇప్పుడు దీనిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు (బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు కూడా) అమలుపరుస్తున్నాయి. తమ రాజకీయ ప్రత్యర్థులకు ఇబ్బందులు సృష్టించేందుకు స్థానిక పోలీసులను నిస్సిగ్గుగా ఉపయోగించుకోవడం సాధారణమైపోయింది. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకనే ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. ఇది ప్రమాదకరమైన ధోరణి. ప్రజా జీవితంలో ప్రజాస్వామిక అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు వివాదాస్పద అంశాలపై మాట్లాడకుండా పాలకపక్ష సభ్యులు అడ్డుకుంటున్నారు. ప్రజాస్వామిక చర్చకు ఇదెలా దోహదం చేస్తుంది? పార్లమెంటులో చట్టాలపై ఎలాంటి చర్చ లేకుండానే వాటిని ఆమోదింప జేసుకోవడంలో పాలకపక్షం ఆరితేరిపోయింది. అధికారంలో ఉన్నవారికి ఇబ్బంది కలిగించే ప్రశ్నలు సంధించేందుకు ప్రధాన స్రవంతి మీడియా సంకోచిస్తోంది. విశ్వవిద్యాలయాలలో ప్రత్యామ్నాయ అభిప్రాయాలను వ్యక్తం చేసేవారిని 'జాతి–వ్యతిరేకులు'గా ముద్ర వేస్తున్నారు. పౌర సమాజం కూడా అధికారంలో ఉన్నవారిని సవాల్ చేసేందుకు సాహసించలేకపోతోంది. తాము నిర్వహిస్తోన్న ఓ కార్యక్రమంలో ప్రసంగించేందుకు నటుడు నసీరుద్దీన్ షాను ముంబై విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. తీరా ప్రసంగించాల్సిన రోజు సమీపిస్తుండగా ఎటువంటి వివరణ ఇవ్వకుండానే ఆ ఆహ్వానాన్ని రద్దు చేసింది. మోదీ సర్కార్‌ను విమర్శిస్తుండడమే నసీరుద్దీన్ షా చేసిన అపరాధం! యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు తదితరులు కూడా అధికారంలో ఉన్నవారికి భయపడుతున్నారు. సర్వత్రా భయం రాజ్యమేలుతోంది.

> ఏఐ సమ్మిట్‌లో యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన– ఒక నిరసన ప్రదర్శన గురించి తక్కువగాను, ప్రజాస్వామిక స్వభావం గురించి ఎక్కువగాను చెబుతోంది. పరిపక్వ ప్రజాస్వామ్యం భిన్నాభిప్రాయాల వెల్లువకు బెదిరిపోదు. వాటిని అణచివేయదు.. చర్చిస్తుంది. పరిహసిస్తుంది. ఉపేక్షిస్తుంది. ఆపై ముందుకు సాగిపోతుంది. నిరసన ప్రదర్శనల వల్ల కాకుండా భిన్నాభిప్రాయాల అణచివేత కారణంగానే ప్రజాస్వామ్య వ్యవస్థలు క్షీణించిపోయాయని చరిత్ర ఘంటాపథంగా చెబుతోంది.

ఇబ్బందికరమైన వాస్తవాలనే కాకుండా తప్పుడు విషయాలనూ అతిగా మాట్లాడేందుకు అనుమతించి రక్షణ కల్పించే వ్యవస్థే ప్రజాస్వామ్యం. మనం ఆమోదించే నిరసన ప్రదర్శనల పట్ల ఎలా వ్యవహరిస్తున్నామన్నది కాకుండా మనకు ఆగ్రహం కలిగించే అసంబద్ధ నిరసనలకు ఎలా ప్రతిస్పందిస్తున్నామన్నదే ప్రజాస్వామిక పరిణతికి గీటురాయి. అయితే పాలకుల ప్రవృత్తి ఇందుకు విరుద్ధంగా ఉంటున్నది. బెయిల్‌కు అవకాశంలేని ఆరోపణలనేవి తీవ్ర నేరాలకు పాల్పడినవారిపై మోపడానికి మాత్రమే ఉద్దేశించినవి. అంతేగానీ శాంతియుతంగా భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారిని కట్టడి చేసేందుకు వారిపై అటువంటి ఆరోపణలు మోపకూడదు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

అటువంటి చర్య అరెస్టయినవారినే కాకుండా ఇంకా చాలా మందిని ప్రభావితం చేస్తుంది. అందులోని సంకేతం సూక్ష్మమైనదేకానీ శక్తిమంతమైనది: నిరసన తెలిపితే భారీ మూల్యం చెల్లించడం అనివార్యమవుతుంది.

భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను అరాచకంగా భావించకూడదు. అలా భావించడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజా సార్వభౌమాధికారం, జవాబుదారీతనం ప్రాతిపదికన నిర్మితమవుతాయి. చర్చలు వాటిని బలోపేతం చేస్తాయి. మరి అసమ్మతి, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ శాంతిభద్రతలకు ముప్పుగా పరిగణించడం ప్రజాస్వామ్య పటిష్ఠతకు ఎలా దోహదం చేస్తుంది? స్వేచ్ఛగా సమావేశమయ్యేందుకు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ప్రజలకు హక్కు ఉండితీరాలి. లోపభూయిష్ఠ నిరసన ప్రదర్శనల వల్ల కాకుండా ప్రజాస్వామిక అవకాశాలు తగ్గిపోవడం వల్లే ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనమవుతాయన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.

ఏఐ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శనల వల్ల భారతదేశ గౌరవానికి భంగం కలిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎప్పుడూ ప్రతీకాత్మకతకు రంగస్థలాలుగా ఉండడం పరిపాటి. ప్రజల నిరసన మౌన ప్రదర్శనలు, నిరాహారదీక్షలు తదితర రూపాల్లో వ్యక్తమవుతుంది. నిరసన ప్రదర్శనలు ఒక తీర్చిదిద్దిన పద్ధతిలో జరగవు. అలాగే అవి ఆహ్లాదకరంగా కూడా ఉండవు. నిరసన కార్యక్రమాల స్వభావమే అలా ఉంటుంది. 2004లో మణిపూర్ మహిళలు ఇంఫాల్‌లో అస్సాం రైఫిల్స్ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన నగ్న ప్రదర్శనను గుర్తు చేసుకోండి. ఆ ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతి పరిచింది. యావద్భారతదేశాన్ని కుదిపివేసింది. మణిపూర్‌లో అణచివేతల క్రూరత్వాన్ని ప్రపంచానికి చాటింది. ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన జాతీయ అవమానంగా పరిగణించడం సబబేనా? భారత గణతంత్ర రాజ్య గౌరవం సమున్నతమైనది, దృఢమైనది. రాజకీయ నిరసన ప్రదర్శనలు ఆ గౌరవానికి ఎటువంటి హాని కలిగించలేవు. ఇది స్పష్టం. ఇంతకూ జాతీయ అవమానం అంటే ఏమిటి? ఎప్పుడు దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది? రాజకీయ నిరసన ప్రదర్శనల వల్ల అయితే కాదు. వ్యవస్థీకృత వైఫల్యాలే జాతి గౌరవాన్ని కించపరుస్తాయి గానీ, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే నిరసన ప్రదర్శనలు కావని సునిశ్చితంగా చెప్పవచ్చు. ప్రభుత్వ యంత్రాంగంలో ఎల్లెడలా అవినీతి ప్రజల జీవితాలను ఎలా ఇబ్బందులపాలు చేస్తుందో మనం చూడడం లేదా? ఆ అవినీతి దేశానికి ఎలా ప్రతిష్ఠాకరం? రాజ్యాంగ సంస్థలు, వ్యవస్థలు బలహీనపడడం దేశానికి ప్రతిష్ఠాకరమా? వాటికి పూర్తిగా భిన్నమైన ఒక నిరసన ప్రదర్శన దేశ గౌరవాన్ని ఎలా తగ్గించివేస్తుంది?


నిరసనకారుల పట్ల అతిగా ప్రతిస్పందించడం ద్వారా వారి నిరసనలకు ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యాన్ని సంతరింపజేస్తాయి. అరెస్టయిన నిరసనకారులు కూడా తమ నిరసనల లక్ష్యం పొందదగిన ప్రాధాన్యం కంటే ఎక్కువగా ప్రజల దృష్టిని ఆకర్షిస్తారు. సమాజం సానుభూతినీ పొందుతారు. పరిణత ప్రజాస్వామ్యం శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతను విస్మరించదు. అదే సమయంలో పౌర స్వేచ్ఛలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతనూ గుర్తిస్తుంది. ఈ రెండిటి మధ్య ఒక సమతుల్యత ఉండేలా పరిణత ప్రజాస్వామ్యం జాగ్రత్త వహిస్తుంది. నిరసనలను నియంత్రించడం ఒక విషయం అయితే భిన్నాభిప్రాయాన్ని నేరంగా పరిగణించడం మరో విషయం. ఈ రెండింటి మధ్య వ్యత్యాసమున్నది. ఏఐ సమ్మిట్‌లో యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన ఒక నిరసన ప్రదర్శన గురించి తక్కువగాను, ప్రజాస్వామిక స్వభావం గురించి ఎక్కువగాను చెబుతోంది. నిజానికి ఆ నిరసన ప్రదర్శన మన ప్రజాస్వామ్య స్వభావానికి ఒక పరీక్ష. ఎందుకని? పరిణత ప్రజాస్వామ్యం భిన్నాభిప్రాయాల వెల్లువకు బెదిరిపోదు. ప్రభుత్వాధికారాలను ఉపయోగించి వాటిని అణచివేయదు.. వాటిని చర్చిస్తుంది. పరిహసిస్తుంది. ఉపేక్షిస్తుంది. ఆపై ముందుకు సాగిపోతుంది. నిరసన ప్రదర్శనల వల్ల కాకుండా భిన్నాభిప్రాయాల అణచివేత కారణంగానే ప్రజాస్వామ్య వ్యవస్థలు క్షీణించిపోయాయని చరిత్ర ఘంటాపథంగా చెబుతోంది. భారత ప్రజాస్వామ్యపు మహాబలం అభిప్రాయాల వైవిధ్యమే కానీ పోలీసు రాజ్య నిరంకుశత్వ పద్ధతులు కానేకాదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

జనపదాల జాగృతికి ఆలంబన

అగ్నిపర్వతం నుంచి పెల్లుబికిన లావా తన దారిలో ఉన్నవాటన్నిటినీ తనలో విలీనం చేసుకుంటుంది. అదే తీరులో– జమీందారీ దుర్మార్గాలకు అతలాకుతలమవుతున్న ప్రజల దైన్యం, ధిక్కారాల నుంచి ప్రభవించిన 'జమీన్ రైతు' వారపత్రిక ఉద్యమ భావజాలం ఆనాటి నెల్లూరు తదితర ప్రాంతాల సమాజ జీవిత రంగాలన్నిటినీ తనలో అంతర్భాగం చేసుకుందనడంలో అతిశయోక్తి లేదు. జమీందారీ వ్యతిరేక పోరాటం, బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటాలకు ఊతమిచ్చే లక్ష్యంతో నెల్లూరు వెంకట్రామానాయుడు ఈ వార పత్రికను స్థాపించి అహరహం కృషి చేశారు.

నాడు– బ్రిటిష్ వలసవాదం, దాని దోపిడీ యంత్రాంగమైన జమీందారీల వ్యవస్థతో ఆయా ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు తీవ్ర దోపిడీకి, అణచివేతకు నిర్బంధానికి గురై హీనంగా బతుకులీస్తుండేవారు. ఈ తరుణంలో జమీందారీ వ్యతిరేక ప్రజా ఉద్యమం నుంచి 1930 మార్చి 2న ఉద్భవించిన 'జమీన్ రైతు' పత్రిక సహజంగానే ఆర్థికంగాను, అధికారం రీత్యా ఎన్నో అవాంతరాలను, అవరోధాలను ఎదుర్కొంది. వివిధ రూపాల్లో జమీందారీ దౌర్జన్యాలకు, బ్రిటీష్ ప్రభుత్వ నిర్బంధ, అణచివేత చర్యలకు గురైనా, ప్రజలను జాగృతం చేసింది. నెల్లూరు ప్రాంతీయుల



ఆత్మగా, తెలుగు నేలలోని జమీందార్లకు సింహస్వప్నంగా, దక్షిణ భారత జమీందారీ రైతుల ఉద్యమాలకు స్ఫూర్తిదాయకంగా, దేశవ్యాప్త జమీందారీ విధానానికి ఒక ఢక్కాగా 'జమీన్ రైతు' పత్రిక నిలిచింది. స్వాతంత్ర్యోద్యమ సందర్భంలో, జమీందారీ వ్యవస్థ వ్యతిరేక పోరాటంలో కీలకపాత్ర పోషించిన అంత్యవాసులు, రైతులు, గ్రామీణుల సమస్యలను, జీవితాలను, ఉద్యమాలను వెలుగులోకి తీసుకొచ్చి, జాతిని జాగృతం చేయడంలో ఈ 'జమీన్ రైతు' పత్రిక పాత్ర చరిత్రాత్మకమైనది. అంతటి మహోన్నత పాత్ర నిర్వహించిన ఈ వారపత్రిక– అనేక ఆటుపోట్లను, అడ్డంకులను, దౌర్జన్యాలను, నిషేధాలను దాటుకుని 2029 నాటికి తన వందేళ్ల ప్రస్థానంలోకి అడుగిడబోతుండడం అత్యంత ఆసక్తికరమైన విషయం.

కేవలం ఆశయం ప్రధానమైనంత మాత్రాన్నే పత్రిక దానంతటది నడుస్తుందనుకోవడం పొరపాటు. దీని వెనుక అంకితభావం, చిత్తశుద్ధి దృఢ సంకల్పమున్న నిర్వాహకుల పాత్ర ఎంతో ఉంది. వెంకట్రామానాయుడు తన జీవితాన్ని త్యాగం చేసి 'జమీన్ రైతు' పత్రికను ఆ రెండు (జమీందారీ, బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటం) పార్శ్వాల పోరాటానికి ఒక భావజాల కేంద్రంగా నడిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం ఆర్థిక, సాంఘిక రాజకీయ న్యాయం కోసం, ఆ ఉద్యమాలకు ఆలంబనగా ప్రజలను జాగృతం చేసిన పత్రిక... ఆ ప్రాంత ప్రజల అంతరాత్మగా మారింది. జమీందార్ల నిరంకుశత్వం, బ్రిటిష్ వలస దోపిడీని ఎదుర్కోవడమేగాక, ఎవ్వరూ శ్రద్ధ చూపని పల్లెటూళ్లను, వాటి సమస్యలను లోకానికి చాటడం కూడా 'జమీన్ రైతు' లక్ష్యం. "జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై పోరాడేందుకు ఎన్నో పత్రికలున్నాయి. కానీ, పల్లెటూళ్లను ప్రపంచానికి పరిచయం చేసే పత్రికలు అరుదు. పల్లెల వార్తలకు, రైతు సమస్యలకు ప్రాధాన్యం నొసగుతూ, కేవలం పల్లెటూరు వాణిగా 'జమీన్‌రైతు' ఉండాలని భావిస్తున్నాను" అని ఆ పత్రిక వ్యవస్థాపకుడు నెల్లూరు వెంకట్రామానాయుడు ప్రకటించడమే కాకుండా, ఆ లక్ష్యాన్ని సాధించారు కూడా. "కేవలం వార్తాపత్రికగా వారపత్రికకు స్థానం లేదు. వార్తల వెనుక విశేషాలు, వ్యక్తులు, విమర్శలతో కూడి ఉంటేనే వారపత్రికకు మనుగడ. ఎప్పుడూ ఒత్తిడితో పనిచేయాలి, వివాదాస్పదుడిగా బతకాలి" అంటూ పత్రిక మాజీ సంపాదకులు నెల్లూరు శ్రీరామమూర్తి వెలువరించిన వాక్యాలు అక్షర సత్యాలు. వారి అనంతరం కూడా ఎన్నో ఒడిదుడుకులను, ఆటుపోట్లను, దాడులను, తిరస్కారాలను ఎదుర్కొని, గత మూడున్నర దశాబ్దాలుగా ఈ వార పత్రిక నెల్లూరు డోలేంద్ర ప్రసాద్ సంపాదకత్వంలో విజయవంతంగా కొనసాగుతోంది. 2029లో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పత్రికా ప్రేమికులు, పాఠకులు, రచయితలు, సాహిత్యకారులు తమ తమ స్పందనలు తెలియజేయగలరు.

● వెన్నెలకంటి రామారావు

(మార్చి 2: 'జమీన్ రైతు' పత్రిక వార్షికోత్సవం)

రానున్నది కృత్రిమ మేధో యుగం!

దక్షిణార్థగోళంలోని ప్రపంచ దేశాల్లోనే తొలిసారి నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఏఐ సదస్సు ఢిల్లీలో జరగడం భారత్‌కు తలమానికం. ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్ని ప్రభావితం చేసే శక్తి కృత్రిమ మేధకు ఉంది. అందుకు తగినట్టుగా వ్యక్తులు, సమాజం తయారుకావాలి. రానున్న మార్పుల్ని పసిగట్టి అవకాశాల్ని ఒడిసిపట్టాలి. లేదంటే ఇంతవరకూ బలమైనవిగా భావించబడుతున్న దేశాలు బలహీనమవుతాయి. సరిగ్గా వినియోగించుకోగలిగిన దేశాలు బలం పుంజుకుంటాయి. ఈ మార్పుల్ని ముందే ఊహిస్తూ అమెరికా, చైనా దేశాలు కృత్రిమ మేధ పరిశోధనలపై అధికంగా ఖర్చు పెడుతున్నాయి. అక్కడి ప్రైవేట్ రంగం కూడా అదే దారిలో ఉంది. ఫలితంగా చాట్ జీపీటీ, డీప్ సీక్ లాంటివి జనంలోకి వచ్చాయి. మన దేశం కూడా ఈ అంశంపై ఇప్పటికే దృష్టి పెట్టినా, బలోపేతం కావడానికి సమయం పడుతుంది. దానికి కారణం సంస్థాగత లోపాలు. ముఖ్యంగా నిధుల కొరత, నాణ్యమైన, చవకైన ఉన్నత విద్య అందుబాటులో వెనకంజ. అందుకే మనం దేశ పునాదులను దృఢపరచుకోవాల్సి ఉంది. మౌలికంగా అవసరమయ్యే డేటా సెంటర్‌లు, బహుళజాతి పెద్ద సంస్థలు భారత్‌లో పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావడానికి ముఖ్య కారణం– వారికి ఇక్కడ చవకగా సదుపాయాలు, వనరులు కల్పించడం. ఏదైతేనేం, ఆ సంస్థలు వచ్చాక కలిగే ఫలాలు దేశ ఖజానా నింపడంతోపాటు, ప్రజల సౌకర్యాలు, ఉపాధి పెరిగే పరిస్థితిని కలిగిస్తేనే ఫలితం ఉన్నట్లు భావించాలి.

దేశం కేవలం ఏఐ వినియోగ మార్కెట్‌గా మిగిలిపోకుండా సేవలందించే, ప్రయోజనం పొందే శక్తిగా మారాలి. వ్యవసాయ, వైద్య, రక్షణ, పాలన తదితర రంగాల్లో ముద్ర వేయగల ఈ సాంకేతికత ప్రజాబాహుళ్యానికి, ప్రగతికి అవసరమైన రీతిలో తయారుకావాలి. ఏవో కొన్ని దేశాల గుత్తాధిపత్యానికి వీలు కల్పించని రీతిలో ప్రపంచ ఏఐ విధానం రూపకల్పన జరగాలి. శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు పెద్దపీట వేయడంతో పాటు, ఫలాల్ని ప్రజల వరకూ తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యం కావాలి. ఆ దిశగా అడుగులు వేయగల శక్తి నవభారతానికి ఉంది. చిత్తశుద్ధితో అందుకు తోడ్పడాలి.

– డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ



ఆయేషా కేసును
సమాధి కానివ్వం

- న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదు
- ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే మా ఆశలన్నీ : తండ్రి ఇక్బాల్ బాషా
- ఆయేషా శరీర భాగాలకు తిరిగి అంత్యక్రియలు

8



7వ సారి ముందుగా పింఛను



- మూడు జిల్లాల్లో 7 లక్షల మంది కళ్లల్లో ఆనందం

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అవ్వతాతలు, ఏ ఆధారం లేని ఆడబిడ్డలు, దివ్యాంగులకు ముందుగానే పింఛను పండగ వచ్చింది. ఈ ఏడాది వరుసగా మూడు నెలల నుంచి లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే పింఛను నగదు అందజేసి కూటమి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టింది. మార్చి ఒకటిన ఆదివారం కావడంతో శనివారమే ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయనుంది. ఇప్పటికే స్వర్ణ గ్రామ, వార్డు(సచివాలయ) ఉద్యోగులు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకున్నారు. తెల్లవారు జాము నుంచే పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సాయంత్రం 6.18 (శనివారం)
సహరి : ఉదయం 5.08 (ఆదివారం)

ముందస్తు ఆనందం

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 7,05,712 మంది పింఛనుదారులున్నారు. వీరికి రూ.306.37 కోట్ల పింఛను నగదు అందజేయనున్నారు. గుంటూరు జిల్లాలో 2,51,879 మందికి రూ.109.55 కోట్లు, పల్నాడు జిల్లాలో 2,70,369 మందికి రూ.118.54 కోట్లు, బాపట్ల జిల్లాలో 1,83,464 మందికి రూ.78.28 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. 21 నెలల కూటమి పాలనలో ఇలా ఒక రోజు ముందుగానే పింఛను ఇవ్వడం ఇది ఏడోసారి.

పొదుపు మహిళలకు..
లక్ష్మీ కటాక్షం



- డ్వాక్రాలకు ప్రభుత్వం తీపి కబురు
- ఎన్టీఆర్ విద్యా లక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాలకు శ్రీకారం
- పావలా వడ్డీకే రుణాలు..

భూగర్భంలోకి.. కరెంటు వైర్లు



- అమరావతి నిర్మాణాలకు తొలగిపోనున్న అడ్డంకులు
- ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ

8



సౌరశక్తి.. అనాసక్తి

సూర్యఘర్ యోజన లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి. సౌరశక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తున్నా.. విద్యుత్ వినియోగదారుల నుంచి స్పందన కానరావడం లేదు. సౌర పలకల ఏర్పాటులో వారి అవగాహన రాహిత్యం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలను చైతన్య పరచడంలో అధికార యంత్రాంగం కూడా విఫలమవుతోంది. ఇళ్లకు వెళ్లిన విద్యుత్ సిబ్బంది మొబైల్‌లో పేరు, ఓటీపీ నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,56,069 దరఖాస్తులను విద్యుత్ అధికారులు ఆమోదించారు. కానీ, 11,693 యూనిట్లు మాత్రమే ఏర్పాటు చేయడం గమనార్హం. కేవలం 4.56 శాతం మాత్రమే సోలార్ ప్లాంట్లు నెలకొల్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇచ్చినా ఆశించించిన మేర ఫలితాలు కానరావడం లేదు.

సూర్యఘర్ పథకంపై స్పందన కరువు

- రాయితీ ఉన్నా కానరాని స్పందన
- అనుమతించిన దరఖాస్తులు 2,56,069
- సోలార్ యూనిట్ల ఏర్పాటు 11,693
- 4.56 శాతం దాటని లక్ష్యం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సూర్యఘర్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. ప్రజలకు విద్యుత్ చార్జీల భారం తగ్గించి, విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వినియోగాన్ని తగ్గించడం ద్వారా కాలుష్యాన్ని అదుపు చేసే నేపథ్యంలో సోలార్ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సూర్యఘర్ పథకం కింద గృహాలకు సోలార్ యూనిట్ల ఏర్పాటులో పెద్ద ఎత్తున రాయితీలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో నెలకొన్న నిర్లక్ష్యం వల్ల.. స్పందన కనిపించడం లేదు.

సౌరశక్తితో ఆదాయం..

గృహ విద్యుత్ (మిగతా 8వ పేజీలో)

సౌరశక్తి యూనిట్ల ఏర్పాటు ఇలా..

జిల్లా	అమోదించినవి	ఏర్పాటైన యూనిట్లు
పల్నాడు	1,35,455	2,412
బాపట్ల	56,751	4,389
గుంటూరు	63,863	4,892

పల్నాడు జిల్లాలో సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం 1,35,598 దరఖాస్తులు వచ్చాయి. విద్యుత్ శాఖ 1,35,455 దరఖాస్తులను అమోదించింది. వీటి సామర్థ్యం 3,08,289 కిలో వాట్లుగా అంచనా వేశారు. యూనిట్ ఏర్పాటుకు సంబంధిత ఏజెన్సీలకు 50,307 అనుమతి ఇవ్వగా ఇప్పటి వరకు 2,412 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి.

బాపట్ల జిల్లాలో 56,799 దరఖాస్తులకు 56,751 అమోదించారు. వీటి సామర్థ్యం 1,59,251 కిలో వాట్లుగా అంచనా. ఏజెన్సీలకు 40,406 యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వగా.. ఇప్పటి వరకు 4,389 యూనిట్లను ఏర్పాటు చేశారు.



నకరికల్లు: నరశింగపాడులో సోలార్ పలకల ఏర్పాటును పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

గుంటూరు జిల్లాలో 63,863 దరఖాస్తులను ఆమోదించారు. వీటి సామర్థ్యం 1,43,216 కిలో వాట్లుగా నిర్ధారించారు. యూనిట్లు అమర్చేందుకు వెండార్లకు 1,46,540కి అనుమతి ఇవ్వగా.. ఇప్పటికి 4,892 యూనిట్లను ఏర్పాటు చేశారు.

కష్టమే

మండిపోనున్న ఉమ్మడి గుంటూరు

ఈ వేసవికి గుంటూరు విపరీతంగా మండిపోనుంది. గతం లో ఎన్నడూ చూడనంత వేడి, ఉక్కపోత జిల్లా వాసులను అతలాకుతలం చేయనున్నాయి. ఇది హీట్ రిస్క్ ఇండెక్స్ వెల్లడించిన వాస్తవం. ఈ నివేదిక చూస్తే దేశంలోని ఉష్ణోగ్రత హైరిస్క్ జోన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా కూడా చోటు దక్కించుకుంది. తాజాగా వెలువడిన జాతీయస్థాయి హీట్ రిస్క్ అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ దేశంలో ఎండల తీవ్రతకు అధికంగా గురయ్యే రాష్ట్రాల్లో ఒకటిగా గుర్తించగా, రాష్ట్రం నుంచి ఈ జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లా చేరింది.

- అత్యధిక ఉష్ణోగ్రతల జోన్‌లోకి జిల్లా
- హీట్ రిస్క్ ఇండెక్స్‌లో వెల్లడి
- 20 నుంచి 25 రోజులు వడగాల్పులు
- గత మూడేళ్లను మించి కాయనున్న ఎండలు


గుంటూరు సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వాస్తవానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఫిబ్రవరి మూడో వారం నుంచే ఎండలు ఉగ్రరూపం దాల్చాయి. రోజు రోజుకు వేడి పెరుగుతుండటం హీట్ రిస్క్ ఇండెక్స్‌కు బలం చేకూరుస్తోంది. గతంలో ఏడాదికి వడగాల్పులు 7 - 8 రోజులపాటు మాత్రమే నమోద య్యేవి. ఇప్పుడు ఈ సంఖ్య 20 - 25 రోజులకు చేరింది. భారత వాతావరణ విభాగం గణాంకాల ప్రకారం గత దశాబ్దంలో హీట్ వేవ్ రోజుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో 44- 46 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడం సాధారణమైపోతోంది. 2016, 2019, 2024లో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలను ఈ సంవత్సరం అధిగమించే సూచనలున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.


● నగర విస్తరణ, వేడికి ఉక్కిరిబిక్కిరి

గుంటూరు నగర పరిధి వేగంగా విస్తరిస్తుండటంతో పచ్చదనం తగ్గి, కాంక్రీట్ కట్టడాలు పెరిగాయి. తారు రహదారులు, బహుళ అంతస్తుల భవనాలు పగలు వేడిని గ్రహించి రాత్రి పూట విడుదల చేయడంతో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా తగ్గడం లేదు. ఈ పరిస్థితిని 'అర్బన్ హీట్ ఐ లాండ్' ప్రభావంగా పర్యావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. చెట్ల కొరత, బహిరంగ ప్రదేశాల క్షీణత, నీటి వనరుల తగ్గుదల.. ఇవన్నీ కలిసివచ్చి నగర వాతావరణాన్ని మరింత ఉష్ణంగా మార్చుతున్నాయి.

● ఆరోగ్యానికి పెరుగుతున్న ముప్పు

ఈ ఏడాది హీట్ రిస్క్. (మిగతా 8వ పేజీలో)





సింహ వాహనంపై
నృసింహుని గ్రామోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు శుక్రవారం రాత్రి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత దేవస్థానం మాడ వీధుల్లో విహరించిన అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం సాగింది. మార్గం మధ్యలో భక్తులు టెంకాయలు సమర్పించి శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకస్వాములు సింహ వాహన విశిష్టతను వివరిస్తూ నరులలో సింహము వంటి నారసింహుడు హింసించే స్వభావం కలిగిన వారిని హింసించి.. తన భక్తులకు అభయమిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించిన వారికి దుర్మార్గుల నుంచి భయాన్ని తొలగిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవానికి మాల్యవంతం వెంకట కృష్ణమాచార్యులు జ్ఞాపకార్థం ఆయన మనుమలు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఈఓ కె.సునీల్ కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్త బృందం కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మిద్దె సెంటరులోని శ్రీ ప్రపత్తి ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే ఉదయం చిన్న శేష వాహనంపై పురవీధుల్లో స్వామి వారు విహరించారు. చిన్న శేష వాహనానికి మంగళగిరి పట్టణానికి చెందిన దేవతి భగవన్నారాయణ, పద్మజ దంపతులు కైంకర్యపరులుగా వ్యవరించారు.





దర్శించుకుంటున్న భక్తులు

గురుకుల ప్రవేశ పరీక్ష రేపు

- ఉమ్మడి జిల్లాలో 20 కేంద్రాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీ ఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇందుకోసం 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 5వ తర గతిలో ప్రవేశానికి 1,630 మంది, ఇంటర్‌లో ప్రవేశానికి 21,99 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంట వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలి. ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలు 20 ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 80 సీట్లు చొప్పున మొత్తం 1,600 సీట్లు, 14 జూనియర్ కళాశాలల్లో ఒక్కో కళాశాలలో 80 సీట్లు చొప్పున 1,120 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు.

ప్రచార లోపం...

ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి విద్యార్థులను చైతన్యపరచడంలో.. అధికారులు పూర్తిగా విఫలం అయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. వివిధ పాఠశాలల హెచ్ఎంలు, విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకోవడంలో.. గురుకుల సొసైటీ సమన్వయకర్తలు ఆసక్తి చూపడం లేదని విమర్శలున్నాయి. గురుకుల పాఠశాలల్లో 1,600 సీట్లు ఉంటే వచ్చిన దరఖాస్తులు 1630 లోపే ఉన్నాయి. ఇక ఇంటర్‌లో 1,120 సీట్లు అందుబాటులో వచ్చిన దరఖాస్తులు 2,199 మాత్రమే. అంటే సాంఘిక సంక్షేమశాఖ గురుకుల సొసైటీ కో-ఆర్డినేటర్ స్థాయిలో ప్రచారంలో పూర్తిగా విఫలం అయినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సాంఘిక సంక్షేమ శాఖలో.. విజిలెన్స్ కలకలం

- గ్రేడ్-1 ఉద్యోగోన్నతులపై సమగ్ర సమాచారంతో రావాలని ఆదేశం

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖలో జరిగిన అక్రమ ఉద్యోగోన్నతులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. అర్హత లేకున్నా అనేక మందికి గ్రేడ్-1 అధికారులుగా ప్రమోషన్లు కల్పించారని, ఇందులో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోణలు వచ్చాయి. దీంతో సమగ్ర వివరాలతో విజిలెన్స్ కార్యాలయానికి రావాలని శుక్రవారం పిలుపు వచ్చింది. కోర్టు అదేశాల మేరకు జిల్లాలో ఐదుగురు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు గ్రేడ్-1 ప్రమోషన్ కల్పించాలని గతంలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిని అదునుగా తీసుకుని.. ఓ ఉన్నతాధికారి, ద్వితీయ శ్రేణి అధికారి, సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఓ ఉద్యోగి కలిసి కోర్టు ఉత్తర్వుల్లో ఉన్న ఐదుగురితో పాటు.. మరో ఐదుగురికి గ్రేడ్ -1 పదోన్నతులు కల్పించారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షలకు పైగా వసూళ్లు చేసినట్లు అప్పట్లో ఫిర్యాదులు వచ్చాయి. పదోన్నతులు పొందిన వారిలో సస్పెండ్ అయిన, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన వారూ ఉన్నారు. దీంతో కలెక్టర్‌కు, విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. రాష్ట్రస్థాయి డైరెక్టర్ విచారణ కోసం విజిలెన్స్ అధికారులకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తాజాగా విజిలెన్స్ కార్యాలయం నుంచి అక్రమ ఉద్యోగోన్నతులు ఇచ్చిన వారికి నోటీసులు జారీ అయ్యాయి. ఉద్యోగోన్నతుల విధివిధానాలు, కోర్టు ఉత్తర్వులు, ఎంత మందికి ఉద్యోగోన్నతి కల్పించింది, వారి అర్హతలు, సర్వీస్ రికార్డులు సమర్పించాలని కోరినట్లు సమాచారం. సాంఘిక సంక్షేమశాఖలో డిప్యూటేషన్‌పై పని చేసే ఓ అధికారి, ఇక్కడి నుంచి బదిలీ అయిన మరో అధికారికి నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని ఆదేశాలిచ్చినట్లు సిబ్బంది వెల్లడించారు.

పకడ్బందీగా పది పరీక్షల నిర్వహణ

- కలెక్టర్ అన్సారియా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో పది పబ్లిక్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో ఆమె సమీక్షించారు. మార్చి 16 నుంచి జరిగే పరీక్షలకు జిల్లాలో 149 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 26,699 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. కేంద్రాల్లో బెంచీల కొరత, తాగునీటి ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఈఓ డాక్టర్ షేక్ సలీమ్ బాష, పరీక్షల నిర్వహణ కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి తిరుమలేష్, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

సీజేఐ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తుళ్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆదివారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, సీఎం చంద్రబాబునాయుడు ఏపీ జుడిషియల్ అకాడమీ, హైకోర్టు గెస్ట్ హౌస్ శంకుస్థాపన, జడ్జిల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా.. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ పార్థసారథి, జేసీ శ్రీవాస్తవతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. పిచుకలపాలెం వద్ద ఎన్- 16 సమీపంలో జ్యూడీషియల్, సీఆర్డీఏ, పోలీసు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మురళీ కృష్ణ వారి వెంట ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మానవత్వం చాటుకున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. చిలకలూరిపేట-కొండవీడు రహదారిలోని పోతవరం సమీపంలో శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అదే మార్గంలో బనగానపల్లె వెళ్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి ప్రమాదాన్ని గమనించి, వెంటనే తన కాన్వాయ్‌ని ఆపారు. గాయపడిన ఆటో డ్రైవర్ పరిస్థితి తెలుసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ అందించి, వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేసి సమీప ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు.



ఆటో డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తూ..

జీఎస్టీ 2.0 జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 ప్రాంతీయ పరిశ్రమలపై ప్రభావం సమీక్ష, దిశల బైట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం తన చాంబర్‌లో వీసీ ఆచార్య కె.గంగాధరరావు రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలంతో కలిసి ఆవిష్కరించారు. మార్చి 12, 13 తేదీల్లో సదస్సు జరుగుతుందని, 2025 లో అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలు, పరిశ్రమల పన్నుల వ్యవస్థ, వస్తు సేవలపై పన్ను తగ్గింపై.. ప్రాంతీయ పరిశ్రమలు నిపుణులతో చర్చ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

3,700 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 4,200 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా.. 3700 టిక్కీలు అమ్మకం జరిగింది. 334 రకం రూ.10వేల నుంచి రూ.21,500, తేజా రకం రూ.9వేల నుంచి రూ.17500, తాలుకాయలు రూ.3 వేల నుంచి రూ.9 వేలకు అమ్మకాలు జరిగాయి.

ఐఆర్ఆర్ కేసులో అభ్యంతరాలకు గడువు

● విచారణ 11కి వాయిదా వేసిన ఏసీబీ కోర్టు

విజయవాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్) కేసు విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది. 'మిస్టేక్ ఆఫ్ ది ఫ్యాక్ట్' కింద కేసును మూసివేస్తామని సీఐడీ అధికారులు కోర్టుకు నివేదిక ఇవ్వడంతో ఈ కేసును దాఖలు చేసిన మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేశారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఏసీబీ కోర్టులో తెలపాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రామకృష్ణారెడ్డి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. అభ్యంతరాలను వ్యక్తం చేయడానికి సమయం కావాలని ఆయన తరఫు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ కోరడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు విచారణను వాయిదా వేశారు. అనంతరం న్యాయవాది మీడియాతో మాట్లాడారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పు కేసులో 18 మందికిపైగా నిందితులు ఉన్నారని, అక్రమాలు నిజమేనంటూ సీఐడీ కూడా చార్జిషీటు దాఖలు చేసిందని తెలిపారు.

ప్రతి పంటకు మద్దతు ధర.. ప్రభుత్వ లక్ష్యం

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరులోని డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా ఎరువులు అందించామన్నారు. జిల్లాలో కొత్తగా 12 ఎరువుల కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో రుణాలు అందించడంలో ఏమాత్రం వెనుకాడడం లేదన్నారు. అనంతరం బిజినెస్ మేనేజర్ హరినాథ్ ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌తో పాటు మరో మూడు అంశాలను సభలో తీర్మానం చేసి ఆమోదించారు. కార్యాలయ మేనేజర్ శ్రీనివాసరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ హరిబాబునాయుడు

ఏజీపీగా నాగేంద్రబాబు నియామకం

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని జూనియర్ సివిల్ కోర్టుల్లో ప్రభుత్వం తరఫున సివిల్ కేసులను వాదించేందుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది మేత్త నాగేంద్రబాబును నియమిస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ప్రభుత్వం తరఫున నాగేంద్రబాబు న్యాయ సేవలు అందించనున్నారు. మచిలీపట్నం, హిందూ లా కాలేజీలో న్యాయ విద్యను అభ్యసించిన నాగేంద్రబాబు, 1994 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ కొనసాగిస్తున్నారు. 18 సంవత్సరాల పాటు రేపల్లె మున్సిపాలిటీకి స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. ఆయన తండ్రి మేత్త వెంకటేశ్వర్లు సుదీర్ఘ కాలం రేపల్లెలోని పలువురు న్యాయమూర్తుల వద్ద అటెండర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. రేపల్లె, గుంటూరుకు చెందిన పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.



నాగేంద్రబాబు

భార్య మృతికి కారణమైన.. భర్తకు మూడేళ్ల జైలు

గుంటూరు(లీగల్),ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదిక కట్నం తీసుకురావాలని భార్యను హింసించి, ఆమె మృతి కారణమైన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ గుంటూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి ఎం.కుముదిని శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పేరేచర్ల గ్రామానికి చెందిన పల్లపు దుర్గాప్రసాద్‌కు గుంటూరు సంగడిగుంటకు చెందిన శ్రీనివాసరావు కుమార్తె శివరంజనితో 2007లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5లక్షల నగదు, మరో రూ.5 లక్షల విలువైన బంగారం కట్నంగా ఇచ్చారు. వీరికి ఇద్దరి సంతానం. దుర్గాప్రసాద్ పేరేచర్లలో టింబర్ డిపోను నడుపుతూ.. నష్టం రావడంతో భార్యను పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడు. దీనికి అతని బంధులు కూడా సహకరించారు. ఈ విషయాన్ని తన తమ్ముడు, తల్లికి చెప్పి శివరంజని బాధపడేది. ఈ హింసను భరించలేక 2022 ఫిబ్రవరి 26న రాత్రి కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని తాగింది. వాంతులు చేసుకోవడంతో భర్త దుర్గాప్రసాద్ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా.. వైద్యం పొందుతూ మార్చి 6న మృతి చెందింది. శివరంజని తమ్ముడు మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ డి.శ్రీనివాసరావు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు. దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు ఆరుగురిపై నేరం రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వర్ణలత భాను వాదించారు.

పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థుల ఆందోళన

● టాయిలెట్‌కి వెళ్లాలంటే.. షుగర్ ఉన్నట్లు సర్టిఫికెట్ తేవాలంటున్నారని ఆవేదన

సత్తెనపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద శుక్రవారం ఇంటర్ విద్యార్థులు ఆందోళన చేశారు. పరీక్ష రాస్తున్న తాము మరుగుదొడ్డికి వెళ్లి రావాలంటే డిపార్ట్‌మెంట్ అధికారి ఆదెయ్య ఇబ్బంది పెడుతూ, అసభ్యకరంగా మాట్లాడుతున్నాడంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. పరీక్ష కేంద్రానికి వచ్చిన ఆదెయ్య కారును అడ్డుకున్నారు. టాయిలెట్‌కు వెళ్లి వస్తామంటే.. డాక్టర్‌తో షుగర్ ఉన్నట్లు సర్టిఫికెట్ తెచ్చుకోవాలంటున్నారని, మగ పిల్లలు వెళ్తే.. తనిఖీలు నిర్వహిస్తున్నారని.. ఆందోళన వ్యక్తం చేశారు. ఆడ పిల్లల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని, టాయిలెట్‌కు పంపటం లేదని ఆరోపించారు. ఇన్విజిలేటర్ ఆదెయ్య మాత్రం పరీక్ష సమయంలో తాను స్ట్రిక్ట్‌గా ఉండటం వల్లే విద్యార్థులు ఈ విధంగా ఆరోపణలు చేస్తున్నారని, అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తాము పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఉన్న పోలీసులు వివాదాన్ని సద్దుమణిచారు. ఒక దశలో అక్కడ ఉన్న ఇన్విజిలేటర్, విద్యార్థులకు మధ్య వివాదం కూడా జరిగింది. ఈ విషయంపై పల్నాడు జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి నీలావతి దేవిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. డిపార్ట్‌మెంట్‌ల ఆఫీసర్ ఆదెయ్య, విద్యార్థుల మధ్య స్వల్ప ఆందోళన జరిగిందని, అంతకు మించి వివాదం లేదని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని చెప్పారు.



పరీక్ష కేంద్రంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ కారును అడ్డుకున్న విద్యార్థులు

జడ్పీలో ఎస్ఏలకు ఏఓలుగా ఉద్యోగోన్నతి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుందని, ప్రమోషన్లు పొందిన ఉద్యోగులు నిబద్ధత, పారదర్శకతతో పని చేసి జిల్లా పరిషత్‌కు మంచి పేరు తీసుకురావాలని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సూచించారు. జడ్పీ కార్యాలయంలో నలగురు సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు(ఏఓ)గా ఉద్యోగోన్నతి కల్పిం చారు. చైర్‌పర్సన్, సీఈఓ వీర్ల జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ ఉద్యోగోన్నతి పొందిన కె.సురేష్‌బాబు, పాండురం గస్వామి, బి.శ్రీనివాసమూర్తి, వి.శ్రీనివాసరావుకు శుక్రవారం పత్రాలు అందజేశారు. ఈ నలుగురు ఏఓలను ఉమ్మడి జిల్లాలోని మండలాలకు కేటాయించారు. సురేష్ బాబును వట్టి చెరుకూరు, పాండురంగ స్వామిని అమరావతికి, శ్రీనివాసరావును దుర్గికి, బి.శ్రీని వాసమూర్తిని నిజాంపట్నంకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అకౌంట్ ఆఫీసర్ శామ్యూల్‌పాల్, ఏఓ నిర్మల భారతి పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేసిన జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, సీఈఓ, డిప్యూటీ సీఈఓ

కారు, ద్విచక్ర వాహనం ఢీ.. వ్యక్తి మృతి

పెదనందిపాడు, ఫిబ్రవరి, 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు - పర్చూరు రహదారిలో గార్లపాడు డొంక సమీపంలో శుక్రవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా అడుసుమల్లికి చెందిన కట్టా పీటర్ పాల్(70) టీవీఎస్ మోపెడ్‌పై పెదనందిపాడు వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన గుంజ కోటయ్య కారులో గుంటూరు వైపు వస్తున్నాడు. ప్రమాదవశాత్తూ ముందు టైరు పేలడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో పీటర్‌పాల్ ఎడమ కాలు తెగి పడింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సకాలంలో శవ పరీక్ష చేయలేదని రాస్తారోకో

● రెండు గంటలపాటు నిలిచిపోయిన ట్రాఫిక్

మేడికొండూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తూ మరణిస్తే సకాలంలో శవ పరీక్ష చేయకుండా ముడుపుల కోసం పోలీసులు వేధిస్తున్నారంటూ కొర్రపాడు గ్రామస్థులు శుక్రవారం గుంటూరు - హైదరాబాద్ రహదారిపై బైఠాయించి.. రాస్తారోకోకు దిగారు. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. మృతుడు పగిడిపాటి అనిల్ (23) బంధువుల కథనం మేరకు.. అనిల్ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేసే ఒక ప్రైవేటు కాంట్రాక్టర్ వద్ద కూలీ పనులకు వెళుతుంటాడు. గురువారం గుంటూరు నగరంలోని అరండల్ పేట పోలీసు స్టేషన్ పరిధిలో పనిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రివద్ద న్యాయం చేయాలని కోరడంతో.. పోలీసు సమక్షంలో రూ.5లక్షలు కాంట్రాక్టర్ అందజేసినట్లు మృతుడి మేనమామ బూదల విజయకుమార్ తెలిపారు. మృతదేహానికి ఉదయం పోస్టుమార్టం చేయాల్సి ఉండగా అందుకు పోలీసులు సహకరించకుండా కాలయాపన చేస్తున్నారని విజయ్‌కుమార్ ఆరోపించారు. కాంట్రాక్టర్ నుంచి తీసుకున్న నగదులో.. లక్షన్నర రూపాయలు ఇస్తేనే శవ పంచనామా రాసి రిపోర్టులు ఇస్తామని అరండల్ పేట పోలీసులు డిమాండ్ చేశారని ఆరోపించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తమకు అంత ఇచ్చే స్తోమత లేదని అనిల్ కుటుంబ సభ్యులు ప్రాధేయపడినా పోలీసులు కనికరించకుండా శుక్రవారం సాయంత్రం పంచనామా పూర్తి చేయలేదని, ఫలితంగా శుక్రవారం పోస్టుమార్టం నిలిచిపోవడంతో అందోళనకు దిగాల్సి వచ్చిందని వివరించాడు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న మేడికొండూరు పోలీసులు మృతుని బంధువులతో మాట్లాడారు. అరండల్‌పేట పోలీసులతో కూడా మాట్లాడి అప్పటికప్పుడు పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.



అందోళన చేస్తున్న మృతుని బంధువులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	155, 164, 175
చికెన్ విత్ స్కిన్(కిలో)	300.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	310.00

మిర్చియార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	67,291	
అమ్మకాలు	76,521	
నిల్వ	16,062	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21000
నెంబరు. 5	13500	21000
273	----	----
341	14000	21500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18300
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	21000
దేవనూరు డీలక్స్	15500	21500
ఆర్మూరు	13000	16500
ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19500
నెంబరు. 5	----	----
273	----	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17200
బ్యాడిగి 355	14000	20500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	12000

స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి నారాయణ

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి కరకట్టకు వెళ్లే మార్గంలో జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి నారాయణ పరిశీలించారు. రాజధాని వైపు నుంచి వచ్చే సీడ్ యాక్సిస్ రోడ్డును పాత గుంటూరు హైవేకు అనుసంధానం చేస్తూ, బకింగ్ హామ్ కెనాల్‌పై ఈ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేశంగా జరుగుతు న్నాయి. కాంక్రీట్ పిల్లర్లపై స్టీల్ గడ్డర్లు, ఏర్పాటు చేస్తున్న పనుల గురించి మంత్రి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 88 గడ్డర్లకు గాను 20 గడ్డర్ల ఏర్పాటు పూర్తయినట్లు ఇంజనీర్లు వివరించారు. బ్రిడ్జి నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసు కురావాలని సూచించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నాటి కమిషనరే... నేటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

● రెండేళ్ల పాటు పాలన అందించిన సాయి ప్రసాదు
● జీఎంసీ ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు


సాయి ప్రసాదు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపడుతున్న సాయి ప్రసాదు గతంలో గుంటూరు మున్సి పల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసి తన కంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. గుంటూరు కమిషనర్‌గా 1995 ఏప్రిల్ 30 నుంచి 1997 మార్చి వరకు ప్రసాద్ విధులు నిర్వహించారు. రెండేళ్ల కాలంలో అనేక కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో నగరపాలక సంస్థకి ఆదాయం కంటే అప్పులు ఎక్కువగా ఉన్నాయి. అటువంటి పరిస్థితుల్లో ప్రత్యేక ప్రణాళికలు ద్వారా జీఎంసీ ఆదాయాన్ని పెంచి, ఆర్థిక పరిపుష్టిలోకి తీసుకువచ్చారు. జీఎంసీ ఆభివృద్ధిలో ఆయన తీసుకున్న నిర్ణయాలు నగరాభివృద్ధికి బాటలు వేశాయి. నగరంలో రోడ్ల విస్తరణ, రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి, ట్రాఫిక్ నివారణకు అనేక చర్యలను ఆనాడే ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వ పరిశీలనకు పంపారు. అటువంటి అధికారి ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు చేపట్టడంతో నగర, జిల్లా వాసులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల బస్సుకు భద్రతా పరికరాల అమరిక

● 'తులసీ సీడ్స్' చేయూత

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల బస్సుకు భద్రతా పరికరాల అమరికకు తులసీ సీడ్స్ చేయూత అందించింది. గత ఏడాది జూన్ మాసంలో తులసీ సీడ్స్ అధినేత తులసీ రామచంద్రప్రభు రూ. 33 లక్షల వ్యయంతో 55 సీట్ల కెపాసిటీ కలిగి టాటా కంపెనీ నుంచి కొనుగోలు చేసిన ఒక కొత్త బస్సును కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా నర్సింగ్ కళాశాలకు విరాళంగా అందజేశారు. అయితే నర్సింగ్ విద్యార్థినుల భద్రత కోసం మరో రూ.3 లక్షలతో ఎఫ్‌డీఎస్ఎస్, ఎఫ్ఏపీఎస్ అగ్నిమాపక సిలిండర్‌లు, ఎమర్జన్సీ డోర్‌లకు హాజర్డ్ అలారం తదితర ఏర్పాటు చేచేసి బస్సును తిరిగి నర్సింగ్ కళాశాలకు తులసీ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, ఎండీ తులసీ యోగీష్‌చంద్ర చేతులమీదుగా శుక్రవారం అంద జేశారు. ఈ సందర్భంగా రామచంద్రప్రభుకు ఏపీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వేమూరి వసుంధర, స్లీవమ్మలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయ కులు ఉగ్గిరాల సీతారామయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఝూన్సీలక్ష్మీబాయి, సత్యనారాయణ భాయ్, వై పద్మజ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటరావు, సీనియర్ అసిస్టెంట్లు ఎల్ శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌లు ఉన్నారు.



నర్సింగ్ కళాశాలకు బస్సు పరికరాలు అందజేస్తున్న తులసీ రామచంద్రప్రభు, తులసీ యోగీష్‌చంద్ర తదితరులు

12వ పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవలింగారావు
● తాలుకా కేంద్రాల వద్ద ధర్నా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు గత ప్రభుత్వం రివర్స్ పీఆర్‌సీతో నష్టం చేసి ఇబ్బంది పెడుతున్నారని, ఇదే విధానాలను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.బసవలింగారావు తెలి పారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యారంగ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో రూ.32వేల కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలు చెల్లించడంతో పాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే సమస్యల పరిష్కారంలో సాచివేత ధోరణి అనుసరిస్తోందని ఆరోపించారు. వెంటనే పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించి అన్ని బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.దాస్, లక్ష్మీనారాయణ, చక్కా వెంకటేశ్వరావు, పి.శివరామకృష్ణ, కె.శ్రీని వాసరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ కె.రమేష్, సాయిలక్ష్మీ, కిశోర్, బలరాజు, మూర్తి, జహంగీర్, భాస్కర్, అప్పారావు, కృష్ణారావు,కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణే జేపీసీ లక్ష్యం

● నూతన కమిటీ ఎన్నిక సన్నాహక సమావేశంలో ఘంటసాల

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హక్కుల పరిరక్షణ.. సమస్యల పరిష్కారమే జేపీసీ లక్ష్యం అని జిల్లా జేపీసీ నూతన కమిటీ ఎన్నిక సన్నాహక సమావేశంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఏపీఎన్జీవోల సంఘ కార్యాలయంలో గుంటూరు జిల్లా ఏపీ జేపీసీ నూతన కమిటీ ఎన్నిక సన్నాహక సమావేశం జరిగింది. ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జిల్లా స్థాయి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొని, జిల్లా జేపీసీ నూతన కార్యవర్గ ఏర్పాటుకై సమగ్ర చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం, ప్రభుత్వంతో సమన్వయంపై సమర్థవంతమైన చర్చలు చేపట్టడం జేపీసీ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, ఆర్టీసీ, గ్రామ స్వర్ణ వార్డ్ సంఘాల నేతలు బసవలింగారావు, కాకర్ల, గౌస్ రబ్బాని, కే పిచ్చయ్య, ఖలీల్, బాజీ, యశోద, పద్మజ, అంకమ్మరావులతో పాటు పలు సంఘాల నాయకులు పాల్గొని నూతన కమిటీ ఏర్పాటుకు, సంఘ ఐక్యతతో శక్తివంతమైన జేపీసీ నిర్మాణానికి మద్దతు ప్రకటించారు.

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు, పంచాయతీ కార్మికులకు జీత భత్యాలలో భారీ వ్యత్యాసం ఉందన్నారు. అనంతరం డీఆర్వో ఖాజావలి, డీపీవో నాగసాయికుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనల్లో కే శ్రీనివాసరావు, జీవీ రమణ, మస్తాన్‌వలి, సీహెచ్ రామారావు, పిల్లి మేరకరావు, రత్నకుమార్, వీరయ్య, ఇబ్రహీం, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే ఆరు నెలలు జైలుశిక్ష

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపితే ఆరు నెలల వరకు జైలుశిక్ష పడుతుందని ఐదవ అదనపు సివిల్ జడ్జి అత హెచ్చరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ కల్యాణ మండపంలో ట్రాఫిక్ రూల్స్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అల్లంశెట్టి పవన్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సింగయ్య, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత వెల్లివిరిసే మాసం రంజాన్

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత వెల్లివిరిసే మాసం రంజాన్ అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థంబాల గరువులోని జామియా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన హాజరయ్యారు. మసీదు అధ్యక్షుడు అక్బర్ మియా, ఉపాధ్యక్షుడు రహమ్, మౌలానా షబ్బీర్, మత పెద్దలు అల్తాఫ్, బాదర్, అలీఫ్‌బాబు, మస్తాన్ ఉన్నారు.

జీజీహెచ్‌లో అర్ధరాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు సరిగా వైద్య సేవలు అందడం లేదని వస్తోన్న ఫిర్యాదులు నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి ఆమె ముఖానికి మాస్కు ధరించి తొలుత అత్యవసర వైద్య సేవల విభాగంలోకి ప్రవేశించారు. ఆ సమ యంలో అక్కడున్న వైద్యులు, ఇతర సిబ్బంది కలెక్టర్‌ని గుర్తించలేదు. అనుమతి లేకుండా లోపలికి ఎందుకొచ్చారని ప్రశ్నించి ఎమర్జన్సీ వార్డులో నుంచి బయటకు వెళ్లిపోమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా అక్కడున్న రోగుల సహాయకులతో మాట్లాడారు.

జీజీహెచ్‌కు ఎప్పుడు వచ్చారు. వైద్యం ఏ విధంగా అందుతుంది వంటి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆ సమయంలో కొంతమంది సహాయకులు కింద కూర్చుని ఉండటాన్ని గమనించి వెయిటింగ్ హాల్‌లో ఉండాలని సూచించారు. ఆ తర్వాత ఆస్పత్రిలోని టాయ్‌లెట్స్‌ని పరిశీలించారు. కాసేపటికి కలెక్టర్ జీజీహెచ్ తనిఖీకి వచ్చారని తెలుసుకున్న ఆస్పత్రిలో నైట్ డ్యూటీ వైద్య సిబ్బంది పరుగుపరుగున అక్కడికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగుల విషయంలో బాధ్యతా యుతంగా ప్రవర్తించాలని సూచించారు. మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేయాలన్నారు.


జీజీహెచ్‌లో రోగుల సహాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



శుక్రవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సీజేఐ కార్యక్రమం నిర్వహణకు పటిష్ట చర్యలు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో మార్చి 1వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తి పాల్గొనే కార్యక్రమాల నిర్వహణకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ తెలిపారు. భారత ప్రధాన న్యాయ మూర్తి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జ్యుడీషియల్, సీఆర్డీఏ అధికారులు, కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తుళ్లూరు మండలం పిచ్చుకల పాలెం వద్ద ఎన్ 16 రోడ్డు సమీపంలో ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి, హైకోర్టు సమీపంలో ఏపీ హైకోర్టు గెస్ట్ హౌస్‌కు శంకుస్థాపన, హైకోర్టు జడ్జీల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్‌ను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.

కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తి కార్యక్రమానికి సంబంధించిన ప్రాంతాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు.

శ్రీవికాస్‌లో ఆకట్టుకున్న విద్యావైజ్ఞానిక ప్రదర్శన


గుండె పనిచేసే విధానం వివరిస్తున్న విద్యార్థిని

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూ నగర్‌లోని శ్రీవికాస్ స్కూల్లో, శుక్రవారం సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు గురువుల పర్య వేక్షణలో తయారు చేసిన అనేక ప్రయోగాలు స్థానిక విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను కూడా ఎంతగానో ఆకర్షించాయి. బరువు మోసే చిలుక, మానవుడి గుండె పనిచేసే విధానం, చిన్నారులు తయారుచేసిన సెక్యూరిటీ పరికరాలు, కంప్యూటర్ జాతకం, ప్రకృతిని మనం కాపాడటం వల్ల, ప్రకృతి వైపరీత్యాలను ఏ విధంగా నివారించవచ్చు, విద్య వినయాన్ని, విజ్ఞానాన్ని, సంస్కారాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో తెలిపే విధానం అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దాసరి రాజా మాష్టారు, డీన్ శ్రీదేవి రాజా మాష్టారు, కోఆర్డినేటర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలే ఆవిష్కరణలకు నాంది

● డాక్టర్ సునీత చంద్రశేఖర్ శ్రీనివాస్



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ సునీత చంద్రశేఖర్ శ్రీనివాస్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనా త్మక ఆలోచ నలే నూతన ఆవిష్కరణలకు నాందిగా మారతాయని యూ ఎస్ఏలోని యూనివర్శిటీ ఆఫ్ ఫ్లోరిడా గ్లోబల్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సునీత చంద్రశేఖర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వడ్లమూడిలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎంపవరింగ్ ఫార్మాడీ త్రూ ఇన్నోవేషన్, క్లినికల్ ఎక్సలెన్స్ అండ్ కెరీర్ రెడినెస్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. సునీత చంద్రశేఖర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కృత్రిమ మేథ వల్ల ఉద్యోగాలు పోవని, పనిని సృజనాత్మకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రయల్ అనలిటిక్స్ అండ్ ఇన్‌సైట్స్ మేనేజర్ డాక్టర్ హరికిరణ్ గెల్లెల, డాక్టర్ థెరిసామనస్వి, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసబాబు, కన్వీనర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యాహక్కు చట్టంపై పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీ సిటిజన్స్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు, అడ్వకేట్ షేక్ జిలానీ ఆధ్వర్యంలో విద్యాహక్కు చట్టంపై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జియాఉద్దీన్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ద్వారా పేదల కు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య పొందే హక్కు ఉందని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఉచిత అడ్మిషన్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, వచ్చే నెల 10వ తేదీ వరకూ దరఖాస్తుకు అవకాశం ఉందని చెప్పారు. దీని ద్వారా ఆర్థికంగా వెనుకబడిన, ఐదేళ్లు పూర్తయిన పిల్లలకు సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీ/స్టేట్ సిలబస్ పాఠశాలలు అన్నింటిల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించారని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ జిలాని, న్యాయవాదులు కట్టా కాళిదాసు, నూనె పవన్ జేత, గోపికృష్ణ, జ్ఞానదీప్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ పైకి ఎక్కి బాలిక హల్‌చల్

● దూకేస్తానంటూ బెదిరింపులు ● రక్షించిన పోలీసులు


పోలీసులతో చెరుకూరి రమ్య

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : అరండల్‌పేటలోని ఓ భవనం పైకి ఎక్కి బాలిక శుక్రవారం సాయంత్రం హల్‌చల్ చేసింది. బిల్డింగ్‌పై నుంచి కిందకు దూకేస్తా నంటూ పోలీసులను, స్థానికులను హడలెత్తించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడికొండూరుకు చెందిన చెరు కూరి రమ్య (15) ఐదో తరగతి వరకు చదువుకొని ప్రస్తుతం ఇంటివద్ద ఖాళీగా ఉంటుంది. అయితే బాలిక తన మేనమామతో చనువుగా మాట్లాడుతోందని తల్లి మందలించింది. అనాథ శరణాలయంలో వదిలేస్తానని తల్లి బెదిరించడ టంతో కలత చెందినట్లు బాలిక వాపోయింది. మనస్థాపానికి గురైన బాలిక శుక్రవారం మేడికొండూరు నుంచి గుంటూరు చేరు కుంది. అరండల్‌పేట 3వ లైన్‌లోని ఓ బిల్డింగు పైకి ఎక్కి కిందకు దూకే స్తానం టూ బెదిరించింది. పోలీసులు ఎంతగా నచ్చ చెప్పడానికి ప్రయ త్నించినా ససేమిరా వినలేదు. దీంతో ఓ పోలీసు అధికారి బాలికను మాటల్లోకి దించాడు. కానిస్టేబుల్ నల్లగర్ల శ్రీను, ఎస్‌బీ ఏఎస్ఐ హరి ప్రసాద్, మరో యువకుడు చాకచక్యంగా పైకి వెళ్లి బాలికను కాపాడారు. ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

ముగిసిన అంగన్వాడీల నిరసనలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మూడు రోజులు పాటు అంగన్వాడీలు చేపట్టిన నిరసనలు శుక్రవారంతో ముగిశాయి. 3వ రోజు నిరసనలను సీఐటీయూ నాయకుడు ముత్యాలరావు ప్రారంభించి, ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్ల కు సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. సమస్యలను పరిష్కారానికి మార్చి 2న తలపెట్టిన చలో విజయవాడలో అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నిరసనలో రమణ, కె.శ్రీనివాస రావు, శివలీల, సంధ్య, విజయకుమారి, నాగమణి, చిన్న వెంకాయమ్మ పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీగజలక్ష్మి కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి దేవాలయంలో నిర్వహిస్తున్న 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, గోపూజ, విశేషాభిషేకాలు, అర్చనలు జరిగాయి. కల్యాణాల్లో భాగంగా శ్రీగజలక్ష్మి అమ్మవారి కల్యాణం కనులపండువగా జరిగింది. అనంతరం పలు రకాలు పుష్పాలతో కల్యాణ మూర్తులకు పుష్పాభిషేకం వేడుకగా నిర్వహించారు. మహా హారతి, మంత్ర పుష్పం, కల్యాణంలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాలను ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు శర్మ పర్యవేక్షించారు.



గంజాయి కార్యకలాపాలు కట్టడి చేయనున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. శుక్రవారం ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాద్రిపేటలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌ని ఎస్పీ పర్యవేక్షించారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

వైభవంగా బాబా విగ్రహ ప్రతిష్ఠ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ రోడ్డు, కంకరగుంటలోని సీతారామ, సాయి మందిరంలో సీతారాములు, షిరిడీ సాయి బాబా వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. బ్రహ్మశ్రీ కూరంచేటి పిచ్చయ్య శాస్త్రి ఆధ్వర్యం లో దాదాపు 50 అర్చక బృందంతో విగ్రహ ప్రతిష్ఠ ఇతర కార్యక్రమాలు వైభ వంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా సినీ దర్శకుడు జాగర్లమూడి క్రిష్ వచ్చి స్వామిని దర్శించుకుని, ఆశీస్సులు పొందారు. అనంతరం భారీ అన్న సంతర్పణ గావించారు. కార్యక్రమాల్ని ఆలయ అధ్యక్షుడు జాగర్లమూడి సాయిబాబు, కార్యదర్శి దాసరి శివకుమార్, కోశాధికారి చిన్ను శ్రీనివాస్, సభ్యులు గోవిందరాజులు, సత్యసింగ్, యోగానంద్, శివరాం సింగ్ పర్యవేక్షించారు.

వేడుకగా శ్రీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్, శ్రీమారుతి దేవాలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గోపూజ, బాల సుహా సిని పూజలు విశేషంగా జరిపి, అనంతరం లక్ష మోదక సహిత శ్రీలక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనం తరం వేద పండితులు యాగా పూర్ణాహుతి నిర్వహించి, మహా కుంబాభిషేక మహోత్సవాన్ని జరిపి, ఆశీర్వచనం అందించారు. ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ మాట్లాడుతూ శనివారం గణపతి స్వామి కల్యాణం, అనంతరం కోలాటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమా ల్ని సభ్యుడు కొర్రపాటి రామారావు తదితరులు పర్యవేక్షించారు.

శేషవాహనంపై శ్రీవారి నగరోత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భం గా శుక్రవారం స్వామిని శేషవాహనంపై నగరోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు లంకా విజయ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై ఉభయదేవేరి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. భువనేశ్వరి పీఠం, గన్నవరం కమలానంద భారతీ స్వామి, నిర్వికల్పానందగిరి స్వామి, శైవక్షేత్రం పీఠాధిపతులు శివస్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య పాల్గొని బ్రహ్మోత్సవాల విశేషాలను వివరించారు.

జగన్.. ఇంకెన్నాళ్లు ఈ దిగజారుడు రాజకీయాలు

● సీఐడీ డీజీకి టీడీపీ నేత వర్ల రామయ్య, ఎమ్మెల్యే నసీర్ ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అసభ్యకర పోస్టులు పెడుతూ ఇంకెంత కాలం దిగజారుడు రాజకీయాలు చేస్తారు జగన్ అంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని శుక్రవా రం టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్యతో కలిసి ఎమ్మెల్యే నసీర్ సీఐడీ డీజీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల మధ్య, వర్గాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ వైసీపీ అరాచకా లకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వంలో సజ్జల రామకృష్ణారెడ్డి తన యుడు భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీపైనా, సీఎం చంద్రబాబునాయుడు పైనా వికృత పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందారని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమిస్తు న్నారని, వీటి నుంచి ప్రజలను మభ్యపెట్టేందుకు దుష్ట రాజకీయాలకు తెర తీశారని చెప్పారు. వైసీపీ మనుగడ అసాధ్యమనే ఆలోచనతో జగన్ కుట్రలు చేస్తున్నారని మండిప డ్డారు. పోస్టులు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.


సీఐడీ డీజీకి ఫిర్యాదు చేస్తున్న వర్ల రామయ్య, ఎమ్మెల్యే నసీర్

శ్రీశైల దేవస్థాన మండప నిర్మాణానికి గళ్లా దంపతుల శంకుస్థాపన

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో మండప నిర్మాణానికి శ్రీ భ్రమర టౌన్ షిప్ అధినేత గళ్లా రామచంద్రరావు, ఎమ్మెల్యే మాధవి దంపతులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండపం నిర్మించే అవకాశం రావటం తమ అదృష్టమని, అరుదైన, అద్భుతమైన అవకాశమని అన్నారు. శ్రీశైలం దేవస్థానంలో మండప నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని దేవస్థాన చైర్మన్ రమేష్ నాయుడుకు చెక్కు రూపంలో అందజేశారు. మండప నిర్మాణం ద్వారా భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించినట్లు ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజా ప్రతి నిధులు, దాతలు భాగస్వాములు కావడం అభినందనీయమని దేవస్థాన చైర్మన్ రమేష్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.


మండప నిర్మాణానికి విరాళం అందజేస్తున్న శ్రీభ్రమర అధినేత గళ్లా రామచంద్రరావు, ఎమ్మెల్యే గళ్లా మాధవి

● పశ్చిమ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం

ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆదేశాలతో పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని కూటమి నేతలు నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి పలు శాఖలకు చెందిన అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సైదారావు ఆశయాలు కొనసాగిద్దాం

● టీడీపీ సీనియర్ నేత మద్దిరాల ఇమ్మానుయేల్

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తుది శ్వాస విడిచే వరకు తెలుగుదేశం పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన కర్నాటి సైదారావు ఆశయాలు కొనసాగిద్దామని క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నేత మద్దిరాల ఇమ్మాను యేల్ (మ్యాని) పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మల్లికార్జునపేట మూడో లైన్ లోని సెయింట్ మనో వికాస కేంద్రంలో టీడీపీ నాయకులు దివంగత కర్నాటి సైదారావు జయంతి ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుడు కొండాతో కేక్ కట్ చేయించి అనంతరం 250 మంది దివ్యాంగులకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో. సైదారావు సోదరుడు కర్నాటి లక్ష్మయ్య, టీడీపీ జిల్లా నాయకులు పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్), పాటిబండ్ల బలరామ్, కర్నాటి కొండా, చాపల నాగేశ్వరరావు, నూతక్కి రవికుమార్, పులివర్తి శ్రీనివాస్, ఎం.రాజగోపాల్, పోలినేని మధు, పి.అచ్చయ్య పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమ్మెర ఘటన అమానవీయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో రజకులపై దాడి చేసి రెండు నెలల పసిపాపను చంపిన అగ్ర కులానికి చెందిన వారిని కఠినంగా శిక్షించాలని రజక హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాచకొండ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. స్థానిక కొరిటెపాడు, చిట్యాల ఐలమ్మ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పసికందును కాలితో తన్ని చంపిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసనల్లో జిల్లా అధ్యక్షుడు వెంకట నరసయ్య, శ్రీధర్, వంగపాటి అంజయ్య, సాయి, కృష్ణ భాస్కర్, సుబ్రహ్మణ్యం, కైలాసం సాంబశివరావు, శీను, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



అమరావతి రాజధానిలో జరుగుతోన్న ఓహెచ్‌టీ లైన్స్ అండర్‌గ్రౌండింగ్ పనులు

భూగర్భంలోకి.. కరెంటు వైర్లు

● అమరావతి నిర్మాణాలకు తొలగిపోనున్న అడ్డంకులు

● ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో నుంచి ఏర్పాటై ఉన్న ఓవర్ హెడ్ ట్రాన్స్‌మిషన్(ఓహెచ్‌టీ) లైన్స్ అన్నింటినీ భూగర్భంలో నుంచి ఏర్పాటు చేసే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలలో విజయవాడలోని థర్మల్ పవర్ స్టేషన్ నుంచి ఈ ట్రాన్స్‌మిషన్ లైన్స్ అమరావతి రాజధాని గ్రామాల మీదగా రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమ జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఏర్పాటై ఉన్నాయి. ఇవి భవిష్యత్తులో రాజధాని అభివృద్ధికి ఆటంకం కలిగించే అవకాశం ఉండటంతో వాటిని అండర్‌గ్రౌండ్‌లో నుంచి ఏర్పాటు చేయడం ద్వారా ప్రకృతి విపత్తుల నుంచి కూడా కాపాడే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ఏపీ ట్రాన్స్‌కో దాదాపుగా రూ. 1370 కోట్లకు పైగా నిధులను ఖర్చు చేస్తోన్నది.

విజయవాడలోని నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ నుంచి పలు 220, 400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్స్ అమరావతి రాజధానిలోని తుళ్లూరు, తాడికొండ మండలాల మీదగా ఏర్పాటై ఉన్నాయి. వీటి కోసం దశాబ్దాల క్రితమే రైతులు వారి భూములను త్యాగం చేశారు. రాజధాని నిర్ణయం జరగకముందు వరకు వాటి వలన పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. రైతులు కూడా ఓహెచ్ టవర్ల కింద కాస్తో, కూస్తో పంటలను సాగు చేసుకొనేవారు. దీనికి ఏపీ ట్రాన్స్‌కో కూడా అభ్యంతరం చెప్పేది కాదు. అయితే రాజధాని అభివృద్ధిలో ఇవి ఆటంకంగా మారాయి. సాధారణంగా ఈ ఓహెచ్‌టీ లైన్లు ఉన్న ప్రదేశంలో ఎవరూ నిర్మాణాలు చేయరు. అలానే ట్రాన్స్‌కో నుంచి అనుమతులు కూడా మంజూరు కావు. రాజధానిలో అన్ని రకాల కేబుల్స్ అండర్‌గ్రౌండ్‌లోనే ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక విశ్వనగరంలో ఎలాగైతే కేబుల్స్, పైపులైన్లు వంటివి భూగర్భంలో ఉంటాయో అలానే ఇక్కడ కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం మేరకు రాజధానిలో సుమారు 32 కిలోమీటర్లకు పైగా పొడవు ఉన్న ఈ ట్రాన్స్‌మిషన్ లైన్స్ అన్నింటిని భూగర్భంలోకి పంపే ప్రక్రియని ప్రారంభించిన ట్రాన్స్‌కో ఇప్పటికే 6 నుంచి 8 కిలోమీటర్ల పొడవునా పనులను పూర్తి చేసింది. ప్రస్తుతం సీడ్‌యాక్సిస్ రోడ్డు, దొండపాడు మధ్యన పనులు జరుగుతోన్నాయి. గతంలో ఎన్16 రోడ్డు పక్కన ఈ పనులు జరిగాయి. మరికొద్ది రోజుల్లో మిగతా ట్రాన్స్‌మిషన్ లైన్స్‌ని కూడా అండర్‌గ్రౌండ్‌లోకి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా పనులు చేపట్టింది. తాళ్లాయపాలెం సమీపంలో ఉన్న భారీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వీటికి అనుసంధానిస్తుంది. ఈ పనులన్ని పూర్తి అయితే ఓహెచ్‌టీ లైన్స్ అనేవి రాజధానిలో కనిపించకుండా పోతాయి.

పొదుపు మహిళలకు.. లక్ష్మీ కటాక్షం



● డ్వాక్రాలకు ప్రభుత్వం తీపి కబురు

● ఎన్టీఆర్ విద్యా లక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాలకు శ్రీకారం

● పావలా వడ్డీకే రుణాలు..

సత్తెనపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సంఘ సభ్యుల్లోని పిల్లల చదువు, వివాహాల కోసం ఎన్‌టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్‌టీఆర్ కల్యాణ లక్ష్మి పేరిట కొత్త పథకాలకు శ్రీకారం చుట్టింది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ఈ బృహత్తర పథకాలు అమల్లోకి రానున్నాయి. ఈ పథకాలను అందించేందుకు సెర్ప్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనికి సంబంధించిన విధివిధానాలు ఖరారు చేశారు. గతేడాది అక్టోబరులోనే ఈ పథకాలను అమలు చేయాలని నిర్ణయించినా.. అమల్లో లోపాలకు ఆస్కారం లేకుండా అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో కాస్త జాప్యం జరిగింది.

ఎన్టీఆర్ విద్యా లక్ష్మి

పాఠశాలలు, కళాశాలల్లో పిల్లల ఫీజుకు అనుగుణంగా అవసరమైన మొత్తాన్ని తీసుకోవచ్చు. గరిష్ఠంగా ఇద్దరి పిల్లల చదువుకు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు పావలా వడ్డీకే రుణ సాయం అందుతుంది. తీసుకున్న మొత్తానికి చెల్లింపులకు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి. అడ్మిషన్ లెటరు, ఫీజు చెల్లింపు విధానం, ఇన్‌స్టిట్యూట్ వివరాలు, రసీదులు సమర్పించాలి. బ్యాంక్ ఖాతాలో నేరుగా నగదు జమ అవుతుంది.

ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి

డ్వాక్రా సంఘంలోని సభ్యురాలి కుమార్తె వివాహానికి ఈ పథకం వర్తిస్తుంది. అవసరానికి అనుగుణంగా రూ. 10 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణం తీసుకునే వెసులు బాటు ఉంది. దీనికి కూడా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం మాదిరిగానే పావలా వడ్డీకి రుణం ఇస్తారు. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి. వివాహ లగ్న పత్రిక, శుభకార్యం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్ళి ఖర్చు అంచనా సమర్పించాలి. పరిశీలన అనంతరం నేరుగా సభ్యురాలి బ్యాంక్ ఖాతాకు నగదు జమ చేస్తారు.

వచ్చే వడ్డీ సమాఖ్యలకే

విద్యా లక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా నిధులు కేటాయించనుంది. ఐతే ఈ పథకాల అమలు ద్వారా పావలా వడ్డీ కింద సమకూరే ఆదాయంలో 50 శాతం తిరిగి డ్వాక్రా సంఘాలకు అనుబంధంగా ఉన్న మండల, గ్రామ సమైక్యల బలోపేతానికి వినియోగించనున్నారు. మిగతా 50 శాతం స్త్రీ నిధి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలకు వినియోగించనున్నారు. ఈ పథకం కింద రుణ సాయం పొందిన తర్వాత సదరు లబ్ధిదారులు ఏదైనా ప్రమాదంలో చనిపోతే ఆ రుణం మొత్తం మాఫీ చేస్తారు.

అర్హులు వీరే

డ్వాక్రా సంఘంలో నమోదై కనీసం నాలుగు నెలలు అంతకంటే ఎక్కువ కాలం ఉన్న సభ్యులకు పథకాలు వర్తింపజేస్తారు. ఇప్పటికే బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, ఉన్నతి, ఇతర మార్గాల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించే వారికి చేయూత అందజేస్తారు. లబ్ధిదారుల బయోమెట్రిక్ నమోదు ఆధారంగా పథకాలు అమలు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల ద్వారా పిల్లల చదువులు, వివాహాలకు ఎంతో ఉపయోగపడుతుందని పొదుపు మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆయేషా కేసును సమాధి కానివ్వం

● న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదు

● ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే మా ఆశలన్నీ: తండ్రి ఇక్బాల్ బాషా

● ఆయేషా శరీర భాగాలకు తిరిగి అంత్యక్రియలు



ఆయేషా శరీర భాగాలను విజయవాడ నుంచి భారీ ర్యాలీతో తీసుకువస్తున్న కూటమి నాయకులు, ముస్లిం యువత



విజయవాడ సీబీఐ కోర్టు నుంచి ఆయేషా శరీర భాగాలను సీల్డ్ బాక్సులో తీసుకొస్తున్న ఆయేషా తండ్రి ఇక్బాల్ బాషా, ముస్లిం మత పెద్దలు

తెనాలి, ఫిబ్రవరి 27, (ఆంధ్రజ్యోతి): నిండు నూరేళ్ల సంతోషంగా జీవించాలని తాను, బతుకు బాటలు వేసుకుంటున్న తరుణంలో నరరూప రాక్షసులు కొందరు దారుణంగా అత్యాచారం చేసి హత్య చేశారు... కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన మా పాప మాకు దూరమై 18 ఏళ్లు. ఇప్పుడు సమాధిలో ఉంది. ఆమె ఆత్మ మాత్రం న్యాయంకోసం నేటికీ ఘోషిస్తూనే ఉంది. ఆమె సమాధిలో ఉన్నా, న్యాయం జరిగే వరకు కేసును మాత్రం సమాధి కానివ్వం. సీబీఐ ఈ కేసుకు పాతరేసినా మేము బతికున్నంత వరకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని ఆయేషా తండ్రి సయ్యద్ ఇక్బాల్ బాషా, మరికొందరు ముస్లిం మత పెద్దలు స్పష్టం చేశారు. సీబీఐ విచారణలో భాగంగా 2019లో సీబీఐ ఆయేషా సమాధిని తవ్వించి, ఆమె శరీర భాగాలను తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే. శుక్రవారం కోర్టు ఆదేశాలతో ఏడేళ్ల తర్వాత సీబీఐ వాటిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆ శరీర భాగాలను తిరిగి శుక్రవారం ముస్లిం సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. తెనాలి చెంచుపేటలోని ఖబరస్తాన్‌లో ఆమె సమాధి దగ్గరే తిరిగి ఖననం చేశారు. సీబీఐ బృందం చివరివరకు దీనిని పర్యవేక్షిస్తే, ఆయేషా శరీర భాగాలు తీసుకువస్తున్న విషయం తెలిసి కూటమి పార్టీల నాయకులు, అభిమానులు, వివిధ ప్రజా సంఘాలు భారీ సంఖ్యలో హాజరు కావాలని, వారికి సంఘీబావం ప్రకటించాలని పిలుపునివ్వటంతో పార్టీల నాయకులు భారీగానే హాజరయ్యారు. మరోపక్క ముస్లిం యువత కూడా ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం భారీ ర్యాలీ మధ్య సీల్డ్ బాక్సును విజయవాడ నుంచి తెనాలి తెచ్చారు. చెంచుపేటలోని ముస్లిం శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభం నుంచి చివరి వరకు సీబీఐ అడిషనల్ ఎస్పీ సి.ఆర్.దాస్ తోకూడిన బృందం పర్యవేక్షించింది. తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లను ఉన్నతాధికారుల ఆదేశాలతో దగ్గరుండి చూశారు. అయితే ఆయేషా శరీర భాగాలను ఖననం చేసినంతసేపు ముస్లిం యువత సీబీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. సీబీఐ డౌన్‌డౌన్ అంటూ పెద్దగా కేకలు వేశారు. అయితే సీబీఐ అధికారులు మాత్రం ఏమాత్రం జోక్యం చేసుకోకుండా కార్యక్రమం పూర్తయ్యేవరకు తమ పని చూసుకుని వెళ్లిపోయారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మహ్మద్ ఖుద్దూస్, మరి కొందరు నాయకులు పాల్గొన్నారు. తర్వాత ఆయేషా తండ్రి సయ్యద్ ఇక్బాల్ బాషా మాట్లాడుతూ, చివరి ఆశ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే ఉందని, ఆయనే గతంలో న్యాయం జరిగేలా చూస్తానని మాటిచ్చారని, ఇప్పుడు అది నెరవేర్చుతారన్న నమ్మకం మాకుందన్నారు. దర్యాప్తు సంస్థలతో కాకుండా హైకోర్టు సిటింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

కష్టమే

(5వ పేజీ తరువాయి)

ఇండెక్స్ నివేదిక ప్రకారం సూర్యుడు మండిపోతే జిల్లా వాసుల ఆరోగ్యం అగమ్య గోచరంగా మారుతుంది. వడదెబ్బ, డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాస్టన్, హీట్ స్ట్రోక్ కేసులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ కూలీలు, నిర్మాణ కార్మికులు, ట్రాఫిక్ సిబ్బంది, డెలివరీ సిబ్బంది, వీధి వ్యాపారులు వంటి బహిరంగ వాతావరణంలో పని చేసే వర్గాలు అధిక ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యుత్ వినియోగం పెరగడం వల్ల లోడ్ పెరిగి సరఫరాలో అంతరాయాలు తలెత్తే అవకాశం లేకపోలేదు. తాగునీటి డిమాండ్ పెరగడం, భూగర్భ జలాల మట్టం పడిపోవడం, పంటల దిగుబడులపై ప్రభావం వంటి పరిణామాలు జిల్లాలో ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది.

● ఉపశమనానికి సమగ్ర ప్రణాళిక అవసరం

వేడి ముప్పును తగ్గించేందుకు నగరాల్లో పచ్చదనం పెంపు అత్యవసరం. అడవులు, పార్కుల అభివృద్ధి, వర్షపు నీటి సంరక్షణ, మొక్కలను విస్తృతంగా నాటడం వంటి చర్యలు తక్షణం చేపట్టాల్సిందే. భవనాలపై తెల్లటి పైకప్పులు (కూల్ రూఫ్), తాపన నిరోధక నిర్మాణ పద్ధతులు, సౌరశక్తి వినియోగం వంటి చర్యలు ఉష్ణోగ్రతలను కొంత మేర తగ్గించగలవు. ప్రభుత్వం సమగ్ర 'హీట్ యాక్షన్ ప్లాన్' అమలు చేసి చలివేంద్రాల ఏర్పాటు, తాగునీటి సరఫరా పెంపు, ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డుల సిద్ధత, ఉపాధి హామీ పనివేళల మార్పు, పాఠశాల సమయాల సర్దుబాటు వంటి చర్యలు చేపట్టాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

● ముందుంది ముసళ్ల పండుగే..

పర్యావరణ పరిశోధన సంస్థల అంచనాల ప్రకారం రాబోయే దశాబ్దంలో సగటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. దీని ప్రభావంగా హీట్ వేవ్ వ్యవధి పొడవుగా మారి, వర్షపాతం సరళిలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. తీర ప్రాంతాలకు సముద్ర మట్టం పెరుగుదల కూడా అదనపు సవాలుగా మారవచ్చని హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

● ప్రజల జాగ్రత్తలే రక్షణ

ప్రజలు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గుంటూరులో ముంచుకొస్తున్న ఉష్ణ తాపం ఎదుర్కోవాలంటే ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు, పర్యావరణవేత్తలు కలిసి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం అత్యవసరంగా మారింది. లేకపోతే రాబోయే ప్రతి వేసవి మరింత కఠిన పరీక్షగా మారే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.



రంగస్థల ప్రతిభా పురస్కారం అందుకుంటున్న నటి అమృత వర్షిణి

నటి అమృత వర్షిణికి రంగస్థల ప్రతిభా పురస్కారం

అట్టహాసంగా.. రంగస్థలి నాటక పోటీలు

● గుండె తడిమిన.. మమ్మల్ని బతకనివ్వండి

● ఆదరిస్తేనే రంగస్థలానికి జీవం: ఎమ్మెల్యే చదలవాడ



మమ్మల్ని బతకనివ్వండి నాటికలోని దృశ్యం

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి,27(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో నరసరావుపేట రంగస్థలి 46వ వార్షికోత్సవం, 25వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు శుక్రవారం స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రదర్శించిన మమ్మల్ని బతకనివ్వండి నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. అర్ధరాత్రి వాన కురిసి ఉప్పెత్తున వరద ముంపునకు ఒక చిన్న ఇంట్లో నివాసముంటున్న ముసలి దంపతులు నిరాశ్రయులవుతారు. ఈ పరిస్థితిలో వారి పట్ల సమాజం ఎలా ప్రవర్తించింది అన్న కథాంశంతో సాగిన నాటిక.. ఆద్యంతం గుండెను తడిమేస్తుంది. ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తుంది. విజయవాడ సాంస్కృతిక సమితి ప్రదర్శించిన ఈ నాటకాన్ని.. సుఖమంచి కోటేశ్వరరావు రచించి, దర్శకత్వం వహించారు. అనంతరం నిర్వహించిన సభకు రంగస్థలి ఫైనాన్స్ కమిటీ చైర్మన్ కపలవాయి విజయకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ.. నాటకం సమాజాన్ని చైతన్యవంతం చేస్తుందన్నారు. సమాజం సైన్సు, టెక్నాలజీ వెంట పరిగెడుతూ చిన్న చిన్న సంతోషాలకు దూరమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాటకం బతకాలంటే ప్రజలు ఆదరించాలని కోరారు. రంగస్థలి లాంటి సంస్థలకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. రంగస్థలి ప్రతిభా పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటి, ప్రయోక్త, దర్శకురాలు అమృతవర్షిణికి ప్రదానం చేశారు. గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇది అతని సంతకం నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల సాంబశివరావు, ఎంఏఎం కళాశాలల చైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, రాంప్రసాద్, రంగస్థలి గౌరవాధ్యక్షుడు కిలారు వెంకట్రావు, అధ్యక్షుడు మహబూబ్ సుభాని, సెక్రటరీ నల్లపాటి బోస్, ఉపాధ్యక్షులు ఎ.ఎ.మధుకుమార్, కె.ఆర్. ప్రసన్నకుమార్, సూరిబాబు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీబీలో భోక్తలను ఉపేక్షించేది లేదు

● వైసీపీ హయాంలో రూ. 54 కోట్ల కుంభకోణం

● బ్యాంకులో ప్రక్షాళన చేస్తాం

● మహాజన సభలో చైర్మన్ మక్కెన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం, సీఈవో ఫణికుమార్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో డీసీసీబీలో అక్రమాలకు పాల్పడిన భోక్తలను ఉపేక్షించేది లేదని చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు స్పష్టం చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో సీఈవో వీవీఎస్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడుతో కలిసి మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మక్కెన మాట్లాడుతూ వైసీపీ హయాంలో కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు, ప్రత్తిపాడు, మంగళగిరి, గురజాల, వినుకొండ వంటి మొత్తం 6 బ్రాంచ్‌లలో రూ. 54 కోట్లు కుంభకోణం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటికీ రూ. 2 కోట్లు రికవరీ చేసినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన ఇద్దరు సీఈవోలు, మేనేజర్లను సస్పెండ్ చేసి కేసులు నమోదు చేసినట్లు గుర్తుచేశారు. జీడీసీసీ పరిధిలో రూ. 330 కోట్ల బకాయిలున్నాయని, వాటిని కనీసం రూ. 230 కోట్లకు తగ్గించాలని చైర్మన్ కోరారు. అలానే మార్చి 31 నాటికి బకాయిలు చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉంటుందని, చెల్లించకుంటే వడ్డీ మరింత పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పాత రుణాల బకాయిలు వసూలు చేస్తేనే కొత్త రుణాలు అందించే అవకాశముందన్నారు. సొసైటీ అధ్యక్షులకు కూడా గౌరవ వేతనంపై ఇప్పటికే ఆప్కాబ్‌లో చర్చించినట్లు తెలిపారు.

సీఈవోలు ఎమ్మెల్యేల్లా వ్యవహరిస్తున్నారు

కొన్ని సొసైటీల్లో కొందరు సీఈవోలు వారే ఎమ్మెల్యేలు, చైర్మన్లుగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చైర్మన్ మక్కెన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్లుగా ఒకే స్థానంలో పాతకుపోయిన సొసైటీల సీఈవోలు, సిబ్బందికి స్థాన చలనం తప్పదని స్పష్టం చేశారు. ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు ఉంటాయన్నారు. ఇందులో ఎవరికీ మినహాయింపులు ఉండవన్నారు. సొసైటీ అధ్యక్షులు, యూనియన్ నాయకులు కూడా సహకరించాలని మక్కెన కోరారు. వినుకొండ బ్రాంచ్ అక్రమాలపై విచారణ నివేదిక అందిందని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో సిల్వర్ జూబ్లీ వేడుకలు

● బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్ నిర్మించి 25 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామని చైర్మన్ మక్కెన తెలిపారు. అప్పట్లో ఎన్‌టీఆర్ సహకార భవన్‌ను చంద్రబాబు ప్రారంభించారని గుర్తుచేశారు. భవనానికి ఆధునిక హంగులు తీసుకొచ్చి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సభలో అందరూ ఆమోదం తెలియజేశారు.

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు ఎక్కడా ఎరువుల కొరత రాకుండా చూశామని, కొత్తగా 12 ఎరువుల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రబీలో మొక్కజొన్న, శనగలు, కందులకు మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

● బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్ మాట్లాడుతూ రుణ బకాయిలు పదేళ్ళు దాటిన వాటికి ఓటీఎస్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రుణాల వసూళ్ళకు ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామన్నారు. ఈ సందర్భంగా మొత్తం ఐదు అంశాలపై చర్చించి సభ ఆమోదం తెలిపింది.

సౌరశక్తి.. అనాసక్తి

(5వ పేజీ తరువాయి)

వినియోగం 120 యూనిట్లు దాటితే సుమారు రూ.1,000 బిల్లు వస్తుంది. అదే సోలార్ రూఫ్ టాప్‌తో కేవలం రూ.338 మాత్రమే ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. దీని వల్ల ఏడాదికి రూ.8వేలు వరకు ఆదా అవుతుంది. సూర్యఘర్ పథకంలో వంద చదరపు అడుగుల స్థలంలో 120 యూనిట్లు ఉత్పత్తి చేసే కిలోవాట్ సామర్థ్యం ఉన్న సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు సుమారు రూ.60 వేలు ఖర్చయితే 50శాతం, అంటే రూ.30వేలు ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. మిగిలిన మొత్తం బ్యాంకుల నుంచి రుణంగా పొందొచ్చు. ఇది కూడా నాలుగేళ్లలో విద్యుత్తు బిల్లు రూపేణా ఆదా చేసుకోవచ్చు. అనంతరం ప్రతి యూనిట్ నుంచి ఆదాయం పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది. యూనిట్ల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరగుతుండటం కూడా పథకం అమలు వినియోగదారుల నుంచి స్పందన రావడం లేదు.

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ.. అంతే

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సౌరశక్తి యూనిట్లు ఏర్పాటు నామ మాత్రంగా కూడా లేదు. సోలార్ పథకం అమలుపై అధికారుల నుంచి కూడా స్పందన కరువైంది. ఇంటి అవసరాల తర్వాత మిగిలితే విద్యుత్తును గ్రిడ్‌కు పంపించి, ఆదాయం పొందొచ్చు. దీనిపై కూడా అవగాహన కల్పించాల్సి ఉంది.

ఎస్సీ.. ఎస్టీలకు పూర్తిగా ఉచితం

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సూర్యఘర్ పథకం ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది. అయినా కూడా సదరు వర్గాల ఇళ్లల్లో సోలార్ యూనిట్ల ఏర్పా టు నత్తనడక కన్నా నిదానంగా సాగుతోంది. పల్నాడు జిల్లాలో 50,379 దరఖాస్తులు అమోదించగా ఇప్పటికి 64 యూనిట్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. బాపట్ల జిల్లాలో 34,149 దరఖాస్తులు అమోదించగా 173 యూనిట్లు ఏర్పాటుచేశారు. గుంటూరు జిల్లాలో 49,393 దరఖాస్తులకు గాను 179 యూనిట్లు ఏర్పాటు చేశారు.

మధ్యవర్తిత్వమే.. ఉత్తమ మార్గం

● డీఆర్‌ఎం సుధేష్ణ సేన్



దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగిస్తోన్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో తలెత్తే వివాదాలను కోర్టు బయట మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ అన్నారు. శుక్రవారం మధ్యవర్తిత్వంపై దృష్టి సారించి రైల్వేలో వివాదాల పరిష్కారం అనే అంశంపై సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ విభాగం లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించింది. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ అంశంపై డీఆర్‌ఎం ఉపన్యాసం ఇచ్చారు. రైల్వేలో వివాద పరిష్కార విధానాలపై విలువైన సమాచారాన్ని అందించారు. ముఖ్యంగా తన ఉపన్యాసంలో మధ్యవర్తిత్వం, రైల్వే పనితీరులో దాని ఆచరణాత్మకంగా పాటించడంపై దృష్టి సారించాలని సూచించారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఆశిష్ మెహ్రోత్రా తదితరులు పాల్గొన్నారు.



మిర్చి రాక.. మందగమనం

● యార్డుకు 30 శాతానికి పైగా తగ్గిన మిర్చి

● ధర తగ్గడమే కారణమా..!


● సీజన్‌లో మిగిలింది రెండు నెలలే

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఆగమనాలు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి తగ్గాయి. దాదాపుగా 30 శాతం తక్కువగా పంట దిగుబడిని రైతులు విక్రయించడానికి తీసుకొస్తున్నారు. రోజురోజుకు మిర్చి టిక్కీల సంఖ్య పెరగాల్సిందిపోయి తగ్గుతుండటంపై మిర్చి యార్డులో పలు రకాలుగా చర్చ జరుగుతోంది. కర్నూలు జిల్లాలో వాతావరణం సరిగా లేకపోవడం, పంట దిగుబడి తక్కువగా ఉండటం వల్లే అక్కడి నుంచి ఆశించినంతగా రైతులు మిర్చి టిక్కీలను తీసుకురావడం లేదని వ్యాపార వర్గాలు చెబుతోన్నాయి. అయితే పది రోజుల క్రితం ఉన్న ధర ఇప్పుడు లేకపోవడంతో రైతులు కొంత మేరకు సంశయిస్తున్నట్లు సమాచారం. ఈ వారం మొత్తంగా రోజుకు సగటున 70వేల మిర్చి టిక్కీలు మాత్రమే యార్డుకు వచ్చాయి.

ఏఎంసీ గుంటూరు(మిర్చియార్డు)లో ఫిబ్రవరి నెల వస్తూనే మిర్చి టిక్కీల ఆగమనాల సంఖ్య గణనీయంగా పెరిగేది. మార్చి, ఏప్రిల్ నెలల్లో అయితే ఉచ్ఛస్థితికి చేరుకొనేది. ఇప్పుడు అలాంటి వాతావరణం కనిపించడం లేదు. అన్ సీజన్ కంటే కొంచెం ఎక్కువగా రోజుకు 70 వేల టిక్కీల వరకు రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. శనివారంతో ఫిబ్రవరి నెల ముగుస్తుంది. యార్డుకు శని, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం తిరిగి ట్రేడింగ్ ప్రారంభం కానుంది. మార్చి నెలలో హోలీ, ఉగాది, రంజాన్, శ్రీరామనవమి, మార్చి 31 ఆర్థిక సంవత్సరం చివరి రోజు యార్డులో మిర్చి కొనుగోళ్లు జరగవు. అలానే ప్రతి శని, ఆదివారం కూడా సెలవు దినాలు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే ఆ నెలలో 31 రోజుల్లో మిర్చియార్డులో ట్రేడింగ్ జరిగేది 17 రోజులు మాత్రమే. ఈ నేపథ్యంలో ఏప్రిల్, మే మొదటి వారంలో జరిగే అమ్మకాల పైనే అంతా ఆశలు పెట్టుకొన్నారు.

వ్యత్యాసం ఇలా...

ఈ నెల 23న సోమవారం 1,17,276 మిర్చి టిక్కీలను రైతులు యార్డుకు తీసుకొచ్చారు. దాంతో ఇక మిర్చి టిక్కీల ఆగమనాలు రోజుకు లక్షకు తగ్గకుండానే పెరుగుతూ పోతాయని అంతా అంచనా వేశారు. 24న 1,00,860 టిక్కీలకు ఆగమనాలు తగ్గాయి. 25న 72,040, 26న 76,561, 27న 67,291 టిక్కీలు మాత్రమే వచ్చాయి. ఇలా హఠాత్తుగా మిర్చి రాక తగ్గడంపై వ్యాపార వర్గాలు ఆరా తీశాయి. కర్నూలు జిల్లా నుంచి ఆశించిన మోతాదులో రైతులు మిర్చి తీసుకురావడం లేదని తేలింది. ఈ నేపథ్యంలో మిర్చియార్డు పాలకవర్గం, అధికార యంత్రాంగం దీనిపై సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడొస్తున్న మిర్చి టిక్కీలు వచ్చేవారం నుంచి మరింత తగ్గకుండా రైతులను చైతన్యపరచాలి. అవసరమైతే ఒక బృందం కర్నూలు జిల్లా వెళ్లి పరిస్థితిని అధ్యయనం చేయాలన్న అభిప్రాయం యార్డులో వ్యక్తమవుతోంది.



మధురామ్లఫలం దానిమ్మ!

భోజనకుతూహలం

దానిమ్మ లాగా సమస్త పోషకాలూ నిండిన ఫలం మరొకటి కనిపించదు. అనేక రకాల వ్యాధుల నివారణకు ఇది పనిచేస్తుంది.

ఒక విధంగా చెప్పాలంటే ప్రపంచానికి ఆరోగ్య సేవలందిస్తూ వస్తోన్న మహాఫలం దానిమ్మ. దీని ప్రయోజనాలను మన పూర్వీకులు గ్రంథస్తం చేశారు. ఈ విశేషాలలోకి వెళ్తే..

- దానిమ్మ చాలా తేలికగా అరిగిపోతుంది. తియ్యతియ్యగా.. పుల్లపుల్లగా.. కొద్దివగరు రుచి కలిగిన దానిమ్మపండు తిన్న తర్వాత కొద్దిగా తీపిగానే అనిపిస్తుంది. ఇది కడుపు ఉబ్బరం తగ్గిస్తుంది. వాతాన్ని, పైత్యాన్ని, కఫాన్ని సమస్థితికి తీసుకువస్తుంది.
- ఇది వేడి వల్ల కలిగే పొడి దగ్గును తగ్గిస్తుంది. శ్రమ అలసటలను తొలగిస్తుంది.
- విరోచనాల సమస్య ఉన్న వారికి దానిమ్మ మంచి మందు. ఈ సమస్య ఉన్నవారు దానిమ్మ జ్యూస్ తాగటం వల్ల శోష కలగదు. శరీరంలో నీటి శాతం తగ్గిపోదు.
- మందులు ఎక్కువగా వాడాల్సి వచ్చినప్పుడు శరీరంలో వేడి పెరుగుతుంది. దీని వల్ల రకరకాల సమస్యలు ఏర్పడతాయి. వీటన్నింటికీ దానిమ్మ మంచి ఔషధం.



- దానిమ్మ గింజలు జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తాయి. నోరు, నాలుక, గొంతు, పేగులలోని ఆమ్లత్వాన్ని తగ్గించి సమస్థితిని తీసుకువస్తాయి. గుండెల్లో మంట కూడా తగ్గుతుంది. నిద్రపోయిన తర్వాత కొందరికి గొంతులోకి పుల్లని రసం చిమ్మినట్లు అనిపిస్తుంది. ఇలాంటి వారు దానిమ్మ రసం తాగితే వెంటనే ఉపశమనం లభిస్తుంది.
- దానిమ్మ గింజలను క్రమం తప్పకుండా తింటే పురుషుల వీర్యంలో జీవకణాల సంఖ్య పెరుగుతుంది.

- దానిమ్మ గింజలతో పాటుగా పై తొక్కల్లో కూడా అనేక పౌష్టిక విలువలు ఉన్నాయి. ఈ తొక్కలను ఎండబెట్టి దంచి- టీ పొడితో కలిపి టీ కాచుకు తాగితే అనేక ప్రయోజనాలు ఉంటాయి.
- దానిమ్మ చెట్టు బెరడును పసుపు కొమ్ములతో కలిపి పొడి చేసి.. దానిని పాలలో కలిపి ఫేస్ ఫ్యాక్‌గా పెట్టుకుంటే చర్మంపై ఉన్న ముడతలు పోతాయి. చర్మం మృదువుగా మారుతుంది.

• గంగరాజు అరుణాదేవి

సంకల్పం



మహమ్మద్ సిరాజ్... తిలక్ వర్మ... హైదరాబాద్ నుంచి అంతటి సత్తా ఉన్న మరో క్రికెటర్... ఆరోన్ జార్జ్. ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్ సెమీస్‌లో సెంచరీతో అదరగొట్టి... భారత్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు సీనియర్ జట్టు తలుపు తడుతున్నాడు.
ఇది ఆరోన్ ఒక్కడి విజయం కాదు... అతడి తల్లి ప్రీతి వర్గీస్‌ది కూడా. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి... విశ్వవిజేతగా నిలిచేవరకు... అతడి పట్టు వదలని కృషిని, తాము పడిన కష్టాన్ని ఆమె 'నవ్య'తో పంచుకున్నారు.

ఆరోన్ మా వరం

"నేను మ్యాథ్స్ టీచర్‌ని. మాది కేరళ మూలాలు ఉన్న తెలుగు కుటుంబం. ఆరోన్ మా చిన్నాబ్బాయి. క్రికెట్ గురించి నాకు టెక్నికల్‌గా ఏమీ తెలియదు. అయితే మావారు ఇసో వర్గీస్ కూడా ప్రొఫెషనల్ క్రికెటర్. ఆయన హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లు, క్లబ్ క్రికెట్‌లో బాగా ఆడేవారు. ఆయన ఆట చూసేదాన్ని. మాది ఉమ్మడి కుటుంబం కావడంతో మామయ్యగారి అనంతరం ఇంటి బాధ్యతలు మొత్తం ఇసోనే చూసేవారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఆయన ఆటకు దూరమయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో 1995 నుంచి 2008 వరకు సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేశారు. వచ్చే జీతం కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో, 2008లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక కార్పొరేట్ సంస్థలో చేరారు. ఆరోన్‌కి మూడున్నరేళ్ల వయస్సులో ఒకసారి అతడికి మా బంధువులు ప్లాస్టిక్ బ్యాట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఆ బ్యాట్‌తో ఇంట్లో సరదగా క్రికెట్ ఆడుతుండగా వాళ్ల నాన్న ఒకసారి బౌలింగ్ చేశారు. ఎదుర్కొన్న తొలి బంతినే ఆరోన్ స్ట్రయిట్ డ్రైవ్ ఆడాడు. సాధారణంగా ఆ వయసులోని పిల్లలు బంతి వేస్తే బ్యాట్‌తో అడ్డంగా కొడతారు కానీ స్ట్రయిట్ డ్రైవ్ ఆడరని, అతడిలో ప్రత్యేక నైపుణ్యాలు ఉన్నాయని, వాడిని క్రికెట్‌లో ప్రోత్సహిద్దామని ఇసో నాతో చెప్పారు. నేను సరే అన్నాను. అయితే మాకు తెలిసిన చాలా మంది ఎందుకు చదవును నిర్లక్ష్యం చేస్తూ అతడిని క్రికెట్ ఆడిస్తున్నారని విమర్శించారు. మేము అవేమి పట్టించుకోలేదు.

'నాలుగేళ్ల పిల్లోడికి శిక్షణా?'

ఆరోన్ చిన్నప్పుడు చాలా సన్నగా ఉండేవాడు. కానీ క్రికెట్‌పై వాడికి ఉన్న ఆసక్తిని గమనించి, కోచింగ్ ఇప్పించాలని అనుకున్నాం. ఇద్దరు, ముగ్గురి దగ్గరకు వెళ్తే... 'నాలుగేళ్ల పిల్లోడికి కోచింగా? దెబ్బలు తగిలితే తట్టుకోలేడ'ని తిరస్కరించారు. ఆఖరికి కోచ్ సుభాష్ వాడికి శిక్షణ ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. ఆయన నేతృత్వంలో ఆరోన్‌కు గట్టి పునాది పడింది. సుభాష్ దగ్గర నాలుగేళ్ల శిక్షణ అనంతరం ఆయన సలహాతో అడ్వాన్స్‌డ్ కోచింగ్ కోసం హెచ్‌సీఏ క్యాంప్‌లో వేశాం. అక్కడ అందరూ 14 నుంచి 16 ఏళ్ల పిల్లలే. ఆరోన్ ఒక్కడే ఎనిమిదేళ్ల అబ్బాయి. అండర్-16 క్యాంప్‌లో తీసుకోవడానికి మొదట సందేహించినా, నెట్స్‌లో వాడి బ్యాటింగ్ చూసి కాదనలేకపోయారు. 'కచ్చితంగా ఒకరోజు ఇండియాకి ఆడతాడ'ని వాండర్స్, మోజెస్ సర్‌లు క్యాంప్‌లోకి తీసుకున్నారు. మూడేళ్లపాటు అక్కడే శిక్షణ. తరువాత 2017 నుంచి వీజే అకాడమీలో బీసీసీఐ లెవల్-3 కోచ్ బీజూ నాయర్ క్యాంపులో చేరాడు. ఆయన శిష్యరికంలో మణికట్టుతో షాట్లు కొట్టడంలో మెళకువలు నేర్చుకున్నాడు. అది తన కెరీర్‌ను మలుపు తిప్పింది. ప్రస్తుతం టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్ శిక్షణలో సాధన చేస్తున్నాడు.

పండుగ రోజుల్లో కూడా...

ఆరోన్‌ను రోజూ కోచింగ్ అకాడమీకు తీసుకువెళ్లేదాన్ని. ఒక్క రోజు కూడా ప్రాక్టీస్ మానేవాడు కాదు. ఆఖరికి పండుగలు, సెలవు రోజుల్లో కూడా విశ్రాంతి తీసుకునేవాడు కాదు. అతడి కోసం మేము కూడా మా దినచర్యలను మార్చుకున్నాం. పార్టీలు, బయట డిన్నర్‌లు.. వేటికీ వెళ్లేవాళ్లం కాదు. మా పెద్దమ్మాయి అనన్య లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తోంది. ఆరోన్ చిన్నప్పుడు తన పుస్తకాలను వెంట తెచ్చుకొని, మైదానంలోనే చదువుకునేది. వాడికి పరీక్షలప్పుడు కోచింగ్ నుంచి ఇంటికి వచ్చే సమయంలో పాఠాలు చెప్పేవాళ్లం. ఏదైనా ఒక్కసారి చెబితే చాలు... ఇట్టే పట్టేసేవాడు. ఆటలో ఎంత బిజీగా ఉన్నా ఏనాడూ చదువును నిర్లక్ష్యం చేయలేదు.

కష్టమే కానీ ఇష్టంగా...

నేను ఇంటి పనులు చక్కపెట్టుకొని, వాడిని కోచింగ్‌కు తరువాత స్కూల్‌కు తీసుకెళ్లడం, తిరిగివచ్చి ట్యూషన్స్ చెప్పడం... కష్టంగానే ఉండేది. కానీ ఇష్టంగా చేశాను. ఇప్పుడు ఆరోన్ క్రికెటర్‌గా జాతీయ జట్టులో రాణిస్తుంటే ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. వాడు మాకు దేవుడు ఇచ్చిన వరంలా భావిస్తున్నాం.

మలుపు తిప్పిన ట్రిపుల్...

2022 ఆరోన్ కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ ఏడాది అండర్-16 టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టుకు ఆరోన్ కెప్టెన్. టోర్నీలో బిహార్‌పై ట్రిపుల్ సెంచరీ (303) కొట్టాడు. ఆ ఇన్నింగ్స్ చూసిన బీసీసీఐ స్కౌటింగ్ బృందం తనను బెంగళూరులోని బీసీసీఐ ఎక్స్‌లెన్స్ సెంటర్‌కు పంపించింది. తరువాత వాడిని అండర్-16 నుంచి అండర్-19లోకి మార్చారు. 2024లో జరిగిన అండర్-19 మ్యాచ్‌ల్లో ఐదు 50లు కొట్టి, హైదరాబాద్ తరపున అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. ఆ ప్రదర్శనతో అండర్-19 వరల్డ్‌కప్‌లో చోటు లభిస్తుందని అనుకున్నాం. కానీ దక్కలేదు. మేమంతా చాలా బాధపడ్డాం.



చరిత్రాత్మక విజయం...

ఆ తర్వాత వరల్డ్‌కప్ సన్నాహకాల కోసం బీసీసీఐ ఇంటర్ ఎన్‌సీఏ టోర్నీ నిర్వహించింది. అందులో ఆరోన్ పెద్దగా రాణించలేదు. అదే సమయంలో ఓపెనర్లుగా వైభవ్ సూర్యవంశీ, ఆయూష్ మాత్రే అద్భుతంగా ఆడి, అండర్-19 జట్టులో చోటు దక్కించుకున్నారు. ఆరోన్‌కు కష్టమే అనుకున్నాం. ఆ వెంటనే జరిగిన వినూ మన్కడ్ ట్రోఫీలో 373 పరుగులు చేసి 90 ఏళ్ల హెచ్‌సీఏ చరిత్రలో తొలిసారి హైదరాబాద్‌కు కప్ అందించాడు. ఆరోన్ కెప్టెన్సీ, బ్యాటింగ్ శైలి నచ్చి.. అండర్-19 చాలెంజర్స్ ట్రోఫీ, అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన ట్రై సిరీస్‌లో ఇండియా-బి జట్టుకు కెప్టెన్ చేశారు. అందులో అదరగొట్టడంతో అండర్-19 ఆసియా కప్‌నకు కెప్టెన్‌గా నియమించారు. ఆ టోర్నీలో మంచి ప్రదర్శన ఇవ్వడంతో కుర్రాళ్ల ప్రపంచ కప్ జట్టులో స్థానం ఖాయమైంది.

అదరడు... బెదరడు...

ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ఆరోన్ అదరడు.. బెదరడు. అదే అతడి బలం. జయాపజయాలను ఒకేలా స్వీకరిస్తాడు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో వాడి హెల్మెట్‌కు బంతి తగలడంతో కూలబడ్డాడు. టీవీలో చూస్తున్న నేను కంగారుపడిపోయా. తను మాత్రం వెంటనే తేరుకొని బ్యాటింగ్ చేశాడు. ఇక ప్రపంచ కప్ సెమీస్‌నాడు నేను ఎంతో ఉత్కంఠకు లోనయ్యాను. ఆ మ్యాచ్‌లో ఆరోన్ సెంచరీ కొట్టడం, భారత్ మ్యాచ్ గెలవడం... నిజంగా మరిచిపోలేని అనుభూతి. భారత సీనియర్ జట్టులో వాడిని చూడాలన్నది నా కల. త్వరలోనే అది నెరవేరుతుందని ఆశిస్తున్నా."

అమ్మనాన్న అండతో...

దేశానికి ప్రపంచ కప్ అందించాలనే నా చిన్ననాటి కల నిజమైనందుకు చాలా సంతోషంగా ఉంది. అమ్మానాన్నల ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. రోజూ తెల్లవారుఝాము నాలుగున్నరకు లేచేవాడిని. నాకంటే మా అమ్మ అరగంట ముందు నిద్ర లేచేది. నాన్నకు, నాకు వేర్వేరు వంటలు వండి, బాక్సులు కట్టేది. బడికి సరిగ్గా వెళ్లకపోయినా చదువులో వెనపడలేదంటే... అందుకు కారణం అమ్మ.

– ఆరోన్ జార్జ్

• ఎస్.ఎస్.బి.సంజయ్
ఫొటోలు: జి.శ్రీనివాస్

వంటిల్లు

తియ్యటి సపోటా పండ్లను ఇష్టపడని వారుండరు. వీటితో స్మూతీలు, మిల్క్‌షేక్‌లు, ఐస్‌క్రీమ్‌లే కాదు ఎన్నో రకాల వెరైటీలను తయారుచేయవచ్చు. అలాంటి విభిన్న రుచుల్లో కొన్ని మీకోసం...

సపోటాలతో పసందుగా..!



సపోటా మగ్ కేక్

కావాల్సిన పదార్థాలు

సపోటా పండు- ఒకటి, ఓట్స్ పొడి- రెండు చెంచాలు, మైదా- చెంచా, పంచదార లేదా బెల్లం పొడి- ఒకటిన్నర చెంచాలు, బేకింగ్ పౌడర్- పావు చెంచా, బేకింగ్ సోడా- చిటికెడు, పెరుగు- చెంచా, వెన్న- చెంచా, పాలు రెండు చెంచాలు, వెనీలా ఎస్సెన్స్- రెండు చుక్కలు, చాక్లెట్ చిప్స్- కొన్ని, నట్స్- కొన్ని, చాక్లెట్ సిరప్- చెంచా

తయారీ విధానం

ఓట్స్‌ను దోరగా వేయించి మెత్తటి పొడిలా చేసుకోవాలి. బ్లెండర్‌లో సపోటా పండు ముక్కలు వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. వెడల్పాటి గిన్నెలో ఓట్స్ పొడి, మైదా, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, పంచదార లేదా బెల్లం పొడి వేసి బాగా కలపాలి. తరువాత సపోటా పండు పేస్టు, పాలు, వెన్న, పెరుగు, వెనీలా చుక్కలు వేసి ఉండలు రాకుండా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక మగ్‌లోకి తీసుకుని పైన చాకో చిప్స్, నట్స్ వేయాలి. ఈ మగ్‌ని మైక్రోవేవ్‌లో మూడు నిమిషాలపాటు ఉంచాలి. తరువాత మగ్‌ని బయటికి తీసి చాక్లెట్ సిరప్‌తో అలంకరించి వేడిగా లేదా చల్లగా సర్వ్ చేయవచ్చు.



సపోటా బర్ఫీ

కావాల్సిన పదార్థాలు

సపోటా పండ్లు- ఏడు, కోవా- పావు కేజీ, పాల పొడి- నాలుగు చెంచాలు, పంచదార- నాలుగు చెంచాలు, నెయ్యి- అయిదు చెంచాలు, యాలకుల పొడి- అర చెంచా, బాదం పలుకులు- కొన్ని, పిస్తా పలుకులు- కొన్ని

తయారీ విధానం

బ్లెండర్‌లో సపోటా పండ్ల ముక్కలు వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నెయ్యి, సపోటా పండ్ల గుజ్జు వేసి బాగా కలుపుతూ చిన్న మంట మీద అయిదు నిమిషాల పాటు వేయించి దించాలి. స్టవ్ మీద మరో గిన్నె పెట్టి అందులో కోవా, పాల పొడి, పంచదార వేసి బాగా కలపాలి. ఆపైన సపోటా పండ్ల పేస్టు, యాలకుల పొడి కూడా వేసి కలపాలి. ఈ మిశ్రమం ముద్దలా దగ్గరకు వచ్చే వరకు చిన్న మంట మీద ఉడికించాలి. ఆపైన నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా పరిచి పైన బాదం పలుకులు, పిస్తా పలుకులు చల్లాలి. ఇది చల్లారిన తరువాత ముక్కలుగా కోసి సర్వ్ చేయాలి.



సపోటా లాలిపాప్స్

కావాల్సిన పదార్థాలు

పండిన సపోటాలు- అయిదు, జీడిపప్పులు- పది, ఖర్జూరాలు- అయిదు, పాలు- ఒక కప్పు, తేనె- రెండు చెంచాలు

తయారీ విధానం

మిక్సీ గిన్నెలో సపోటా పండ్ల ముక్కలు, జీడిపప్పులు, ఖర్జూరాలు, పాలు, తేనె వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. లాలిపాప్ మౌల్డ్స్‌లో ఈ మిశ్రమాన్ని పోసి మధ్యలో ఐస్‌క్రీమ్ స్టిక్స్‌ను ఉంచాలి. వీటిని డీప్ ఫ్రిజ్‌లో ఆరు గంటలపాటు ఉంచాలి. ఆపైన మౌల్డ్స్ మీద గోరువెచ్చటి నీటిని పోస్తూ లాలిపాప్స్‌ను బయటికి తీయాలి. వీటిని ఐస్ క్యూబ్స్ మీద ఉంచి సర్వ్ చేస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.

సపోటా హల్వా

కావాల్సిన పదార్థాలు

పండిన సపోటాలు- నాలుగు, బొంబాయి రవ్వ- ఒక కప్పు, బెల్లం- ఒక కప్పు, పంచదార- పావు కప్పు, పాలు- మూడు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, జీడిపప్పులు- అయిదు, బాదం పప్పులు- అయిదు, యాలకుల పొడి- అర చెంచా

తయారీ విధానం

సపోటా పండ్ల ముక్కలను గిన్నెలోకి తీసుకుని చెంచాతో కచ్చా పచ్చాగా మెదిపి పంచదార కలపాలి. ఆపైన గిన్నెను స్టవ్ మీద పెట్టి సపోటా పండ్ల గుజ్జును రెండు నిమిషాలపాటు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నెయ్యి, జీడిపప్పు పలుకులు, బాదం పలుకులు, బొంబాయి రవ్వ వేసి గరిటెతో కలుపుతూ మూడు నిమిషాల పాటు దోరగా వేయించాలి. ఆపైన వేడి పాలు పోసి అయిదు నిమిషాలపాటు మిశ్రమాన్ని కలుపుతూ ఉండాలి. రవ్వ ఉడికి దగ్గరకు వచ్చిన తరువాత సపోటా పండ్ల గుజ్జు, బెల్లం వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత యాలకుల పొడి వేసి కలిపి గిన్నెను స్టవ్ మీద నుంచి దించాలి. ఈ సపోటా హల్వాని వేడి వేడిగా పూరీ లేదా చపాతీతో సర్వ్ చేయాలి.

మేకప్

40ల్లో 20ల్లా

40 ఏళ్ల వయసులో చర్మం బిగుతు కోల్పోయి, ముడతలు పడడం సహజం. ఈ వయసులో వేసుకునే మేకప్ ఆ ముడతలను పెంచేలా ఉండకుండా, చర్మంలో కలిసిపోయిన భ్రమను కలిగించాలి. అందుకోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించాలి



చర్మం సిద్ధం: మొదట ముఖానికి హైడ్రేటింగ్ సీరమ్/క్రీమ్, మాయిశ్చరైజింగ్ ప్రైమర్ అప్లై చేసుకోవాలి. దాంతో చర్మం మీద కనిపించే సన్నని గీతలు చర్మంలో కలిసిపోతాయి

లైట్ వెయిట్ కవరేజ్: మాట్ ఫార్ములాలను కలిగి ఉండే ఫౌండేషన్లకు బదులుగా, హైడ్రేషన్‌ను అందించే షీర్ ఫౌండేషన్, టింటెడ్ మాయిశ్చరైజర్ లేదా సిసి క్రీమ్ అప్లై చేసుకుంటే ముఖం యవ్వనంగా కనిపిస్తుంది. అయితే వీటిని వీలైనంత తక్కువ మోతాదులోనే వాడుకోవాలి

కన్‌సీల్: కలర్ కరెక్టర్‌కు ముందు కన్‌సీలర్ వాడుకోవాలి. కళ్ల కింద నల్లని వలయాల కోసం పీచ్/నారింజ రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి

పౌడర్: ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో ట్రాన్స్‌ల్యూసెంట్ పౌడర్ పలుచగా అద్దుకోవాలి

బ్లష్: చెక్కిళ్ల పైన క్రీమ్ బ్లష్ అప్లై చేసుకోవాలి

ఐబ్రో పెన్సిల్: పలుచగా ఉన్న కనుబొమలను దిద్దుకోవడం కోసం పెన్సిల్ ఉపయోగించవచ్చు. కానీ తీర్చిదిద్దినట్టు కాకుండా, సహజసిద్ధంగా ఉండేలా దిద్దుకోవాలి

ఐలైనర్: ద్రవరూప ఐలైనర్‌కు బదులుగా,పెన్సిల్ లైనర్‌ను ఎంచుకోవాలి

మస్కారా: నాణ్యమైన మస్కారా వాడుకోవాలి. చెదిరిపోకుండా ఉండడం కోసం ట్యూబింగ్ ఫార్ములాను కలిగిన మస్కారా ఎంచుకోవాలి

ఐషాడో: క్రీమ్ షాడోస్ బాగుంటాయి. చక్కగా కలిసిపోతాయి. కాబట్టి ముదురు రంగులకు బదులుగా తేలిక రంగు ఐషాడో ఎంచుకోవాలి.

లిప్‌స్టిక్: క్రీమీ లిప్‌స్టిక్‌ను ఎంచుకోవాలి. వేసుకున్న లిప్‌స్టిక్ చెదిరిపోకుండా ఉండడం కోసం సాఫ్ట్ లైనర్‌ను వాడుకోవాలి

టెక్స్చర్: మేకప్ కోసం ఎంచుకునే సాధనాలు పౌడర్ రూపంలో ఉండకుండా చూసుకోవాలి. బదులుగా హైడ్రేషన్‌ను అందించే క్రీమీ ఉత్పత్తులు ఎంచుకోవాలి

బ్లెండ్: మేకప్ ఎబ్బెట్టుగా కనిపించకుండా చర్మంలో కలిసిపోయిన లుక్ పొందడం కోసం, ఫౌండేషన్ అద్దుకోడానికి తడిపి పిండిన స్పాంజ్‌ను వాడుకోవాలి

ముడతలు: ముడతలను మేకప్‌తో పూర్తిగా దాచే ప్రయత్నం చేయకూడదు. వీలైనంత సహజసిద్ధమైన లుక్ కోసం ప్రయత్నించాలి

సన్ ట్యాన్ మాయం ఇలా..!

ఎండాకాలంలో ఎదురయ్యే ప్రధాన సమస్య సన్ ట్యాన్. దీనివల్ల ముఖం, మెడ, చేతులు నల్లగా మారి నిర్జీవంగా కనిపిస్తుంటాయి. ఈ ట్యాన్‌ను సులభంగా తొలగించి చర్మాన్ని తాజాగా మెరిపించే చిట్కాలివే...



- చెంచా తేనెలో రెండు చుక్కల నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని చూపుడు వేలితో ముఖానికి, మెడకు పట్టించి పావుగంట తరువాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. నిమ్మరసం బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి ట్యాన్‌ని తొలగిస్తుంది.
- పావు కప్పు పెరుగులో చెంచా పసుపు వేసి క్రీమ్‌లా మారే వరకు చెంచాతో కలపాలి. దీన్ని ట్యాన్ ఏర్పడిన భాగాలపై అప్లయ్ చేసి అరగంట సేపు ఉంచాలి. తరువాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకుంటే చాలు.
- రాత్రి పడుకునేముందు టమాటా గుజ్జు లేదా కలబంద గుజ్జును ముఖానికి, చేతులకు పట్టించి ఉదయాన్నే గోరువెచ్చటి నీటితో స్నానం చేస్తే చర్మం నిగారిస్తుంది.
- ట్యాన్ ఏర్పడిన చోట బంగాళదుంప రసం రాసినా, బాదం పేస్టు పట్టించినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఇవి చర్మం పై పొరను బ్లీచ్ చేసి నలుపుదనాన్ని మాయం చేస్తాయి.
- అర కప్పు పెరుగులో రెండు చెంచాల ఓట్స్ పొడి వేసి ముఖానికి, మెడకు ప్యాక్‌లా పట్టించాలి. చేతివేళ్లతో వలయాకారంలో సున్నితంగా రుద్దుతూ ప్యాక్‌ను తొలగించాలి. దీనివల్ల చర్మంపై పేరుకున్న మృత కణాలు, మురికి, ట్యాన్ తొలగిపోతాయి. రక్తప్రసరణ మెరుగుపడి చర్మం ఛాయగా మెరుస్తుంది.
- బయటి నుంచి ఇంట్లోకి రాగానే ముఖాన్ని శుభ్రం చేసుకుని గులాబీ నీళ్లను స్ప్రే చేసుకుంటే ట్యాన్ తొలగి చర్మం తేమతో నిండుతుంది.

ఆరోగ్యాన్నిచ్చే అలవాట్లు

రోజంతా చురుకుగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని మంచి అలవాట్లు అలవరచుకోవాల్సిందే! అవేంటంటే...



- ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత ఒక గ్లాసు గోరువెచ్చటి నీరు తాగాలి. దీని వల్ల జీవక్రియలు వేగవంతమవుతాయి. జీర్ణాశయం, పేగులు, మూత్రపిండాలు శుభ్రపడతాయి.
- రాత్రి పడుకునేముందు, ఉదయం నిద్ర లేచిన తరువాత కనీసం అయిదు నిమిషాల పాటు ధ్యానం లేదా యోగా చేయడం మంచిది. దీని వల్ల నాడీవ్యవస్థ ఉపశమనం పొందుతుంది. శరీరానికి ఒత్తిడి తగ్గుతుంది.
- ఉదయం పూట పావుగంటసేపు ఎండలో గడపాలి. అప్పుడే శరీరానికి కావాల్సిన డి విటమిన్ అందుతుంది. ఎముకలు, కండరాలు, కీళ్లు బలోపేతమవుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది.
- రోజూ కొంతసేపు పుస్తకాలు చదువుతుంటే మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.
- రోజూ తేలికపాటి వ్యాయామం చేయాలి. దీని వల్ల శరీరంలో కదలికలు పెరుగుతాయి. బద్ధకం, బడలిక తొలగి రోజంతా ఆనందంగా అనిపిస్తుంది.
- ఉదయం, రాత్రి సమయాల్లో ఫోన్‌కు దూరంగా ఉండాలి. అప్పుడే బంధాలు బలపడి మానసిక స్థైర్యం చేకూరుతుంది.
- రోజూ తాజా పండ్లు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవాలి. సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు దరి చేరవు.
- పలు సందర్భాల్లో ఏర్పడే ఆలోచనలు, మనసులోని భావాలను ఓ పుస్తకంలో రాయడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల భావోద్వేగాలను నియంత్రించుకోవడం, చక్కని ప్రణాళిక విధానం అలవడతాయి.

కివీస్.. చేజేతులా


శాంట్నర్

4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ విజయం
విల్ జాక్స్ ఆల్‌రౌండ్‌షో
పాక్ ఆశలు సజీవం ● టీ20 వరల్డ్‌కప్


విల్ జాక్స్

కొలంబో: సెమీస్ బెర్త్ దక్కాలంటే కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆఖర్లో తడబడింది. క్లిష్టతరమైన పిచ్‌పై సవాల్ విసిరే స్కోరు సాధించడమే కాకుండా.. బౌలర్లు కూడా విశేషంగా రాణించి చివరి వరకు తమదే విజయం అనే స్థితికి తెచ్చారు. కానీ 18వ ఓవర్‌లో 22 పరుగులు సమర్పించుకోవడంతో కివీస్ భారీ మూల్యమే చెల్లించుకుంది. దీంతో శుక్రవారం జరిగిన ఈ సూపర్-8 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో నెగ్గింది. విల్ జాక్స్ ఆల్‌రౌండ్ షోతో (2/23; 18 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 32 నాటౌట్) అదరగొట్టాడు. అలాగే ఇంగ్లండ్ హ్యాట్రిక్ విజయాలతో గ్రూప్ 2లో టాప్‌నకు చేరింది. ఇక కివీస్ సెమీస్ అవకాశాలు పాక్ ప్రదర్శనపై ఆధారపడి ఉన్నాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఫిలిప్స్ (39), సైఫర్ట్ (35), ఆలెన్ (29) సత్తాచాటారు. స్పిన్నర్లు జాక్స్, రషీద్, రెహాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 19.3 ఓవర్లలో 6 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. బాంటన్ (33), బ్రూక్ (26), కర్రాన్ (24) రాణించారు. రచిన్‌కు మూడు వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జాక్స్ నిలిచాడు.

చివర్లో జోరు: ఓ మాదిరి ఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే తడబడింది. తొలి రెండు ఓవర్లలోనే సాల్ట్ (2), బట్లర్ (0) వికెట్లను కోల్పోయింది. తర్వాత కెప్టెన్ బ్రూక్ నిలదొక్కుకుని ఒత్తిడిని దూరం చేశాడు. ఇక ఓ దశలో 18 బంతుల్లో 43 పరుగులు అవసరమయ్యాయి. కానీ ఫిలిప్స్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో రెహాన్ (19 నాటౌట్) 6, జాక్స్ 6,4,4తో 22 రన్స్ రాబట్టి కివీస్‌కు షాకిచ్చారు. ఇక ఆ తర్వాత మరో 3 బంతులుండగా ఈ జోడీ మ్యాచ్‌ను ముగించింది. చివరి 15 బంతుల్లోనే వీరు 44 పరుగులు రాబట్టడం విశేషం.

స్పిన్నర్ల కట్టడి: టాస్ గెలిచిన కివీస్ బ్యాటింగ్ ఎంచుకోగా, ఓపెనర్లు సైఫర్ట్, ఆలెన్ ధనాధన్ ఆటతీరుతో శుభారంభం అందించారు. కానీ ఆ తర్వాతే కివీస్ ఆటలో వేగం తగ్గింది. ఈ క్రమంలో దూకుడుగా ఆడే ప్రయత్నంలో వికెట్లు కోల్పోవడంతో చివరి ఐదు ఓవర్లలో 34 పరుగులే వచ్చాయి. అంతకుముందు వరుస ఓవర్లలో సైఫర్ట్‌ను రషీద్.. ఆలెన్‌ను జాక్స్ పెవిలియన్‌కు చేర్చి ఝలక్ ఇచ్చారు. తొలి వికెట్‌కు ఈ జోడీ 64 పరుగులు అందించింది. ఈ దశలో ఫిలిప్స్ అండగా నిలిచి ఎదురుదాడికి దిగాడు. దీంతో 14 ఓవర్లలో 123/3 స్కోరుతో కివీస్ పటిష్టంగానే కనిపించింది. కానీ అప్పటికే ధాటిగా ఆడుతున్న చాప్‌మన్ (15)ను రషీద్ అవుట్ చేయడంతో కివీస్ లయ తప్పింది. స్పిన్నర్లు డాట్ బాల్స్‌తో ఒత్తిడి పెంచారు. దీంతో షాట్లు ఆడేందుకు వెళ్లిన ఫిలిప్, మిచెల్ (3), మకాన్‌చీ (14) వేగంగా వెనుదిరిగారు. చివరి ఓవర్‌లో 12 రన్స్‌తో స్కోరు కష్టంగా 150 దాటింది.

పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
దక్షిణాఫ్రికా	2	2	0	0	4	2.890
వెస్టిండీస్	2	1	1	0	2	1.791
భారత్	2	1	1	0	2	-0.100
జింబాబ్వే	2	0	2	0	0	-4.475

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	3	3	0	0	6	1.096
న్యూజిలాండ్	3	1	1	1	3	1.390
పాకిస్థాన్	2	0	1	1	1	-0.461
శ్రీలంక	2	0	2	0	0	-2.800

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్

1 టీ20 ఇన్నింగ్స్‌లో ఏకంగా 16 ఓవర్లు స్పిన్నర్లచేతే వేయించడం ఇంగ్లండ్‌కిదే మొదటిసారి. అలాగే టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌ల్లో స్పిన్నర్లే ఎక్కువ వికెట్లు (7) తీయడం ఈ జట్టుకిది రెండోసారి.

ఇంగ్లండ్ తరఫున టీ20ల్లో ఎక్కువ డకౌట్లు (10) అయిన బ్యాటర్‌గా బట్లర్.

సంక్షిప్త స్కోర్లు:
కివీస్: 20 ఓవర్లలో 159/7 (ఫిలిప్స్ 39, సైఫర్ట్ 35, ఆలెన్ 29; జాక్స్ 2/23, రషీద్ 2/28, రెహాన్ 2/28)
ఇంగ్లండ్: 19.3 ఓవర్లలో 161/6 (బాంటన్ 33, జాక్స్ 32 నాటౌట్, బ్రూక్ 26; రచిన్ 3/19)

రింకూ ఇంట విషాదం

తండ్రి ఖాన్‌చంద్ మృతి


ఖాన్‌చంద్ సింగ్

అలీగఢ్ : భారత క్రికెటర్ రింకూ సింగ్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. అతడి తండ్రి ఖాన్‌చంద్ సింగ్ శుక్రవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. కొంతకాలంగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వ్యాధి స్టేజి 4కు చేరడంతో ఖాన్‌చంద్‌ను ఈనెల 21న గ్రేటర్ నొయిడాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వెంటిలేటర్‌పై చికిత్సనందించారు. పరిస్థితి విషమంగా ఉందన్న సమాచారంతో రింకూ జింబాబ్వేతో మ్యాచ్‌కు ముందే ఆస్పత్రికి వచ్చి, తిరిగి వెంటనే మళ్లీ చెన్నైలో ఉన్న టీమ్‌తో చేరాడు. కానీ తండ్రి మృతి వార్త తెలిశాక వెంటనే రింకూ స్వస్థలానికి చేరుకుని శుక్రవారం అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

ప్రజాప్రతినిధులతోనే క్రీడాంధ్రప్రదేశ్ సాధ్యం



● శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం క్రీడాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకోవాలంటే అది ప్రజాప్రతినిధులతోనే సాధ్యమవుతుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన శాప్ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా వారిని కార్యోన్ముఖులను చేయడానికి శాసనసభ-మండలి క్రీడా పోటీలు దోహదం చేశాయని హర్షం వ్యక్తం చేశారు. తాజాగా నిర్వహించిన రెండో అంచె పోటీల్లో ప్రజాప్రతినిధులందరూ ఉత్సాహంగా పాల్గొనడంతో పాటు తమ నియోజకవర్గాల్లో చేయాల్సిన క్రీడా కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించడం, ఆ దిశగా పని చేసేందుకు సిద్ధమవడం శుభ పరిణామమని రవినాయుడు అన్నారు.

రెండ్రోజులు ఆలస్యంగా ఐపీఎల్

● మార్చి 28న ప్రారంభం

ముంబై: ఈ ఏడాది ఐపీఎల్‌ను వచ్చే నెల 28వ తేదీ నుంచి మే 31 వరకు నిర్వహించేలా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. వాస్తవానికి తొలుత మార్చి 26వ తేదీన ప్రారంభించాలని అనుకున్నా తాజా పరిణామాల నేపథ్యంలో రెండ్రోజులు ఆలస్యంగా ఈ ధనాధన్ లీగ్‌ను నిర్వహించనున్నారు. ఫైనల్ మే 31న జరుగుతుంది. అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌ను భారత ఎన్నికల సంఘం త్వరలో విడుదల చేయనుంది. ఇప్పటికే ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ సిద్ధం కాగా, ఈ ఎన్నికల సందర్భంగా స్వల్ప మార్పులు, చేర్పులుంటే వాటిని సరిచేసి తేదీలను ప్రకటించాలని ఐపీఎల్ పాలకమండలి ఎదురు చూస్తోంది.

గెలుపు ముంగిట జమ్మూ కశ్మీర్


అకిబ్ నబీ (5 వికెట్లు)

● రెండో ఇన్నింగ్స్ 186/4
● ప్రస్తుత ఆధిక్యం 477
● కర్ణాటకతో రంజీ ఫైనల్

హుబ్బళ్లి: తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరిన జమ్మూ కశ్మీర్ టైటిల్ దిశగా సాగుతోంది. శుక్రవారం నాలుగో రోజు ఆటలో జమ్మూ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 186 పరుగులు చేసింది. కమ్రాన్ ఇక్బాల్ (94 బ్యాటింగ్), సాహిల్ లోత్రా (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం 477 పరుగుల భారీ ఆధిక్యంలో ఉండగా మ్యాచ్‌కు శనివారం ఆఖరి రోజు. దీంతో ఫైనల్ పోరు డ్రాగా ముగిసే అవకాశం ఉంది. అదే జరిగితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా జమ్మూ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించనుంది. అంతకుముందు కర్ణాటకను పేసర్ అకిబ్ నబీ ఐదు వికెట్లతో వణికించాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 293 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ (160) శతకం సాధించగా, కృతిక్ (36) ఫర్వాలేదనిపించాడు. సునీల్, యుధ్‌వీర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. జమ్మూ తొలి ఇన్నింగ్స్‌లో 584 పరుగులు చేసింది. మరోవైపు ఈ సీజన్‌లో చెలరేగుతున్న జమ్మూ పేసర్ అకిబ్ నబీని ఇంగ్లండ్ పర్యటన కోసం భారత జట్టుకు ఎంపిక చేయాలని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కోరాడు. 29 ఏళ్ల అకిబ్ ఈ రంజీ సీజన్‌లో ఇప్పటి వరకు 60 వికెట్లు పడగొట్టాడు.


ఆఘా, షనక

పాకిస్థాన్ ఇలా నెగ్గాలి..

● శ్రీలంకతో నేడు చావో రేవో మ్యాచ్
● రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

పల్లెకెలె : చివరి రెండు ఓవర్లలో సంచలన ప్రదర్శన కనబరచిన ఇంగ్లండ్ జట్టు న్యూజిలాండ్‌ను ఓడించడంతో వరల్డ్ కప్‌లో మిణుకుమిణుకుమంటున్న పాకిస్థాన్ సెమీస్ ఆశలు కాసింత ఊపిరి పోసుకున్నాయి. ఈనేపథ్యంలో శనివారం ఇక్కడ జరిగే అతి కీలక మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకతో పాకిస్థాన్ అమీతుమీ తేల్చుకోనుంది. ఆడిన సూపర్-8 రెండు మ్యాచ్‌ల్లో ఒకటి వర్షంతో రద్దయి, మరో పోటీలో ఓడిన పాకిస్థాన్ (-0.461) కేవలం ఒక పాయింట్‌తో ఉంది. మరోవైపు మొత్తం మూడు పాయింట్లతో సూపర్-8 మ్యాచ్‌లను కివీస్ (+1.390) పూర్తి చేసింది. దాంతో శ్రీలంకతో మ్యాచ్‌లో పాకిస్థాన్ 64 పరుగులతో విజయం సాధించాలి. చేజింగ్‌లో అయితే లక్ష్యాన్ని 13.1 ఓవర్లలో పూర్తి చేయాలి. ఇది జరిగితే న్యూజిలాండ్‌ను పక్కకునెట్టి పాకిస్థాన్ సెమీఫైనల్లోకి అడుగుపెడుతుంది. లేదంటే తట్టాబుట్టా సర్దుకోవాల్సిందే.

'ఈడెన్'లో పరుగుల పండుగే!

కోల్‌కతా : వరల్డ్ కప్ సూపర్-8 ఆఖరి పోరులో ఆదివారం వెస్టిండీస్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. టీమిండియాకు ఈ మ్యాచ్ నాకౌట్. గెలిస్తే సెమీస్‌కు లేదంటే డిఫెండింగ్ చాంపియన్ ఇంటికే. అయితే ఈ మ్యాచ్‌లో పరుగుల వరద ఖాయమని స్థానిక క్యూరేటర్ సుజన్ ముఖర్జీ సూచనప్రాయంగా వెల్లడించాడు. కారణం..గత నెల తొమ్మిదిన ఈడెన్‌గార్డెన్స్‌లో స్కాట్లాండ్-ఇటలీ మధ్య నిర్వహించిన మ్యాచ్ పిచ్‌పైనే భారత్-వెస్టిండీస్ పోరు జరగడం. ఆ పోటీలో స్కాట్లాండ్ తొలుత 200 పరుగులకుపైగా స్కోరు చేసింది. ఇక..బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ శుక్రవారం సాయంత్రం ఆ వికెట్‌ను పరిశీలించి చీఫ్ క్యూరేటర్ ఆశిష్ భౌమిక్‌తో కలిసి సుదీర్ఘంగా చర్చించాడు. వికెట్ ఉపరితలం బాగా పొడిగా ఉండనున్న క్రమంలో స్పిన్నర్లు కీలక భూమిక పోషించే చాన్సుంది. పిచ్‌పై బౌన్స్ కూడా అయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇటలీతో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్ వికెట్ నుంచి అందిన బౌన్స్‌ను చక్కగా ఉపయోగించుకున్నాడు. దాంతో టీమిండియా పేస్ దళపతి బుమ్రా, ఎడమ చేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్, హార్దిక్ బౌన్స్‌తో లబ్ది పొందే అవకాశాలున్నాయి. అయితే ఈసారి మెగా టోర్నీలో ఈడెన్‌లో భారత్ తొలి మ్యాచ్ ఆడుతోంది. మరోవైపు వెస్టిండీస్ ఇక్కడ రెండు గ్రూపు మ్యాచ్‌లు ఆడి ఉండడం ఆ జట్టుకు సానుకూలాంశం. స్కాట్లాండ్, ఇటలీలతో జరిగిన ఆ రెండు మ్యాచ్‌ల్లో కరీబియన్లు విజయం సాధించారు.



రెండో వన్డేలోనూ చిత్తుగా..


వాల్ (101)

● జార్జియా వాల్ సెంచరీ
● భారత్‌పై ఆసీస్ ఘన విజయం

హోబర్ట్ : బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై పరుగులు సులువుగా లభించినా..భారత బ్యాటర్లు చెత్త షాట్లతో వికెట్లు పారేసుకున్నారు. మరోవైపు వికెట్‌ను సద్వినియోగం చేసుకున్న ఆస్ట్రేలియా జట్టులో జార్జియా వాల్ (101) సెంచరీతో కదం తొక్కింది. లిచ్‌ఫీల్డ్ (80) ధనాధన్ బ్యాటింగ్‌తో మెరిసింది. ఫలితంగా శుక్రవారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా మహిళలు ఐదు వికెట్లతో గెలుపొందారు. తొలి మ్యాచ్‌లోనూ ఆతిథ్య జట్టు నెగ్గిన విషయం తెలిసిందే. మొదట భారత్ 50 ఓవర్లలో 251/9 స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (54), ఓపెనర్ ప్రతికా రావల్ (52) అర్ధ శతకాలతో సత్తా చాటారు. ఛేదనలో వాల్, లిచ్‌ఫీల్డ్‌కు తోడు బెత్ మూనీ (31) రాణించడంతో ఆసీస్ 36.1 ఓవర్లలో 252/5 స్కోరు చేసి నెగ్గింది.

హర్మన్, ప్రతిక హాఫ్ సెంచరీలు..: పిచ్ నుంచి సహకారం అందినా..చెత్త షాట్లతో వికెట్లు పారేసుకొన్న భారత బ్యాటర్లు మూల్యం చెల్లించుకున్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ప్రతిక, మంధాన తొలి వికెట్‌కు 78 పరుగులతో శుభారంభం అందించారు. మంధాన, ప్రతిక నిష్క్రమణ తర్వాత వచ్చిన బ్యాటర్లు విఫలం కాగా..కశ్వీ గౌతమ్ (25) జతగా హర్మన్ ఏడో వికెట్‌కు 55 పరుగుల విలువైన భాగస్వామ్యం నమోదు చేసింది. దాంతో టీమిండియా స్కోరు 200 దాటింది. ఇక..మూడు టీ20లు, మూడు వన్డేలు, ఒక టెస్ట్ మ్యాచ్‌తో కూడిన ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో..టీ20లను భారత్ 1-2తో నెగ్గిన సంగతి తెలిసిందే. మరో వన్డే, టెస్ట్ జరగాల్సి ఉంది.

బిజినెస్

ప్రగతి రథం.. వృద్ధి పథం

క్యూ3లో జీడీపీ వృద్ధి రేటు 7.8%.. ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనా 7.4% నుంచి 7.6 శాతానికి పెంపు

2022-23 ఆధార సంవత్సరంగా లెక్కించిన తొలి గణాంకాలను విడుదల చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో భారత జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైంది. మాన్యుఫాక్చరింగ్, సేవల రంగాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి నమోదైన 7.4% వృద్ధితో పోలిస్తే పెరిగినప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) నమోదైన 8.4% వృద్ధి రేటుతో పోలిస్తే మాత్రం గణనీయంగా తగ్గింది. అయితే, ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయ వాణిజ్యంలో అనిశ్చితుల నేపథ్యంలోనూ భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది.

ఆధార సంవత్సరం మార్పు తొమ్మిదోసారి..

2022-23 ఆధార సంవత్సరంగా గణించిన కొత్త జీడీపీ సిరీస్‌లో విడుదల చేసిన తొలి గణాంకాలివి. ఇదివరకు జీడీపీ లెక్కింపునకు 2011-12 ఆధార సంవత్సరంగా ఉంది. జీడీపీ గణాంకాల లెక్కింపునకు ఆధార సంవత్సరాన్ని సవరించడం ఇది 9వసారి. కొత్త సిరీస్ ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి జీడీపీ వృద్ధి 7.6 శాతంగా నమోదు కావచ్చని అంచనా. ఈ జనవరిలో విడుదల చేసిన ముందస్తు అంచనా 7.4 శాతంతో పోలిస్తే 0.2% అధికమిది.

క్యూ1, క్యూ2 వృద్ధి రేటు సవరణ

ఈ క్యూ2 జీడీపీ వృద్ధి రేటును గతంలో ప్రకటించిన 8.2 శాతం నుంచి 8.4 శాతానికి పెంచిన కేంద్రం.. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1) వృద్ధి రేటును మాత్రం 7.8 శాతం నుంచి 6.7 శాతానికి కుదించింది.

2026-27 వృద్ధి అంచనా 7-7.4 శాతం

కొత్త జీడీపీ సిరీస్ విడుదల నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలనూ సవరించారు. ఈ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 7-7.4 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. ఈ జనవరిలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన వృద్ధి శ్రేణి 6.8-7.2 శాతంతో పోలిస్తే ఇది 0.2 శాతం అధికం.



ఎకానమీ @ 4 లక్షల కోట్ల డాలర్లు

ప్రస్తుత సంకేతాలను బట్టి చూస్తే, వచ్చే ఆర్థిక సంవత్సరంలో నామినల్ జీడీపీ వృద్ధి రేటు దాదాపు 11 శాతానికి చేరుకోవచ్చని, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని దాటవచ్చని నాగేశ్వరన్ అన్నారు. మన ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధిని కొనసాగించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయ గణాంకాల శాఖ డేటా ప్రకారం..

జీడీపీ

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ3లో 2022-23 సంవత్సరం ఆధారంగా లెక్కించిన వాస్తవిక జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) రూ.84.54 లక్షల కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.78.41 లక్షల కోట్లతో పోలిస్తే 7.8 శాతం వృద్ధి కనబరిచింది.

● ప్రస్తుత ధరల ఆధారంగా లెక్కించిన నామినల్ జీడీపీ ఈ క్యూ3లో రూ.90.91 లక్షల కోట్లుగా ఉంది. 2024-25 క్యూ3లో నమోదైన రూ.83.46 లక్షల కోట్లతో పోలిస్తే 8.9 శాతం పెరిగింది.

● ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొత్తానికి వాస్తవిక జీడీపీ రూ.322.58 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలి సవరణ అంచనా రూ.299.89 లక్షల కోట్లతో పోలిస్తే 7.6 శాతం వృద్ధి నమోదు కావచ్చని అంచనా.

● 2025-26 ఆర్థిక సంవత్సరానికి నామినల్ జీడీపీ రూ.345.47 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.318.07 లక్షల కోట్లతో పోలిస్తే 8.6 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా.

జీవీఏ

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 2022-23 ఆధార సంవత్సరంగా గణించిన 'జోడించిన స్థూల విలువ' (జీవీఏ) రూ.294.40 లక్షల కోట్లకు పెరగవచ్చని అంచనా. గత ఆర్థిక సంవత్సరానికి నమోదైన రూ.273.36 లక్షల కోట్లతో పోలిస్తే 7.7 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా.

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నామినల్ జీవీఏ రూ.313.61 లక్షల కోట్లుగా ఉండవచ్చని అంచనా. 2024-25లో నమోదైన 288.54 లక్షల కోట్లతో పోలిస్తే 8.7 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా.

● ఈ క్యూ3లో రియల్ జీవీఏ 7.8% వృద్ధితో రూ.77.38లక్షల కోట్లకు చేరుకుంది. 2024-25లో ఇదేకాలంలో రూ.71.77లక్షల కోట్లుగా ఉంది. నామినల్ జీవీఏ 8.2% వృద్ధి చెంది రూ.82.58 లక్షల కోట్లకు పెరిగింది.

భారత్ బయోటెక్ రూ.4,600 కోట్ల ఐపీఓ!

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఐపీఓ ద్వారా సుమారు రూ.4,600 కోట్లు (50 కోట్ల డాలర్లు) సమీకరించాలని భారత్ బయోటెక్ లక్ష్యంగా పెట్టుకుందని బ్లూంబర్గ్ వార్తా సంస్థ వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూకి సంబంధించి చర్చలు చురుగ్గా సాగుతున్నాయని, ఇష్యూ పరిమాణం, జారీ చేసే సమయంలో స్వల్పమార్పులు ఉండే అవకాశం ఉందని తెలిపింది. 1996లో కార్యకలాపాలు ప్రారంభించిన భారత్ బయోటెక్ ప్రపంచవ్యాప్తంగా 900 కోట్లకు పైగా వ్యాక్సిన్లు సరఫరా చేసింది. కంపెనీ ఉత్పత్తుల్లో హెపటైటిస్ బి, కొవిడ్-19 వ్యాక్సిన్లతో పాటు కాలిన గాయాలు, అతిసార వ్యాధులకు ఉపయోగించే ఔషధాలు కూడా ఉన్నాయి.

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు

● సెన్సెక్స్ 961 పాయింట్లు డౌన్

ముంబై: అమెరికా-ఇరాన్ మధ్య అణు చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో పాటు పెరిగిన భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా శుక్రవారం ఈక్విటీ మార్కెట్ భారీ కుదుపునకు లోనైంది. విదేశీ నిధుల తరలింపు మార్కెట్ నష్టాలకు ఆజ్యం పోసింది. ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్ 961.42 పాయింట్లు నష్టపోయి 81,287.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 317.90 పాయింట్ల నష్టంతో 25,178.65 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,527.52 పాయింట్లు, నిఫ్టీ 392.6 పాయింట్లు నష్టపోయాయి. మార్కెట్ కల్లోలంతో ఒక్క రోజులోనే ఇన్వెస్టర్ల సంపద రూ.4,98,603.42 కోట్లు నష్టపోయి రూ.4,63,50,671.27 వద్ద (5.10 లక్షల కోట్ల డాలర్లు) స్థిరపడింది.

పెరిగిన బంగారం ధర

ఆభరణాల వ్యాపారులు, స్టాకిస్టుల నుంచి కొనుగోళ్ల మద్దతుతో ఢిల్లీ మార్కెట్లో మేలిమి బంగారం ధర 10 గ్రాములు రూ.1,800 పెరిగి రూ.1,64,700 పలికింది. కిలో వెండి ధర రూ.2,500 నష్టపోయి రూ.2.68 లక్షల వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ వెండి ధర ఔన్సు (31.10 గ్రాములు) 1.42 డాలర్లు పెరిగి 89.72 డాలర్ల వద్ద ముగియగా బంగారం ధర స్వల్పంగా దిగజారి 5,172.17 డాలర్లు పలికింది.

మహీంద్రా కొత్త రొటావేటర్లు

● జహీరాబాద్ ప్లాంట్‌లో తయారీ




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) వ్యవసాయ యంత్రాల విభాగం సరికొత్త రొటావేటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. మహావేటర్, మహావేటర్ హెచ్‌డీ సీరిస్ పేరుతో అభివృద్ధి చేసిన ఈ సరికొత్త రొటావేటర్లను కంపెనీ తెలంగాణలోని జహీరాబాద్, పంజాబ్‌లోని నభా ప్లాంట్లలో తయారు చేస్తోంది. దేశంలోని అన్ని రకాల నేలల దుక్కిలో ఈ రొటావేటర్లు సమర్థవంతంగా ఉపయోగపడతాయని తెలిపింది. ముందుగా నాలుగు నుంచి తొమ్మిది అడుగుల నిడివి విభాగంలో ఈ రొటావేటర్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్టు తెలిపింది.

'ఫెయిర్‌ఫాక్స్' చేతికి ఐడీబీఐ బ్యాంక్!


న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఊపందుకున్నాయి. కెనడా కేంద్రంగా పనిచేసే ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ ఫెయిర్‌ఫాక్స్ ఈ రేసులో మిగతా అందరికంటే ముందున్నట్టు సమాచారం. బ్యాంక్ ఈక్విటీలో తమకు ఉన్న వాటా నుంచి 60.72 శాతం వాటాను ప్రైవేట్ సంస్థలకు అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ ఇప్పటికే ఫైనాన్షియల్ బిడ్స్ ఆహ్వానించాయి. ఈ వాటాను కొనుగోలు చేసేందుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎమిరేట్స్ ఎన్‌బీడీ, ఫెయిర్‌ఫాక్స్ ఇప్పటికే బిడ్స్ సమర్పించాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




28వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	480
చిత్తూరు	513	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	విజయవాడ	140
వరంగల్	140	గుంటూరు	140
కరీంనగర్	140	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	129
కర్నూలు	140	నెల్లూరు	134
విశాఖపట్నం	140	అనంతపురం	134
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,61,570 ▼	1,48,100 ▼	2,90,000 ▼
విజయవాడ	1,64,000 ▲	1,52,000 ▲	2,74,000 ▲
విశాఖపట్నం	1,65,361 ▲	1,48,100 ▲	2,95,000 ▲
రాజమండ్రి	1,61,560 ▲	1,48,100 ▲	2,67,000 ▲
ప్రొద్దుటూరు	1,57,200 ▼	1,44,620 ▼	2,72,000 ▼
ముంబై	1,59,097 ▲	1,45,733 ▲	2,66,700 ▲

అదానీ గ్రీన్‌కు నార్వే సావరిన్ ఫండ్ గుడ్‌బై

న్యూఢిల్లీ: నార్వే సావరిన్ వెల్త్ ఫండ్.. మరో అదానీ గ్రూప్ కంపెనీ షేర్ల నుంచి తప్పుకుంది. అదానీ గ్రీన్ ఎనర్జీ ఈక్విటీలో తమకు ఉన్న కొద్దిపాటి షేర్లను రూ.400 కోట్లకు విక్రయించినట్టు ఈ ఫండ్‌ను నిర్వహించే నార్జెస్ బ్యాంక్ ప్రకటించింది. ఆర్థిక నేరాలతో కంపెనీకి ఉన్న సంబంధాలతో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందనే భయంతో నార్వే సావరిన్ వెల్త్ ఫండ్ ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. 2024 మేలో ఇదే ఫండ్ అదానీ గ్రూప్ మరో లిస్టెడ్ కంపెనీ అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ నుంచీ తప్పుకుంది. అయితే ఈ ఫండ్ అమ్మిన షేర్లను దేశీయ మ్యాచువల్ ఫండ్స్ కొనుగోలు చేసినట్టు భావిస్తున్నారు.

విస్తరణ బాటలో ట్రూజన్ సోలార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ట్రూజన్ సోలార్ బ్రాండ్‌తో సౌర విద్యుత్ ఉత్పత్తుల సేవలందించే సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో రూ.600-650 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ ఆదాయం రూ.300-350 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, కార్యకలాపాల విస్తరణలో భాగంగా నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోవచ్చని భావిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ సీహెచ్ భవానీ సురేశ్ తెలిపారు. విస్తరణలో భాగంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ (బీఈఎస్) విభాగంలోకి ప్రవేశించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ట్రూజన్ సోలార్ బ్రాండ్ కింద ఇప్పటి వరకు రెసిడెన్షియల్, వాణిజ్య తదితర విభాగాల్లో 10,000కు పైగా రూఫ్‌టాప్ సోలార్ సొల్యూషన్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కంపెనీ ప్రధానంగా కార్యకలాపాలు సాగిస్తోందని, రానున్న నెలల్లో కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు కార్యకలాపాలు విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకు రూ.80 కోట్లు పెట్టుబడులు పెట్టగా కంపెనీ చేతిలో రూ.250 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని సురేశ్ వెల్లడించారు.

ప్రత్యేక కంపెనీగా స్పేస్, హైడ్రాలజీ వ్యాపారాలు

ఆస్ట్రామైక్రోవేవ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఆస్ట్రా మైక్రోవేవ్.. తన స్పేస్, మెటియోరాలజీ, హైడ్రాలజీ వ్యాపారాలను ప్రత్యేక కంపెనీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఈ వ్యాపారాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకే ఈ మూడు వ్యాపారాలను ప్రత్యేక కంపెనీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపింది. దీనివల్ల కంపెనీ వాటాదారులకూ లబ్ది చేకూరుతుందని ఆస్ట్రా మైక్రోవేవ్ పేర్కొంది.

● మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ).. తన ప్రీమియం రిటైల్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించేందుకు సిద్ధమైంది. చిన్న ఫార్మాట్ ప్రీమియం అవుట్‌లెట్స్.. నెక్సా స్టూడియోలను 2030-31 నాటికి దేశవ్యాప్తంగా 600-700 వరకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

విజయ్‌తో విడాకులు ఇప్పించండి

» కోర్టును ఆశ్రయించిన భార్య సంగీత


సంగీత, విజయ్

చెన్నై, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళనటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత విజయ్ నుంచి తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ ఆయన సతీమణి సంగీత కోర్టును ఆశ్రయించారు. విజయ్ మరో నటితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తనకు తీరని ద్రోహం చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు సంగీత శుక్రవారం చెంగల్పట్టు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2021లో విజయ్ ఓ నటితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్లు తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని, ఆ నటితో సంబంధాలు తెంచుకుంటానని హామీ ఇచ్చి కూడా విజయ్ తనను మోసగించారని ఆరోపించారు. ఇలా తమ మధ్య ఏర్పడిన మనస్పర్థలను పరిష్కరించుకునేందుకు 2021, సెప్టెంబరు-2022, ఫిబ్రవరి మధ్య న్యాయవాది ద్వారా ప్రయత్నించినా పరిష్కారం లభించలేదన్నారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం ప్రాథమిక విచారణ జరిపింది. అనంతరం ఏప్రిల్ 20కి విచారణను వాయిదా వేసింది.

డీఎంకేలోకి ఓపీఎస్

» కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న స్టాలిన్



చెన్నై, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో రాజకీయాలు కీలక మలుపు తిరిగాయి. ప్రత్యర్థులు మిత్రులయ్యారు. తమిళనాడు మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం(ఓపీఎస్) అధికార పార్టీ డీఎంకేలో చేరిపోయారు. శుక్రవారం ఉదయం డీఎంకే ప్రధాన కార్యాలయానికి వెళ్లిన ఓపీఎస్.. ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చేతుల మీదుగా డీఎంకే సభ్యత్వం తీసుకున్నారు. ఓపీఎస్‌కు కండువా కప్పిన స్టాలిన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఓపీఎస్‌తో పాటు ఆయన కుమారుడు, మాజీ ఎంపీ రవీంద్రనాథ్, ఓపీఎస్ అనుచరుడు, ఉసిలంపట్టి ఎమ్మెల్యే అయ్యప్పన్ కూడా డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు.

ఓట్ల లెక్కింపు తర్వాత వీవీప్యాట్ స్లిప్పులు

వారం వరకు సరిచూసుకోవచ్చు!

చెన్నై, ఫిబ్రవరి 27: ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వారం రోజుల వరకు వీవీప్యాట్ స్లిప్పులను ఈవీఎంలతో పోల్చిచూసుకునే అవకాశమిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ వెల్లడించారు. అయితే ఇందుకు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్‌ఐఆర్-సర్) గొప్పగా విజయవంతమైందని తెలిపారు. ఇది మిగతా రాష్ట్రాలకు ఆదర్శప్రాయమన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కలిసి.. రాష్ట్ర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సన్నద్ధతపై చర్చించాక ఆయన శుక్రవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'ఇకపై ఈవీఎంలలోని ఓట్లను లెక్కించే ముందే పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లలో లెక్కిస్తారు' అని వివరించారు. తమిళనాడులో ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు జరపాలని పార్టీలు కోరాయని.. అన్ని కోణాలను పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తమిళనాడులో భారీగా ఓటర్ల పేర్లను తొలగించారని వస్తున్న విమర్శలను ప్రస్తావించగా.. 'సర్'తో స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలు రూపొందాయని, ఎన్నికల అధికారుల వృత్తినైపుణ్యం తేటతెల్లమైందని సీఈసీ బదులిచ్చారు.

పాక్, అఫ్ఘాన్ భీకర ఘర్షణ

ఇస్లామాబాద్/ కాబూల్, ఫిబ్రవరి 27: పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య సైనిక ఘర్షణ భీకర యుద్ధంగా మారుతోంది. పాక్ వైమానిక దళం ఇటీవల అఫ్గానిస్థాన్‌లో దాడులు చేయటాన్ని తీవ్రంగా పరిగణించిన ఆ దేశ పాలక తాలిబాన్లు.. గురువారం రాత్రి నుంచి సరిహద్దుల్లో డ్యురాండ్ రేఖ వెంబడి ఉన్న పాక్ సైనిక పోస్టులపై మెరుపు దాడులు ప్రారంభించారు. వెంటనే పాక్ ఫైటర్ జెట్లు అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌తోపాటు కాందహార్, పక్తియాల్లో బాంబు దాడులు చేశాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు స్థానిక మీడియాలో ప్రసారమయ్యాయి. ఈ నగరాల్లో పలుచోట్ల భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. దట్టమైన పొగ, మంటలు వీడియోల్లో కనిపించాయి. పాక్ ఫైటర్ జెట్లు అఫ్గాన్ నగరాలపై చక్కర్లు కొట్టాయి. 133 మంది తాలిబాన్ ఫైటర్లను చంపేశామని పాక్ సైన్యం ప్రకటించింది. భూతల, వైమానిక దాడుల్లో 200 మంది తాలిబాన్ ఫైటర్లు గాయపడ్డారని, 27 అఫ్గానిస్థాన్ సైనిక పోస్టులను ధ్వంసం చేసి, తొమ్మిదింటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. అయితే తమ ఫైటర్లు 8 మందే మరణించారని అఫ్గాన్ వెల్లడించింది. తమ దాడుల్లో 55 మంది పాక్ సైనికులు మరణించారని, 19 సరిహద్దు పోస్టులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

ఇక బహిరంగ యుద్ధమే: పాక్ మంత్రి

అఫ్గానిస్థాన్‌తో పూర్తిస్థాయి, బహిరంగ యుద్ధం ప్రారంభమైందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ శుక్రవారం ప్రకటించారు. 'మా దేశంలో దాడులు చేస్తున్న తెహ్రీక్ ఏ తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ), ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు అఫ్గాన్ స్థావరంగా మారింది. ఇక మా ఓపిక నశించింది. ఇప్పుడిక మీతో పూర్తి స్థాయి యుద్ధమే' అని స్పష్టంచేశారు.

తాలిబాన్ల ఆత్మాహుతి దళం సిద్ధం

పాక్‌తో భీకర ఘర్షణల వేళ.. అఫ్గానిస్థాన్ పాలకులు పూర్తిస్థాయి ఆత్మాహుతి దళాన్ని ఏర్పాటు చేసినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఆ దేశంలోని నంగర్‌హార్‌లో ఆత్మాహుతి కిట్లు ధరించి దాడికి సిద్ధంగా ఉన్న ఫైటర్ల ఫొటోను అధికార బఖ్తర్ న్యూస్ ఏజెన్సీ శుక్రవారం విడుదల చేసింది. బాంబులు అమర్చిన జాకెట్లు ధరించి, కారు బాంబులతో తమ ఆత్మాహుతి దళం సిద్ధంగా ఉందని తాలిబాన్ల డిప్యూటీ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రత్ చెప్పినట్లు వెల్లడించింది. సైనిక ఘర్షణలను వెంటనే ఆపాలని రెండు దేశాలకు ఇరాన్ సూచించింది. మధ్యవర్తిత్వానికి సిద్ధమని తెలిపింది.

ఎఫ్-16 ఫైటర్ జెట్‌ను కూల్చేశాం

తమ దేశంలో దాడులకు ప్రయత్నించిన పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన అత్యాధునిక ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చేశామని తాలిబాన్లు ప్రకటించారు. అయితే, ఆ విమానాన్ని దేనితో కూల్చేశారన్న వివరాలు తెలపలేదు. విమాన శకలాల ఫొటోలు కూడా బయటపెట్టలేదు. ఈ ప్రకటనను పాక్ ఖండించింది.

వాణిజ్య ఒప్పందంలో మార్పులు!

» అమెరికా వాణిజ్య మంత్రి ఆకస్మిక రాక.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: అమెరికాలోని తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశంతో కుదుర్చుకునే వాణిజ్య ఒప్పందంలో కూడా మార్పులు చేసుకోవాలని భారత్ భావిస్తోంది. దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవాలని కృతనిశ్చయంతో ఉంది. మారిన పరిస్థితుల దృష్ట్యా అవసరమైతే వాణిజ్య ఒప్పందాన్ని 'రీ బ్యాలెన్స్' చేస్తామని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. శుక్రవారం ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టారిఫ్‌లపై అమెరికా నుంచి వస్తున్న సంకేతాలను గమనించి, ప్రయోజనాలను కాపాడుకునేలా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. గురువారం అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు లేకుండా, అనూహ్యంగా ఢిల్లీ వచ్చి గోయల్‌తో చర్చలు జరపడం గమనార్హం. రెండు దేశాల మధ్య కుదరాల్సిన వాణిజ్య ఒప్పందంలో మార్పుల కోసమే ఆయన వచ్చారన్న అభిప్రాయాలు నెలకొన్నాయి. టారిఫ్‌ల విధింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఉన్న విస్తృత అధికారాలను అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేయడం, అమెరికా-భారత్ ఒప్పందంపై చర్చలు కీలకదశకు చేరుకున్న నేపథ్యంలో లుట్నిక్ పర్యటన జరగడం విశేషం. చర్చలు ఫలవంతమయ్యాయని గోయల్‌తో పాటు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గిక్ గోర్ పేర్కొన్నారు.


విజయవాడ శుక్రవారం జరిగిన ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, నాగరాణి దంపతుల కుమార్తె మానస, గొడవర్తి కోటేశ్వరరావు, శిరీష దంపతుల కుమారుడు సిద్ధార్థ్ వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

బిహారీ మార్కు కిరికిరి!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ స్టేట్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌కు ఇలా అండగా నిలిచింది. ఇప్పుడు ఆయన్ను ఏపీ పోలీసులు అరెస్టు చేయాలంటే... ముందుగా బిహార్ ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిందే. బీఎన్ఎస్ఎస్‌లో చట్టప్రకారం కల్పించిన చిన్న వెసులుబాటు ఆధారంగా బిహార్ ప్రభుత్వం ఈ రక్షణ కవచం ఏర్పాటు చేసింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఒక రాష్ట్రం తన క్యాడర్ అధికారిని కాపాడుకునేందుకు ఏకంగా చట్టంలో సవరణ చేయడం, గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు సునీల్ నాయక్‌ను ట్రాన్సిట్ వారెంట్‌పై ఏపీ తీసుకురావాలన్నా, హైకోర్టు ఆదేశాలతో విచారణకు తీసుకురావాలన్నా విధిగా బిహార్ ప్రభుత్వం ముందస్తు అనుమతి ఇవ్వాల్సిందే.

తీసుకొచ్చేద్దామని...

నాడు నరసాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజును సీఐడీ అధికారులు 2021 మే 14న అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ఆఫీసుకు తీసుకొచ్చారు. అదే రోజు సీఐడీ కార్యాలయంలో ఆయన్ను తీవ్రంగా టార్చర్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 జూలై 11న రఘురామ తనపై జరిగిన కస్టోడియల్ టార్చర్‌పై గుంటూరులోని నగరపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నారు. ఈ కేసులో నాటి సీఐడీ డీఐజీగా సునీల్ నాయక్ ఏ7గా ఉన్నారు. బిహార్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ స్వస్థలం పల్నాడు జిల్లా కారంపూడి మండలం లాలిపురం తండా. జగన్ ప్రభుత్వ హయాంలో ఆయన ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆ సమయంలో ఆయన సీఐడీ డీఐజీగా పనిచేశారు. జగన్ సర్కారు గద్దెదిగగానే తిరిగి బిహార్ వెళ్లిపోయారు. ప్రస్తుతం బిహార్ అగ్నిమాపక విభాగం, హోమ్ గార్డ్స్ ఐజీగా పనిచేస్తున్నారు. తన కస్టోడియల్ టార్చర్ సమయంలో ఐపీఎస్ సునీల్ నాయక్ కూడా అక్కడున్నారని రఘురామ పేర్కొన్నారు. దీంతో... ఆయననూ కేసులో చేర్చారు. ఆయనను విచారించేందుకు, అదుపులోకి తీసుకునేందుకు తాజాగా ఏపీ పోలీసు అధికారులు ప్రయత్నించారు. కానీ... అక్కడి కోర్టు ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది. స్థానిక పోలీసులు సునీల్ నాయక్‌కు అండగా నిలిచారు. దీంతో... ఏపీ పోలీసులు కోర్టు ద్వారా అరెస్టు వారెంటు తీసుకుని సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈలోపే రక్షణ...

సీఆర్‌పీసీ స్థానంలో ప్రస్తుతం భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023 చట్టం అమల్లోకి వచ్చింది. ఇందులోని సెక్షన్ 218లోని సబ్ సెక్షన్ 2 'కేంద్ర సాయుధ దళాలకు చెందిన ఏ సభ్యుడైనా తన అధికారిక విధి నిర్వహణలో ఉన్నప్పుడు, పనిచేస్తున్న సమయంలో ఏదైనా నేరం జరిగితే... కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతితోనే విచారణకు స్వీకరించాలి" అని చెబుతోంది. సబ్ సెక్షన్ 3 ప్రకారం.. దీనిని రాష్ట్ర బలగాలకు వర్తింపచేస్తూ రాష్ట్రాలు నోటిఫికేషన్ ద్వారా సవరణ చేసుకునే వెసులుబాటు ఉంది. దీనిని బిహార్ ప్రభుత్వం ఇప్పుడు ఉపయోగించుకుంది. తమ రాష్ట్ర అధికారులు విధి నిర్వహణలో భాగంగా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో పనిచేసినప్పుడు, వారు ఏదైనా నేరం చేసి ఉంటే, ఆ కేసు విచారణలో భాగంగా ఆ అధికారిని అరెస్టు చేయాలంటే ముందుగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కూడా తీసుకోవాలంటూ తేల్చేసింది. "బీఎన్ఎస్ఎస్-2023లోని సెక్షన్ 218లోని సబ్ సెక్షన్ 2లో నిబంధన బిహార్ పోలీసులలోని అన్ని కేటగిరీలు, క్యాడర్ల సభ్యులందరికీ వర్తిస్తుంది. వారు ఎక్కడ విధులు నిర్వహించినా... శాంతి భద్రతలు కాపాడటమే వారి బాధ్యత. అందువల్ల బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 218లోని సబ్ సెక్షన్ 2 వద్ద కేంద్ర ప్రభుత్వం అనే వ్యక్తీకరణను రాష్ట్ర ప్రభుత్వంగా కూడా అర్థం చేసుకోవాలి" అని బిహార్ ప్రభుత్వం గురువారం సవరణ తీసుకొచ్చింది. దీనిపై అప్పటికప్పుడు గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. వెరసి... రఘురామ టార్చర్ కేసులో బిహార్ ప్రభుత్వం అనుమతిస్తేనే సునీల్ నాయక్ అరెస్టు, విచారణ సాధ్యమవుతుంది.

ఇది ముమ్మాటికీ చట్టవిరుద్ధం!

» వారెంట్ ఆర్డర్ మాకు ఇవ్వకుండా.. రీకాల్ పిటిషన్‌కు నంబర్ ఎలా ఇస్తారు..?

» సునీల్ నాయక్ వారెంట్ విషయంలో కోర్టుకు ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ ప్రశ్న

» గుంటూరు మొబైల్ కోర్టులో గంటకు పైగా వాడీవేడి వాదనలు

» నేడు ఉత్తర్వులు ఇస్తానన్న న్యాయాధికారి

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సీఐడీ సునీల్ నాయక్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు ప్రకటించిన కోర్టు.. ఆ ఆర్డర్ ఇవ్వకుండానే దానిపై ఎదురు పక్షం వేసిన రీకాల్ పిటిషన్‌కు నంబర్ ఎలా ఇస్తుందని ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ వీరగంధం రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ చట్టవిరుద్ధమని.. తన 30 ఏళ్ల సర్వీసులో ఇలా జరగడం ఎప్పుడూ చూడలేదన్నారు. కనీసం తనకు నోటీసు కూడా ఇవ్వలేదని.. ఈ వ్యవహారంలో న్యాయపరంగా ఎంత దూరమైనా వెళ్తానని స్పష్టం చేశారు. డిప్యూటీ స్పీకర్, అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో.. ఏ-7, నాటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేస్తున్నట్లు గుంటూరు మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి స్రవంతి గురువారం ప్రకటించారు. దీనిపై శుక్రవారం అధికారిక ఉత్తర్వులిస్తానన్నారు. వారెంట్ ఉత్తర్వులు జారీచేస్తే వాటిని అమలు చేసి బిహార్ నుంచి నాయక్‌ను తీసుకొచ్చేందుకు విజయనగరం ఎస్పీ దామోదర్ నేతృత్వంలోని పోలీసు అధికారుల బృందం ఇప్పటికే పట్నాలో మకాం వేసి ఉంది. అయితే పట్నా సెషన్స్ కోర్టు నాయక్‌కు మార్చి 2 వరకు అరెస్టు నుంచి రక్షణ ఇచ్చిన నేపథ్యంలో మొబైల్ కోర్టు జారీచేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్ చెల్లదని, దానిని రద్దు చేయాలంటూ ఆయన తరపు న్యాయవాదులు గురువారమే రీకాల్ పిటిషన్ వేశారు. దానికి కోర్టు సిబ్బంది నంబర్ (104/202) కూడా ఇచ్చారు. శుక్రవారం వారెంట్ ఉత్తర్వులు తీసుకునేందుకు రాజేంద్రప్రసాద్ కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా నాయక్ తరపు న్యాయవాదులు దాఖలుచేసిన రీకాల్ పిటిషన్‌పై వాదనలు వింటామని మేజిస్ట్రేట్ స్రవంతి ప్రకటించడంతో ఆయన అభ్యంతరం తెలిపారు. నాన్‌బెయిలబుల్ వారెంట్ ఆర్డర్ కాపీ తమ చేతికి ఇవ్వకుండా.. దానిపై రీకాల్ పిటిషన్‌ను అనుమతించడం చట్ట విరుద్ధమన్నారు. గుంటూరులోని రెండో ఏడీజే కోర్టులో నాయక్ ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ అయిందని, దానిపై ఆయన ఏపీ హైకోర్టుకు.. లేదంటే సుప్రీంకోర్టుకు మాత్రమే వెళ్లాలని.. అలాంటిది పట్నా సెషన్స్ కోర్టు బెయిల్ ఎలా మంజూరు చేస్తుందని ప్రశ్నించారు. నాయక్‌పై మార్చి 2 వరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆ కోర్టు ఇచ్చిన తీర్పునకు చట్టబద్ధత లేదని.. దానిని పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదని తెలిపారు. వారెంట్ ఉత్తర్వులు ఇవ్వడం తప్ప మరో మార్గం లేదని, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే తాను న్యాయపరంగా ఎంత దూరమైనా వెళ్తానని తెలిపారు. శనివారం నాయక్ తరపు న్యాయవాదుల వాదనలు విని తగు ఉత్తర్వులు జారీ చేస్తానని న్యాయాధికారి వెల్లడించారు.

'సిట్' విచారణను మేమే పర్యవేక్షిస్తాం

» చిత్తశుద్ధితో విచారిస్తుందని ఆశిస్తున్నాం

» గ్రూప్-1 మూల్యాంకనం కేసుపై హైకోర్టు



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలకు సంబంధించి వాస్తవాలను తేల్చేందుకు తమ ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పారదర్శకత, చిత్తశుద్ధితో విచారిస్తుందని ఆశిస్తున్నట్టు హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మొత్తం వ్యవహారం కొలిక్కి వచ్చే వరకు సిట్ విచారణను తామే పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలను నిర్ధారిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై దాఖలైన పిటిషన్ల విచారణకు ఇప్పటికే ఎక్కువ సమయం కేటాయించామని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్లకు తార్కిక ముగింపు ఇచ్చేవరకు వాటిని తమవద్దే ఉంచుకొని విచారణ జరుపుతామని పేర్కొంది. తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షలో అక్రమాలను నిర్ధారిస్తూ సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో పాటు ఎంపికకాని మరికొందరు అప్పీల్ చేశారు. వీటిపై తుది విచారణ జరుపుతున్న ధర్మాసనం జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాల ఆరోపణలు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేసింది. అలాగే, అప్పట్లో ఉద్యోగాలకు ఎంపికై ప్రస్తుతం సర్వీసులో ఉన్న వారిని అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలని ఆదేశించింది. దీనికిగాను ఈ నెల 25న జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హైకోర్టును సమయం కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోసారి పిటిషన్లపై విచారణ జరిగింది. సీఎస్ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఉత్తర్వులను అమలు చేశామని తెలిపారు. వివరాలతో మెమో దాఖలు చేశామని పేర్కొన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. తమ ఆదేశాలకు అనుగుణంగా సిట్ ఏర్పాటు అయ్యిందా? విచారణ జరుగుతోందా? అని ప్రశ్నించింది. ఎస్‌జీపీ బదులిస్తూ.. సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు అయిందని బదులిచ్చారు.

కోర్టుధిక్కరణ కేసులో నోటీసులు

గ్రూప్-1లో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులను తక్షణం అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలంటూ 11న హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను సీఎస్ విజయానంద్, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు అమలు చేయలేదని పేర్కొంటూ గొర్ల సుజాత అనే అభ్యర్థి కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం.. విజయానంద్, శ్యామలరావుకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను 16కు వాయిదా వేసింది.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★


ప్రధాని నరేంద్ర మోదీతో విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు

స్టైలిష్ లుక్!



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'పై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఆ అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్లేలా మేకర్స్ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. పవన్ కల్యాణ్ హ్యాట్ ధరించి స్టైలిష్‌గా కనిపిస్తున్న ఈ పోస్టర్ విడుదలైన కొద్ది గంటల్లోనే నెట్టింట వైరల్ అయింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కల్యాణ్ పోస్టర్‌కి ఫిదా అవుతున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పవర్‌ప్యాక్డ్ 40 సెకన్ల గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు నిర్మాతలు సిద్ధమవుతున్నారు. కాగా, ఈ చిత్రంలో శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

పవర్‌ఫుల్ ప్రతినాయకుడు



రెబల్ స్టార్ ప్రభాస్- దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న పాన్ వరల్డ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'స్పిరిట్'. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ బ్యానర్లపై ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ని పంచుకున్నారు సందీప్‌రెడ్డి వంగా. ప్రతినాయకుడిగా నటిస్తోన్న వివేక్ ఒబెరాయ్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు వివేక్. విభిన్న పాత్రలతో తనదైన ముద్ర వేసుకున్న ఆయన రాకతో కథకు మరింత బలం చేకూరనుంది. కాగా, ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయిక. సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేయనున్నారు.

ప్రేమ.. విరహం




వైవిధ్యమైన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరో అడివి శేష్ తొలిసారి మాస్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'రుబారు' అనే పాటను విడుదల చేశారు మేకర్స్ ప్రేమ.. విరహంతో నిండిన ఈ లిరిక్స్ అందరి హృదయాలను హత్తుకునేలా ఉన్నాయి. భాస్కరభట్ల రవికుమార్ ఈ గీతాన్ని రచించగా, చిన్మయి ఆలపించారు. భీమ్స్ సంగీతం అందించారు. ఏప్రిల్ 10న చిత్రం విడుదలవుతోంది.

సరికొత్త ప్రేమకథ



సుహాసిని, వినోద్‌కుమార్, ఇంద్రజ ప్రధాన పాత్రధారులుగా, శ్రీనివాస్ అనంతనేని, మోనికా మిశ్రా యువ జంటగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఓ మాట అనుకుందామా'. భీమ్‌జీ దర్శకత్వంలో పెంటి నాగరాజు, పెంటి నీరజ్ సందీప్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌ను సుహాసిని, వినోద్‌కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సినిమాలో మంచి పాత్రలు పోషిస్తున్నట్లు వెల్లడించి, సినిమా విజయం సాధించాలని వారిద్దరూ కోరారు. ఈ సందర్భంగా దర్శకుడు భీమ్‌జీ మాట్లాడుతూ 'ఒక సరికొత్త ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. ఫ్యామిలీ అంతా చూసే విధంగా సినిమా ఉంటుంది. త్వరలో మరిన్ని వివరాలు తెలియజేస్తాం' అని చెప్పారు. త్వరలో టీజర్ విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

భయపెడుతూ నవ్వించే 'రుక్మిణి'



నిరంజన్, గ్రీష్మ నేత్రికా, ప్రియ జస్వర్, దీప్తి శ్రీరంగం హీరో హీరోయిన్లుగా సింహాచలం గుడుపూరి తెరకెక్కిస్తోన్న సరికొత్త హారర్ కామెడీ చిత్రం 'రుక్మిణి'. జీ సినిమా బ్యానర్‌పై నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్నారు. తాజాగా రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హీరోగా పరిచయం అవుతున్న నిరంజన్‌కు ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలని ఆకాంక్షించారు. చిత్ర కథానాయకుడు నిరంజన్ మాట్లాడుతూ 'ఒక డిఫరెంట్ హారర్ కామెడీ మూవీగా 'రుక్మిణి' అందర్నీ ఆకట్టుకుంటుంది' అని అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు సింహాచలం, నిర్మాత కట్టా గంగాధర్, హీరోయిన్లు గ్రీష్మ నేత్రికా, ప్రియ జాస్వర్, నటుడు విఖ్యాత్ తదితరులు పాల్గొన్నారు.

'సౌత్ గ్రూప్' సరికాదు!

ఢిల్లీ మద్యం కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఐదున్నర నెలలపాటు తిహాడ్ జైలులో ఉన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పూర్తిగా నిర్దోషి అని రౌస్ అవెన్యూలోని సీబీఐ ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. ఈ మద్యం కుంభకోణంలో నిందితులైన వారిని కవితతో సహా సౌత్ గ్రూపుగా సీబీఐ అభివర్ణించడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. సౌత్ గ్రూపునకు చెందిన కొందరు మద్యం వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేందుకే విధానాన్ని రూపొందించారన్న ఆరోపణల్లో పసలేదని పేర్కొంది. ఒక ప్రాంతం ఆధారంగా ఉద్దేశపూర్వకంగా సీబీఐ సౌత్ గ్రూప్ అని పేరు పెట్టడం చట్టపరంగా అంగీకారయోగ్యం కాదని, మిగతా నిందితులందరికీ నార్త్ గ్రూప్ అనే పేరెందుకు పెట్టలేదని ప్రశ్నించింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కల్వకుంట్ల కవిత (ఏ17), విజయ్ నాయర్ (ఏ3), అభిషేక్ బోయినపల్లి (ఏ4) అరుణ్ రామచంద్ర పిళ్లై (ఏ5), ముత్తా గౌతమ్(ఏ6), బుచ్చిబాబు గోరంట్ల (ఏ11), శరత్ చంద్రారెడ్డి(ఏ23)లు దక్షిణాది నుంచి ఢిల్లీ మద్యం కుంభకోణంలో పాల్గొన్నట్లు సీబీఐ తన చార్జిషీట్‌లో పేర్కొన్న విష యం తెలిసిందే. అయితే సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్న కథనమంతా తమ ఊహాగానాలను వాస్తవాలుగా చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నంలో భాగమేనని కోర్టు పేర్కొంది. కాగా, అభిషేక్ బోయినపల్లి, అరుణ్ రామచంద్ర పిళ్లై.. ఓసారి ఢిల్లీలో, మరోసారి హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో సమావేశమై ఢిల్లీ మద్యం విధానానికి రూపకల్పన చేశారని సీబీఐ తెలపగా.. ఆనాటి నుంచే ఒక పెద్ద కుట్ర జరిగినట్లుగా చిత్రించే ప్రయత్నం జరిగిందని కోర్టు అభిప్రాయపడింది. సౌత్ గ్రూప్ ప్రయోజనాలకు అనుగుణంగా మద్యం విధానం రూపొందించారనడానికి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

లిక్కర్ కేసుతో ఎన్నికల్లో నష్టపోయాం: కేటీఆర్

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసు వల్ల గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా నష్టపోయిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు చివరకు కోర్టులో న్యాయం జరిగిందని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. మద్యం కుంభకోణం అనే సాకుతో ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వాన్ని కూల్చారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ కేసులాగే రాష్ట్రంలో తమ పార్టీ నాయకులపై నమోదైన ప్రతి కేసు కూడా అబద్ధమని, రాజకీయ ప్రేరేపితమని త్వరలోనే తేలిపోతుందని అన్నారు. అప్పటివరకు కాంగ్రెస్, బీజేపీలు చేసే బాధ్యతారహితమైన ఆరోపణలను ఎదుర్కొంటామని తెలిపారు. దురదృష్టవశాత్తూ ప్రస్తుత మన నవ భారతంలో ఆరోపణలే సాక్ష్యాలుగా మారుతున్నాయని, మీడియానే న్యాయ ప్రక్రియ చేపడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు.

కవిత పేరును చేర్చడం అక్రమం..

కేసులో కవిత పేరును చేర్చడం అక్రమమం అని, రాజకీయంగా ఆమెకున్న పేరు, హోదాను దృష్టిలో పెట్టుకునే ఆమెను ఇరికించే ప్రయత్నం చేశారని కవిత న్యాయవాదులు మోహిత్‌రావు, యూజిన్ ఎస్ ఫిలోమినయ్ చేసిన వాదనలను సీబీఐ కోర్టు ప్రస్తావించింది. అక్రమ లావాదేవీల కోసం జరిగిన ఏ సమావేశంలోనూ కవిత పాల్గొనలేదని, అందుకు సంబంధించిన పత్రాలు, ప్రయాణ వివరాలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లు ఏవీ ఆమెకు వ్యతిరేకంగా లేవని వారు స్పష్టం చేశారు. ఆమె ఏ రిటైల్ జోన్ కోసం గానీ , ఏ హోల్‌సేల్ స్టాల్ కోసం గానీ దరఖాస్తు చేసుకోలేదని, మొత్తం లైసెన్సు ప్రక్రియలో ఆమె పాత్ర ఎక్కడా లేదని వారు వాదించారు. కేవలం సహ నిందితులు, సాక్షుల ప్రకటనల ఆధారంగా కవితను ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇరికించడం సరైంది కాదని, ఆమెకు వ్యతిరేకంగా వచ్చిన సాక్ష్యాలేవీ నిర్ధారించ తగినవి కాదని కవిత తరపు న్యాయవాదులు చేసిన వాదనలను సీబీఐ కోర్టు స్వీకరించింది. కవితపై ప్రాథమిక సాక్ష్యాధారాలేవీ లేకపోవడం వల్ల ఈ కేసు నుంచి విముక్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.



ఆకాశం కూలినా సరే న్యాయం జరగాలి

తీర్పులో రౌజ్ ఎవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి కీలక వ్యాఖ్యలు



మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ తదితరులను నిర్దోషులుగా పేర్కొంటూ ఇచ్చిన 598 పేజీల సుదీర్ఘ తీర్పులో రౌజ్ ఎవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ తీర్పు రాస్తున్నప్పుడు.. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ చెప్పిన 'అన్యాయం ఎక్కడ జరిగినా.. అది అన్నిచోట్లా న్యాయానికి ముప్పు' అనే మాటలను.. 'ఆకాశం కూలిపోయినా సరే న్యాయం జరగాలి' అనే సూత్రాన్ని గుర్తు చేసుకుంటున్నాను. న్యాయవ్యవస్థ పని ఒక అనుకూలమైన ఫలితాన్ని ఇవ్వడం లేదా ఒక వర్గం చెప్పే కథనాన్ని సమర్థించడం కాదు, చట్టబద్ధమైన పాలనను కాపాడటం. ఈ ఆదర్శాలకు కట్టుబడి ఉన్నప్పుడే న్యాయవ్యవస్థపై పౌరుల నమ్మకం నిలుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఆయన తీర్పులోని కొన్ని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..



విశ్వసనీయత లేదు

కచ్చితమైన, అత్యంత శ్రమతో కూడిన విచారణ అనంతరం, రెండు నెలలకు పైగా సమయం వెచ్చించి.. అపారమైన డాక్యుమెంటరీ సమాచారాన్ని, దాదాపు మూడు వందల మంది ప్రాసిక్యూషన్ సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించిన మీదట.. ఈ కేసులో కనీస ప్రాథమిక (ప్రైమాఫేసీ) అనుమానం కూడా కనిపించడం లేదని ఈ కోర్టు నిస్సందేహంగా భావిస్తోంది. అంతే కాదు.. నేర చట్ట సూత్రాల ప్రకారం విచారణను ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన 'తీవ్రమైన అనుమానం' అసలే లేదని భావిస్తోంది. సీబీఐ ప్రతిపాదించిన ఈ ఎక్సైజ్ పాలసీ కేసు, న్యాయపరమైన పరిశీలనను తట్టుకోలేకపోయింది. పూర్తిగా విశ్వసనీయతను కోల్పోయింది.

అది న్యాయవైఫల్యమే

ప్రాసిక్యూషన్ ప్రాథమిక ఆరోపణలకు వ్యతిరేకంగా ఉన్న వాంగ్మూలాలను సైతం దర్యాప్తు సంస్థ (సీబీఐ) సమర్పించడం అభినందనీయమే గానీ.. అవి ఈ కేసును బలపరచడానికి బదులుగా పూర్తిగా కుప్పకూల్చేస్తున్నాయి. ఎలాంటి సాక్ష్యాలూ లేకుండా, పూర్తిస్థాయి విచారణ ఎదుర్కోవాలని నిందితులను బలవంతం చేయడం న్యాయం అనిపించుకోదు. అలా చేయడం న్యాయవైఫల్యం, క్రిమినల్ ప్రాసెస్‌ను దుర్వినియోగం చేయడం, నిష్పాక్షికత, చట్టబద్ధమైన పాలన తాలూకూ ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించడమే అవుతుంది.

చట్టబద్ధంగా ఆమోదయోగ్యమైన ఆధారాలు ఉంటేనే అభియోగాలు మోపాలి తప్ప.. ఊహలు లేదా దర్యాప్తు సంస్థల కల్పనలపై

ఊహలు.. కల్పనలు కుదరవు

ఆధారపడి ఆ పని చేయకూడదని సాక్ష్యాధారాల చట్టం చెబుతోంది. ఈ గీటురాయి ఆధారంగా రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని పరీక్షిస్తే.. ప్రాసిక్యూషన్ ఈ కేసును ప్రాథమికంగా కూడా నిరూపించలేకపోయింది.

ఎలాంటి సాక్ష్యాలూ లేని అభూతకల్పన



నిశితంగా పరిశీలిస్తే ఈ కేసు ఎటువంటి ఆమోదయోగ్యమైన సాక్ష్యాధారాలూ లేని.. కేవలం ఊహాగానాలు, అనుమానాలపై ఆధారపడి నిర్మించిన ఒక అభూతకల్పన అని వెల్లడైంది. సాక్ష్యాధారాలను, పత్రాలను సరిగ్గా అర్థం చేసుకోవడంలో, వాటి నుండి చట్టబద్ధమైన ముగింపులను రాబట్టడంలో దర్యాప్తు సంస్థ ప్రాథమిక వైఫల్యం కనిపిస్తోంది. ఫలితంగా, కేసు చట్టపరంగా బలహీనమైనదిగా, నిలకడలేనిదిగా, చట్ట ప్రకారం ముందుకు కొనసాగడానికి అనర్హమైనదిగా మారింది. ప్రాసిక్యూషన్ అంత బలంగా నొక్కిచెప్పిన ఈ భారీ కుట్ర సిద్ధాంతం.. సాక్ష్యాల ఆధారంగా పరిశీలించినప్పుడు పూర్తిగా (పేకమేడలా) కుప్పకూలిపోయింది.

కుట్ర అనే భ్రమ కల్పించే యత్నం

రికార్డులను సమగ్రంగా అంచనా వేసినప్పుడు దర్యాప్తు తీరు ఎలా అనిపించిందంటే.. సంబంధం లేని విడివిడి అంశాలను కలిపి కుట్టి, చట్టబద్ధమైన ఆధారాలు లేని ఒక భారీ, సంక్లిష్టమైన కుట్ర అనే భ్రమను కల్పించే ప్రయత్నం జరిగినట్లు కనిపిస్తోంది. ఎక్సైజ్ విధానం రూపకల్పన/అమలుతో సంబంధం ఉన్న ప్రతి వ్యక్తినీ ఇందులో ఇరికించడం ద్వారా.. బలహీనమైన కథనానికి విశ్వసనీయతను, లోతును ఆపాదించేలా ముందుగానే నిర్ణయించిన మార్గంలో దర్యాప్తు సాగినట్లు కనిపిస్తోంది. ఈ ఆరోపణలను గోవా అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టి, నేరపూరిత ఆదాయాన్ని మళ్లించినట్లు చూపే ప్రయత్నం, చట్టబద్ధమైన ఆధారాల కంటే ఎక్కువగా ఊహలు, అంచనాలపైనే ఆధారపడింది.

పునాదులు బలహీనం

'ముందస్తు నగదు (అప్ ఫ్రంట్ మనీ)' చెల్లింపులు.. వాటిని తిరిగి పొందడం అనే అంశాల చుట్టూ ప్రాసిక్యూషన్ నిర్మించాలనుకున్న కుట్ర కథనం పునాది ప్రాథమికంగా బలహీనపడింది. ముందస్తు నగదు చెల్లింపు, దానిని తిరిగి రాబట్టుకోవడం అనే ఆరోపణలకు చట్టపరమైన ఆధారం లేదు. విధాన రూపకల్పనలో అవకతవకలు జరిగినట్లు ఎటువంటి ఆధారాలు లేనందున ఇటువంటి ఆరోపణలు నిలబడవు. ఒకవేళ స్వతంత్రంగా పరిశీలించినా.. ఈ మొత్తం చెల్లింపుల గొలుసు ప్రధానంగా అంగడియా (వ్యాపారులు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి డబ్బు పంపడానికి వాడే సంప్రదాయ కొరియర్ వ్యవస్థ; ఇది శతాబ్దాలుగా మనదేశంలో ఉంది) సంస్థల ఎంట్రీల(కాగితాల్లో రాతల)పై ఆధారపడి ఉందని ఈ కోర్టు గుర్తించింది. ఇవి చట్టప్రకారం ఆమోదయోగ్యం కాని పత్రాలు. అలాగే, ఇతర సాక్ష్యాధారాల మద్దతు లేని అప్రూవర్ల వాంగ్మూలాలపై ఇది ఆధారపడి ఉంది. ఇవి చిన్నపాటి లోపాలు కావు. ఇవి కేసు మూలాలనే దెబ్బతీస్తాయి.

అప్రూవర్ వాంగ్మూలం.. తిరుగులేని సత్యమా?

అప్రూవర్ ఇచ్చే వాంగ్మూలం సహజంగానే అనుమానాస్పదమైనదని, దానిని చాలా జాగ్రత్తగా స్వీకరించాలనేది నేర చట్టశాస్త్రంలో స్థిరపడిన సూత్రం. అయినప్పటికీ, ప్రస్తుత కేసులో దర్యాప్తు సంస్థ అనుసరించిన విధానం ఈ నియమానికి విరుద్ధంగా ఉంది. అప్రూవర్ వాంగ్మూలాలను తిరుగులేని సత్యాలుగా భావించి, వాటిని ఎటువంటి విమర్శనాత్మక పరిశీలన లేకుండా ప్రాసిక్యూషన్ కేసుకి వెన్నెముకగా మార్చారు.

పీఎంఎల్ఏతో వ్యక్తుల స్వేచ్ఛకు పదేపదే విఘాతం

మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఒక నేరం జరిగిందనే అంచనాపై వ్యక్తుల స్వేచ్ఛకు విఘాతం కలుగుతున్న సందర్భాలు ఈ కోర్టు దృష్టికి పదేపదే వస్తున్నాయి. కఠినమైన బెయిల్ నిబంధనల కారణంగా.. నిందితులు విచారణకు ముందే దీర్ఘకాలం జైలులో ఉండాల్సి వస్తోంది. అసలు నేరానికి సంబంధించిన వాస్తవాలను కోర్టు పరీక్షించక ముందే అరెస్టులు, సుదీర్ఘ కస్టడీ వంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా.. ఒక వ్యక్తి స్వేచ్ఛ, భవిష్యత్తులో తేలబోయే ఒక అనిశ్చిత ఫలితంపై ఆధారపడి, హరించుకుపోతోంది.

కోర్టు మౌనంగా ఉండదు

సాధారణంగా, దర్యాప్తు విచక్షణను తప్పుబట్టేలా ఉండే వ్యాఖ్యలు చేయడానికి కోర్టులు వెనుకాడతాయి. అయితే, కొన్ని సందర్భాల్లో లోపాలు ఎంత ప్రాథమికంగా ఉంటాయంటే.. అలాంటి సందర్భాల్లో న్యాయస్థానాలు మౌనంగా ఉండడం విధి నిర్వహణ నుండి తప్పుకోవడమే అవుతుంది. అధికార వినియోగం చట్టపరమైన రక్షణలను నీరుగార్చి, నేర చట్టశాస్త్ర ప్రాథమిక సూత్రాలను దెబ్బతీస్తున్నప్పుడు, కోర్టు మూగ ప్రేక్షక పాత్ర వహించలేదు.

చట్టప్రకారమే.. మద్యం విధానం

ప్రైవేట్ వ్యక్తులకు లేదా సోకాల్డ్ 'సౌత్ గ్రూప్'కి అక్రమంగా, చట్టవిరుద్ధమైన ప్రయోజనాన్ని చేకూర్చడానికే ఢిల్లీ ఎక్సైజ్ విధానాన్ని మార్చారని, తారుమారు చేశారని లేదా కుట్రపూరితంగా రూపొందించారని కనీసం ప్రాథమికంగా సూచించే ఏ ఒక్క ఆధారాన్నీ ప్రాసిక్యూషన్ సమర్పించలేకపోయింది. దీనికి విరుద్ధంగా.. అప్పటి రికార్డులను పరిశీలిస్తే.. సంబంధిత వాటాదారులతో సంప్రదింపులు జరిపి, లోతైన చర్చల తర్వాత, చట్టం నిర్దేశించిన విధానానికి కట్టుబడి ఈ విధానాన్ని రూపొందించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. లెఫ్టినెంట్ గవర్నర్ నుండి సూచనలు తీసుకోవాలనే చట్టబద్ధమైన లేదా రాజ్యాంగపరమైన నిబంధన ఏదీ లేనప్పటికీ, ఫైల్‌లోని నోటింగ్స్‌ను చూస్తే అటువంటి సూచనలను కోరి, వాటిని పరిశీలించి, పాలసీలో చేర్చినట్లు నిస్సందేహంగా అర్థమవుతోంది. ఇలా చర్చలు, సంస్థాగత పరిశీలన అనంతరం.. నిబంధనల ప్రకారం విధాన రూపకల్పన జరిగిందని తేలినప్పుడు, దాని అమలుకు నేరపూరిత ఉద్దేశాన్ని ఆపాదించే ఏ ప్రయత్నమైనా పూర్తిగా నిలకడలేనిది అవుతుంది.

ఆమోదయోగ్యం కాని సమాచారంతో ఆరోపణలు

భారత సాక్ష్యాధారాల చట్టంలోని సూత్రాలు కాలపరీక్షకు నిలిచిన రక్షణ కవచాలు. ఇవి ప్రాథమిక దశలో కూడా నిజాన్ని కనుగొనడానికి, ఆరోపణల విశ్వసనీయతను పరీక్షించడానికి కోర్టులకు సహాయపడతాయి. ప్రస్తుత కేసులో, ఈ సూత్రాలే మార్గదర్శక చట్రంగా పనిచేశాయి. ప్రాసిక్యూషన్ సమర్పించిన సమాచారాన్ని ఆమోదయోగ్యత, సాక్ష్యపు విలువ అనే గీటురాయిపై పరీక్షించినప్పుడు, ఆ కుట్ర సిద్ధాంతం కరిగిపోయి.. ప్రాసిక్యూషన్ ఆరోపణలు కేవలం ఆమోదయోగ్యం కాని సమాచారంపై ఆధారపడ్డాయని వెల్లడైంది.


బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేస్తారా?

- ఎన్నికల్లో పార్టీ ఓడింది అహంకారం వల్లే
- కేటీఆర్ ఇప్పటికైనా నిజాన్ని అంగీకరించు
- కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేస్తారా ? అంటూ తన సోదరుడు కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ శ్రేణులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. అహంకారం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని, ఈ విషయాన్ని పార్టీ సమావేశాల్లో చర్చించలేదా ? అంటూ ఆమె ప్రశ్నించారు. మద్యం కుంభకోణం కేసులో కోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. అయితే, బీఆర్‌కే భవన్ వద్ద రైతు కమిషన్ చైర్మన్, సభ్యులతో భేటీ అనంతరం కవిత విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎక్స్‌లో చేసిన ట్వీట్‌పై కవిత ఘాటుగా స్పందించారు. తన సోదరుడు కేటీఆర్ ఓ పక్క తనకు శుభాకాంక్షలు చెబుతూనే బీఆర్ఎస్ ఓటమికి ఆ కేసే కారణమనే అర్థం వచ్చేలా పోస్టు చేశారన్నారు. తన అరెస్టుకు ముందే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయని, ఓటమికి కారణాలేంటో కేటీఆర్‌కు, బీఆర్ఎస్ శ్రేణులకు తెలియదా? అని ఆమె నిలదీశారు. ఇండ్లు ఇవ్వకపోవడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, దోపిడీదారులకు టికెట్లు మార్చమని ఎంతమంది ఎన్నిసార్లు మొత్తుకున్నా మార్చకుండా.. మళ్లీ వాళ్లనే ప్రజలపై రుద్దాలని చేసిన ప్రయత్నాలే బీఆర్ఎస్ పార్టీ ఓటమికి ప్రధాన కారణాలని కవిత అన్నారు. అనాడు చర్చలో ఉన్న అంశాలు ఇవేనని తెలిపారు. అన్నింటికంటే అధికంగా అహంకారం అనే అంశం వల్లే పార్టీ ప్రజల తిరస్కారానికి గురైందనే చర్చ అధికంగా ఉందన్నారు. కేటీఆర్ ఇప్పటికైనా నిజాన్ని అంగీకరించాలని, అలా కాక బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేస్తానంటే సహించేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఓటమికి కారణాలేంటే ప్రజలు కూడా ఓసారి గుర్తు చేసుకోవాలని కవిత కోరారు. ఇక, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడానికి మద్యం కేసే కారణమని చెప్పేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా తీవ్ర ప్రయత్నం చేస్తుందని ఎద్దేవా చేశారు. అయితే, తన మీద పెట్టిన కేసు పార్టీ కోసం కాదా ? అని కేటీఆర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా పెయిడ్ బ్యాచ్ చెప్పాలని అన్నారు. న్యాయస్థానంలో సానుకూల తీర్పు వచ్చిన వెంటనే దానిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించడం, ఇందుకోసం పార్టీ ఓటమిని తన మెడలో వేయాలని చూడడం తగదని కవిత మండిపడ్డారు. 'పెంపకానికి వచ్చిన కోర్టు తీర్పు' అంటూ సన్నాయి నొక్కులు ఏంటని ప్రశ్నించారు. మద్యం కేసు వల్ల బీఆర్ఎస్ ఓడిపోయిందనే మాట అవాస్తవం అని స్పష్టం చేశారు. ఇక, తన సోదరుడు కేటీఆర్ ఇంకా భ్రమల్లోనే బతుకుతున్నారని, ఇకనైనా నిజాన్ని అంగీకరించి, ఎన్నికల్లో అసలేం జరిగిందో అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని హితవు పలికారు. అలా కాకుండా ప్రజల మీద కోపాన్ని చూపించడం, తనని నిందిచడం సరి కాదని పేర్కొన్నారు. పార్టీ ఓటమిని తన మెడలో వేస్తే ప్రజలు కూడా హర్షించరని తెలిపారు.

ముందుగానే 'పది' పాఠాలు

- 9వ తరగతికి మార్చిలోనే ఎస్ఏ-2 పరీక్షలు
- ఆ వెంటనే పదో తరగతి సిలబస్ ప్రారంభం
- ప్రతి సబ్జెక్టులో నాలుగు చాప్టర్ల బోధన
- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరిగి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలకు అవకాశం
- ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా బ్రిడ్జి విధానం



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ తరహా బోధనకు శ్రీకారం చుడుతోంది. వచ్చే ఏడాది చదవాల్సిన పాఠాలను విద్యార్థులకు ఇప్పుడే బోధించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు ముందుగానే పదో తరగతి సిలబస్ ప్రారంభిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే కొంత సిలబస్‌ను పూర్తి చేయడం వల్ల.. వచ్చే విద్యా సంవత్సరంలో మిగిలిన సమయాన్ని మరింత సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి మొట్టమొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ విధానం ప్రవేశపెడుతోంది. అందుకోసం తొమ్మిదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 (తుది పరీక్షలు)ను నెల రోజులు ముందుకు తీసుకొచ్చింది. ఉన్నత పాఠశాలల్లో 6-8 తరగతుల విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 15 వరకు జరుగుతాయి. ప్రతి ఏటా 9వ తరగతి పరీక్షలు కూడా వీరితో కలిపి జరిగేవి. కానీ ఈ ఏడాది టెన్త్ సిలబస్‌ను ముందే ప్రారంభించాలని నిర్ణయించిన అధికారులు.. తొమ్మిదో తరగతి విద్యార్థులకు మార్చి 12తోనే ఎస్ఏ-2 పరీక్షలను పూర్తిచేయనున్నారు. ఆ తర్వాత ఏప్రిల్ 23 వరకు పాఠశాలల పనిదినాలు ఉంటాయి. ఈ 40 రోజుల్లో వారికి పదో తరగతి సిలబస్‌ను బోధిస్తారు. ప్రతి సబ్జెక్టులో నాలుగు చాప్టర్ల చొప్పున పాఠ్యాంశాలు పూర్తి చేస్తారు. అందులో క్లిష్టంగా ఉండే పాఠ్యాంశాలకు ప్రాధాన్యత ఇస్తారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వాటిని చదువుకునేలా ఈ బోధన జరుగుతుంది. అనంతరం 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక మిగిలిన పాఠ్యాంశాల బోధన ప్రారంభమవుతుంది. దీనివల్ల వచ్చే విద్యా సంవత్సరంలో టెన్త్ సిలబస్ చాలా ముందుగానే పూర్తవుతుంది. మిగిలిన సమయాన్ని పబ్లిక్ పరీక్షల సన్నద్ధతకు ఉపయోగిస్తారు. ఎక్కువ సమయం ఉండటం వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరిగి, ఉత్తమ ఫలితాలు వస్తాయని పాఠశాల విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో ఈ తరహా బ్రిడ్జి కోర్సుల విధానం ఉంది. పాఠశాల నుంచి ఇంటర్‌కు వెళ్లే విద్యార్థులు అయోమయానికి గురికాకుండా జూనియర్ కాలేజీలూ బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తుంటాయి. ఇప్పుడు పాఠశాల విద్యా శాఖ కూడా అలాంటి బ్రిడ్జి విధానం తీసుకొస్తోంది.

ఒబేసిటీకి జీవన శైలితో కళ్లెం

- రోజువారీ అలవాట్లు మార్చుకుంటే చక్కటి ఫలితాలు
- జన్యుపరంగా వచ్చే ఒబేసిటీని కూడా నియంత్రించవచ్చు
- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వెల్లడి
- ఏడు వేల మందిపై ఏఐజీ ఆస్పత్రి అధ్యయనం
- 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో పరిశోధన ఫలితాల ప్రచురణ



అధ్యయన ఫలితాలు వెల్లడిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ రాకేశ్ డాక్టర్ నితిన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మా ఇంట్లో అందరూ లావుగానే ఉంటారు.. నేను కూడా లావుగానే ఉన్నాను.. ఏం తినకపోయినా స్థూలకాయంతో ఇబ్బంది పడుతున్నాం.. బరువు తగ్గాలంటే ఏం చేయాలి'.. అంటూ చాలా మంది ప్రజలు వైద్యులను సంప్రదిస్తుంటారు. ఈ సమస్యకు జీవన శైలిలో మార్పులతో కళ్లెం వేయవచ్చని ఏఐజీ ఆస్పత్రుల పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో తేలింది. సాధారణ స్థూలకాయంతోపాటు జన్యుపరంగా వచ్చే ఒబేసిటీని కూడా నియంత్రించవచ్చని వెల్లడైంది. ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి, సెంటర్ ఫర్ ఒబేసిటీ మెటబాలిక్ థెరపీ డైరెక్టర్ డా.రాకేశ్ కలపాల, డాక్టర్ నితిన్ జగ్గ్ ఎలు.. లక్సెంబర్గ్ సెంటర్ ఫర్ సిస్టమ్స్ బయోమెడిసిన్, లక్సెంబర్గ్ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ హ్యూమన్ జెనెటిక్స్ సంస్థలతో కలిసి నిర్వహించిన ఈ పరిశోధన ఫలితాలు సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. భారత్, బ్రిటన్‌లో ఉంటున్న భారతీయులపై ఈ అధ్యయనం నిర్వహించినట్లు నాగేశ్వర్‌రెడ్డి గురువారం వెల్లడించారు. ఈ విశ్లేషణలో యూకే బయో బ్యాంక్‌లోని భారతీయుల డేటాతోపాటు ఏఐజీ ఆస్పత్రులు రూపొందించిన భారతీయ కోహోర్ట్ డేటాను ఉపయోగించినట్లు తెలిపారు. తమ పరిశోధన భవిష్యత్తులో ప్రెసిషన్ ప్రివెన్షన్‌కు పునాది వేస్తుందని పేర్కొన్నారు.

జీవన శైలితో ఒబేసిటీకి లింకు..

భారత్, యూకేలోని దాదాపు 7 వేల మంది ఈ అధ్యయంలో పాల్గొన్నట్లు నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. జీవన శైలి బాగున్న వారిలో స్థూలకాయం సమస్య పెద్దగా లేదని, జీవన శైలి బాగాలేని వారిలో జన్యువుల పనితీరు సరిగా లేక ఊభకాయం పెరుగుతోందని తెలిపారు. కొందరిలో జన్యువులు బాగున్నప్పటికీ జీవనశైలి సరిగా లేక స్థూలకాయం బారిన పడుతున్నారని వివరించారు. వేలాది జన్యు వేరియంట్ల ప్రభావంతో ఏర్పడే పాలీజెనిక్ పరిస్థితే స్థూలకాయమని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. జీనోమ్ - వైడ్ ఎస్ఎన్‌పీ మైక్రో ఆరే ప్లాట్‌ఫామ్ ఉపయోగించి వేల జన్యు వేరియంట్లను విశ్లేషించినట్లు డాక్టర్ రాకేశ్ తెలిపారు. ఈ డేటా ఆధారంగా పాలీజెనిక్ రిస్క్ స్కోర్లు తయారుచేసినట్లు చెప్పారు. జన్యు ప్రమాదం, జీవనశైలి కలయికతో స్థూలకాయం సమస్య మరింత పెరుగుతున్నట్లు తమ విశ్లేషణలో తేలిందన్నారు. యుక్త వయసులో అధిక జన్యు ప్రమాదం ఉన్న వారిలో జీవనశైలి ప్రభావం మరింత కీలకమని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యకు గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేదని అన్నారు. చిప్స్, బర్గర్, పిజ్జా, ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవటంతోపాటు సరైన వ్యాయమం లేక బరువు పెరుగుతున్నారని పేర్కొన్నారు. పిల్లల్లో కూడా ఈ సమస్య పెరుగుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని చెప్పారు.

అధిక బరువుతో అనేక వ్యాధులు

భారతదేశంలో ఒబేసిటీ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. అధిక బరువు వల్ల గుండె, కాలేయ సంబంధిత వ్యాధులతోపాటు మధుమేహం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నట్లు వెల్లడించారు. బ్లడ్ క్యాన్సర్, పెద్ద పేగు క్యానర్లకు కూడా ఒబేసిటీ కారణమవుతోందని చెప్పారు.

వారానికి 150 నిమిషాల వ్యాయామం

జన్యువులు అసాధారణంగా ఉండటం వల్ల వచ్చే ఒబేసిటీకి కూడా చెక్ పెట్టవచ్చని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. కొవ్వు లేకుండా ఆహారం తీసుకోవడం, ఎక్కువ కార్బోహైడ్రేట్స్ లేకుండా జాగ్రత్త పడడం, ఎక్కువ మిల్లెట్స్, ప్రొటీన్ ఉండే ఆహారం తీసుకోవడం వల్ల ఒబేసిటీని నియంత్రించవచ్చని చెప్పారు. అలాగే వారానికి తప్పనిసరిగ్గా 150 నిమిషాల పాటు ఏదో ఒక వ్యాయామం చేయాలని, ధూమపానం పూర్తిగా మానేయాలని సూచించారు. శరీర బరువుకు తగ్గట్టుగా ప్రొటీన్స్ తీసుకోవాలని సూచించారు. కిలో శరీర బరువుకు 1 నుంచి 1.5 గ్రాములు ప్రోటీన్ తీసుకోవాలని తెలిపారు. రోజుకు రెండు గుడ్లలోని తెల్లసొనను తింటే 14 గ్రాముల ప్రోటీన్ లభిస్తుందని చెప్పారు. ఫైబర్‌ను తీపి పదార్థాలతో కలిపి తీసుకోవద్దని సూచించారు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మొదటి మూడు నెలల్లో మార్పు కనిపిస్తుందని, ఏడాదిలోగా ఒబేసిటీని పూర్తిగా నియంత్రణలో పెట్టవచ్చని తెలిపారు. నడుము చుట్టుకొలత, రక్తంలో చక్కెర, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలను యుక్త వయసు నుంచే చేయించుకుంటూ ఉండాలని సూచించారు.

సిసోడియా అవినీతిని నిరూపించే కనీస ఆధారాలు కూడా లేవు

» ప్రాసిక్యూషన్ ఆరోపణలపై రౌస్ ఎవెన్యూ కోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీ మద్యం పాలసీ 2021-22 విధానం రూపొందించేటప్పుడు ఎక్సైజ్ శాఖ బాధ్యతలు కూడా నిర్వర్తించిన ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాపై ప్రాసిక్యూషన్ చేసిన ఆరోపణలను రౌస్ ఎవెన్యూ కోర్టు విశ్లేషించింది. వాస్తవానికి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు పాలసీ విధానాన్ని మద్యం వ్యాపారానికి అనుకూలంగా ఆయన మార్చేశారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను పరిశీలించిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. అవినీతి, క్విడ్ ప్రో కో, నిజాయితీ లేని ఉద్దేశం ఉంటే తప్ప పాలసీ విధానాలు నేరపూరితమైనవి కాబోవని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఆంతరంగిక ఫైళ్లు, పాలసీ డ్రాఫ్టులు, అధికారుల చర్చల ఆధారంగానే ప్రాసిక్యూషన్ కేసు ఉందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే ఇవన్నీ సాధారణ పరిపాలనలో భాగమని, వీటన్నింటినీ నేరపూరితమైనవిగా భావిస్తూ ఆధారాలుగా పేర్కొన్నారని కోర్టు అభిప్రాయపడింది. మద్యం విధానం వల్ల ప్రైవేట్ పార్టీలకు ఆర్థిక ప్రయోజనాలు కలిగినంత మాత్రానే అవినీతికి నిదర్శనమని చెప్పలేమంది. అక్రమ లావాదేవీలు జరిగితేనే నేరంగా భావించాలంది. మద్యం విధానాలపై లంచాలకు, అక్రమ లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని కోర్టు స్పష్టం చేసింది. అవినీతి ఆరోపణలను నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ వద్ద కనీస ఆధారాలు కూడా లేవని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

కోర్టు తీర్పును స్వాగతించిన ఆప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తదితరులను మద్యం స్కాంలో నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పును ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు స్వాగతించారు. ఇది సత్యానికి, రాజ్యాంగ విలువలకు దక్కిన విజయంగా అభివర్ణించారు. 'సత్యమేవ జయతే' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఆప్ నాయకత్వాన్ని కించపరిచేందుకు చేసిన కుట్రలను కోర్టు పటాపంచలు చేసిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. కోర్టు నిర్ణయం సత్యానికి దక్కిన విజయమని.. 'సత్యమేవ జయతే' అంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ పేర్కొన్నారు.

కేంద్ర సంస్థలను బీజేపీ వాడుకుంది: సీపీఐ

కేజ్రీవాల్ విడుదలతో కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ సర్కారు రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకుందని తేలిపోయిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. 'వారు నెలల తరబడి జైలు జీవితం గడిపారు. కుటుంబాలకు దూరమయ్యారు. రాజకీయ ప్రత్యర్థులైన వారి నోరు మూయించడానికే బీజేపీ ఇదంతా చేసింది. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను ఆ పార్టీ రాజకీయ ప్రతీకార సాధనాలుగా ఎలా వాడుకుందో మరోసారి స్పష్టమైంది' అని పేర్కొన్నారు.

కోర్టు విడిచిపెట్టినా ఢిల్లీ ప్రజలు ఇప్పటికే తీర్పునిచ్చారు

» కేజ్రీవాల్ అవినీతిపరుడని నమ్ముతున్నా: ఢిల్లీ బీజేపీ చీఫ్


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: 'కేజ్రీవాల్ అవినీతిపరుడని గట్టిగా నమ్ముతున్నాను. కోర్టు వారిని విడిచిపెట్టొచ్చు. ఢిల్లీ ప్రజలు ఇప్పటికే తమ తీర్పును వెల్లడించారు. ప్రజల సానుభూతి కోసం మీడియా ముందు ఆయన కంటతడి పెట్టుకొని డ్రామాలాడుతున్నారు. ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు భారతరత్న ఇవ్వాలి. ఆయన మీడియా ముందు చేసిన ప్రదర్శనకు బాలీవుడ్‌కు పంపితే మంచిది' అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఘాటుగా వ్యాఖ్యానించారు. మద్యం పాలసీకి సంబంధించి అనేక కీలకాంశాలపై కేజ్రీవాల్ వద్ద ఇప్పటికీ సమాధానాలే లేవని.. వారు ప్రవేశపెట్టిన మద్యం విధానం సరైనదే అయితే దర్యాప్తు ప్రారంభమైన వెంటనే ఎందుకు వెనక్కి తీసుకున్నారని ప్రశ్నించారు.

ఢిల్లీ హైకోర్టులో సీబీఐ సవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మద్యం కుంభకోణం కేసులో 23 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై సీబీఐ ఢిల్లీ హైకోర్టు తలుపు తట్టింది. ఢిల్లీ మద్యం పాలసీ రూపకల్పనలో ఎలాంటి నేరపూరిత ఉద్దేశం కానీ, కుట్ర కానీ లేదని.. సీబీఐ సమర్పించిన సాక్ష్యాలు న్యాయ పరీక్షకు నిలవవని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి జితేంద్రసింగ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందని, హవాలా మార్గంలో నిధుల బదిలీకి సాక్ష్యాధారాలున్నాయని, కుంభకోణంలో పాత్రధారులు పలుమార్లు కలిశారని తాము సాక్ష్యాలతో పేర్కొన్న కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని సీబీఐ భావిస్తోంది. ఈ కేసులో మరింత దర్యాప్తు జరపాల్సి ఉందని సీబీఐ హైకోర్టు ముందు దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నట్టు తెలిసింది.

ఢిల్లీ మద్యం కేసు

మాయ.. మిథ్య!



> 'దర్యాప్తు సంస్థలతో కలిసి బీజేపీ ఎన్ని కుట్రలు చేసి మమ్మల్ని అవినీతిపరులుగా నిరూపించాలనుకున్నా.. ఈరోజు కోర్టు కేజ్రీవాల్, సిసోడియాలు నిజాయతీపరులని తేల్చింది'
> - మనీశ్ సిసోడియా, మాజీ డిప్యూటీ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ముత్తా గౌతమ్ సహా ఈ కేసులో నిందితులందరికీ క్లీన్‌చిట్ ఇచ్చింది. "ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసు.. చేసిన విచారణ.. 12 శాతం హోల్‌సేల్ మార్జిన్‌తో కుప్పలు తెప్పలుగా లాభాలు వచ్చిపడిపోతాయనే సీబీఐ సిద్ధాంతం మొత్తం తప్పుల తడక. ఆర్థిక అంశాలపై అక్షరం ముక్క రానివాళ్లు చేసినట్లుంది. చట్టపరంగా ఏమాత్రం నిలవదు" అని తేల్చి చెప్పింది. సౌత్ గ్రూప్‌కు లబ్ధి చేకూర్చేందుకు అప్పటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రయత్నించారనడానికి ఆధారాల్లేవని స్పష్టం చేసింది. కేజ్రీవాల్ తప్పు చేశారని నిరూపించేందుకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా అక్రమంగా ఆయన లబ్ధి పొందారని చెప్పడానికి ఏదైనా ఒక పత్రం కానీ, ఫైల్ నోట్ కానీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ కానీ, ఆర్థిక లావాదేవీని కానీ సాక్ష్యాధారంగా చూపలేకపోయిందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు రౌజ్ ఎవెన్యూ కాంప్లెక్స్‌లోని సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ శుక్రవారం సంచలన తీర్పును వెలువరించారు. 598 పేజీల తన తీర్పులో సీబీఐ, ఈడీలను ఆయన కడిగిపారేశారు. ఇది ఎందుకూ పనికిరాని కేసు అని, న్యాయ సమీక్షకు అస్సలు నిలవదని తేల్చి చెప్పారు. "సీబీఐ సమర్పించిన మొత్తం రికార్డును 2 నెలలకు పైగా వడపోశాం. వందలాది పేజీలతో రూపొందించిన చార్జిషీటు, ఇతర పత్రాలను పరిశీలించాం. దాదాపు 300మంది సాక్షులను విచారించాం. పార్టీల వాదనలు అన్నిటినీ విన్నాం. చివరికి మాకు అనిపించింది ఏమిటంటే.. కేసులో ప్రాథమిక సాక్ష్యాధారాలను కూడా సీబీఐ చూపలేదు. నిందితులకు వ్యతిరేకంగా తీవ్రమైన సందేహాన్ని లేవనెత్తలేదు. ఈ మాట చెప్పడానికి మేం సంకోచించడం లేదు. అందుకే, ఈ కేసులో ఆరోపించిన అన్ని నేరాల నుంచి నిందితులందరినీ విముక్తులను చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. దర్యాప్తులో అనేక లొసుగులున్నాయని, చార్జిషీటులో తప్పుదోవ పట్టించే అంశాలున్నాయని తప్పుబట్టారు. "ఒక్క సాక్షి ప్రకటనను కూడా సీబీఐ పక్కాగా చేర్చలేకపోయింది. ప్రాథమిక ఆధారాలు కూడా లేకుండా కేజ్రీవాల్, సిసోడియా సహా అనేక మందిని నిందితులుగా చేర్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు కుల్దీప్ సింగ్. అసలు ఆయనను మొదటి నిందితుడిగా ఎందుకు చేర్చారో సీబీఐ చెప్పలేకపోయింది. ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలూ సేకరించలేదు" అంటూ జడ్జి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మద్యం విధానాన్ని మనీశ్ సిసోడియా రూపొందించారని చెప్పడానికి కూడా ఎలాంటి ఆధారాలు చూపలేదని స్పష్టం చేశారు. చార్జిషీటులో ఎన్నో అంతర్గత వైరుధ్యాలు ఉన్నాయని, ఫలితంగా, మద్యం స్కాంలో కుట్ర జరిగిందని సీబీఐ తేల్చలేకపోయిందని వ్యాఖ్యానించారు. "రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న కేజ్రీవాల్ వంటి వ్యక్తిని నిర్దిష్ట సమాచారం లేకుండా కేసులో నిందితుడిగా చేర్చడం రూల్ ఆఫ్ లాకే విరుద్ధం. ఆయనకు వ్యతిరేకంగా ఏ ఒక్కరూ ప్రకటన చేయలేదు. సాక్ష్యాలూ సమర్పించలేదు. అటువంటప్పుడు ఆయనే ఈ కుంభకోణానికి పాల్పడ్డారని ఎలా చెప్పగలరు!?" అని జడ్జి ప్రశ్నించారు. ఏదో భారీ, సంక్లిష్టమైన కుట్ర ఉందన్న భావన కల్పించేందుకు ఏమాత్రం పొంతన లేని అంశాలను అతుకుల బొంత మాదిరిగా కుట్టారని తప్పుబట్టారు.

కేసు నేపథ్యం ఇదీ..

ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం 2021 నవంబరులో కొత్త మద్యం విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం రీటైల్ విక్రయాల నుంచి ప్రభుత్వం తప్పుకొంది. మద్యం దుకాణాలను నడపడానికి ప్రైవేటు లైసెన్సుదారులకు అనుమతిచ్చింది. కొత్త పాలసీతో లిక్కర్‌పై ఆదాయం 27% పెరిగిందని, 8,900 కోట్ల ఆదాయం వచ్చిందని ప్రభుత్వం తెలిపింది. ఈ విధానాన్ని బీజేపీ తప్పుబట్టింది. పాలసీలో ఉల్లంఘనలు ఉన్నాయని, ప్రైవేటు లైసెన్సుదారులకు అనుచిత ప్రయోజనాలు కల్పించారని ఆరోపించింది. దీనిపై ఢిల్లీ సీఎస్ ఓ నివేదిక ఇచ్చారు. ప్రైవేటు వ్యాపారులకు ప్రభుత్వం రూ.144 కోట్ల మేర లైసెన్సు ఫీజు మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే, మద్యం పాలసీపై సీబీఐ విచారణ జరపాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సిఫారసు చేశారు. కేంద్ర హోం శాఖ డైరెక్టర్ ప్రవీణ్ రాయ్ సీబీఐకి ఫిర్యాదు చేశారు. పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు లంచాల కోసం కుట్రపూరితంగా పాలసీలో మార్పులు చేశారని, హవాలా లావాదేవీలు జరిపారని, ఎన్నికల్లో ఖర్చు కోసం ఆ డబ్బును వినియోగించారని ఆరోపించింది. దాంతో, 2022 నవంబర్ 24న సీబీఐ ప్రధాన చార్జిషీటును దాఖలు చేసింది. కేసును విచారించిన సీబీఐ 23 స్పెషల్ జడ్జి జితేందర్ సింగ్ తుది తీర్పును వెలువరించారు.

అన్నీ ఊహలే.. ఆధారాల్లేవ్

మద్యం విధానం రూపకల్పనలో ఏ విధమైన అక్రమాలు జరగలేదని జడ్జి జితేందర్ సింగ్ స్పష్టం చేశారు. వివిధ శాఖలు, నిపుణుల కమిటీలతో చర్చించి క్యాబినెట్ స్థాయిలో ఆమోదాలు పొందిన తర్వాతే నిర్మాణాత్మకంగా నిర్ణయాలు తీసుకున్నారని స్పష్టం చేశారు. ఇచ్చి పుచ్చుకోవడం, వ్యక్తిగత ప్రయోజనాలు, అధికార దుర్వినియోగానికి సంబంధించి రుజువులు సమర్పించనంత వరకు ఎలాంటి ఆరోపణలకు పస ఉండదని స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నరే ఈ విధానానికి ఆమోద ముద్ర వేశారని గుర్తు చేశారు. "కేవలం ఊహల ఆధారంగా సీబీఐ ఈ కేసును తీర్చిదిద్దింది. చట్టపరంగా ఆమోదించే ఆధారాలేమీ లేవు. ఈ కేసును లాజికల్‌గా, పక్కాగా పెట్టాలని సీబీఐ భావించింది. కానీ, ముందే వచ్చిన నిర్ణయం మేరకే ఆధారాలను సమకూర్చుకుందని న్యాయ సమీక్షలో తేలిపోయింది. అతుకుల బొంత చార్జిషీటులో ఊహలతోనే ఖాళీలను పూరించుకునే బాధ్యతను కోర్టుకు అప్పగించింది. కానీ, చట్టప్రకారం ఇది ఆమోదయోగ్యం కాదు. ఈ కేసులో సీబీఐ తీరు తప్పుల తడక. ఆర్థిక అంశాల్లో పూర్తి నిరక్షరాస్యత. చట్టపరంగా నిలవదు. ప్రభుత్వ విధానాలను అమలు చేసేటప్పుడు అధికారులు రొటీన్‌గా అధికారిక విధులు నిర్వర్తిస్తారనే వాస్తవాన్ని దర్యాప్తు అధికారి విస్మరించారు. రూల్ ఆఫ్ లా పునాదులపైనే దాడి చేశారు. నేరం జరిగిందని వాళ్లు ముందే అనుకుని ఆ భావనతో దర్యాప్తు చేశారు. సాధారణ ఆర్థిక లావాదేవీలను కూడా నేరంగా చూపాలని చూశారు. ఎన్నికల ప్రచారంలో చేసిన ఖర్చులను కూడా ఆడిట్ చేసేసి.. ఎన్నికల కమిషన్ పాత్రను కూడా సీబీఐ పోషించేసింది" అని తీవ్రంగా తప్పుబట్టింది.

మాగుంట ప్రకటనతో కేజ్రీని ఇరికిస్తారా?

నాలుగో అదనపు చార్జిషీటును 2024 జూలైలో సమర్పించారని, చివరి దశలో కేజ్రీవాల్‌ను నిందితుడిగా చేర్చారని కోర్టు తప్పుబట్టింది. "మాగుంట శ్రీనివాసులు రెడ్డి అప్రూవర్‌గా ఇచ్చిన ప్రకటన ఆధారంగా కేజ్రీవాల్‌ను కుట్రలో భాగం చేశారు. అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ కూతురు నన్ను సంప్రదిస్తారని మాగుంట చెప్పిన మాట ఆధారంగానే ఆయనను ఇరికించారు.తర్వాతే ఆయన్ని 18వ నిందితుడిగా చేర్చారు. ఆ ఒక్క ప్రకటన ఆధారంగా కేజ్రీవాల్‌ను ఎలా ఇరికిస్తారు?" అని కోర్టు ప్రశ్నించింది. సౌత్ గ్రూప్‌కు ప్రయోజనాలు చేకూర్చేందుకే విధానాన్ని మార్చడంలో కేజ్రీవాల్ కీలక పాత్ర పోషించారని చెప్పేందుకు సీబీఐ తీవ్ర ప్రయత్నాలు చేసిందని తప్పుబట్టింది.

అప్రూవర్ల ప్రకటనలు నమ్మలేం

"అప్రూవర్లు చెప్పిన మాటలనే సీబీఐ పరమ సత్యాలుగా నమ్మింది. కనీసం వాటిని వెరిఫై కూడా చేసుకోలేదు. అప్రూవర్ల ప్రకటనలు విశ్వసనీయం కాదు. వాటిని నిర్ధారించుకోలేం. రాఘవ, మాగుంట వంటి వారి ప్రకటనలను పరిగణనలోకి తీసుకోలేం. వాటికి డాక్యుమెంటరీ సాక్ష్యాలేమీ లేవు. అక్కడా ఇక్కడ విన్న మాటల ఆధారంగా కేసును నిర్మించారు" అంటూ సీబీఐని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కేజీఆర్‌ఎల్ కంపెనీకి మాగుంట గ్రూప్‌కు చెందిన జనబ్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 కోట్లు బదిలీ చేయడం.. తర్వాత దానిని తిరిగి చెల్లించడం చూస్తే ఎలాంటి కుట్రకు ఆస్కారం లేదని వ్యాఖ్యానించింది. రుణాన్ని తిరిగి చెల్లించినంత మాత్రాన దానిని సాక్ష్యంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. నగదు బదిలీకి, మనీశ్ సిసోడియాకు మధ్య సంబంధం ఉన్నట్లు రుజువు చేయలేకపోయారని స్పష్టం చేసింది. సౌత్ గ్రూప్ తరఫున విజయ్ నాయర్ (ఏ3) మనీశ్ సిసోడియాతో కుమ్మక్కై కుట్రకు పాల్పడ్డారని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది. ఇండో స్పిరిట్స్‌కు చెందిన సమీర్ మహేంద్రు (ఏ7) మద్యం విధాన రూపకల్పన అమల్లో కుట్రకు పాల్పడ్డారని, తద్వారా హోల్‌సేల్ లైసెన్సు పొందారని చెప్పేందుకు కూడా సాక్ష్యాలు లభించలేదని తెలిపింది. హోల్‌సేల్ డీలర్ల మార్జిన్‌ను 12 శాతం మేరకు పెంచినంత మాత్రాన దాన్ని కుట్రగా పరిగణించలేమని కోర్టు స్పష్టం చేసింది. ఈ 12 శాతం మార్జిన్ ఆర్థికంగా లాభసాటి కూడా కాదని వ్యాఖ్యానించింది. సౌత్ గ్రూప్‌కు లబ్ధి చేకూర్చడానికే ఈ మార్జిన్‌ను పెంచారని ఆరోపించడం హేతుబద్ధం కాదని స్పష్టం చేసింది. పాత, కొత్త విధానాలను పోల్చి విశ్లేషించడంలో కూడా సీబీఐ విఫలమైందని కోర్టు తప్పుపట్టింది. ఈ సందర్భంగా 'అన్యాయం ఎక్కడ జరిగినా న్యాయానికి ప్రతి చోట ముప్పు ఏర్పడినట్లే' అన్న మార్టిన్ లూథర్ కింగ్ మాటలను జడ్జి ఉటంకించారు.

విధాన నిర్ణయాలపై కేసు పెట్టి దర్యాప్తు చేయరాదు

అవినీతి అక్రమాలు చేయాలనే ఉద్దేశమో లేదా పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ఆధారమో లేకుండా కేవలం విధాన నిర్ణయాలకు ఆమోదం తెలపడాన్ని నేరంగా పరిగణించలేమని కోర్టు స్పష్టం చేసింది. కేజ్రీవాల్‌కు ఆర్థికంగా లబ్ధి చేకూరిందని చెప్పడానికి పత్రాల రూపంలో కానీ ఎలక్ట్రానిక్ రూపంలో కానీ ఆధారాలను చూపలేకపోయిందని సీబీఐని తప్పుబట్టారు. "అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో, విధాన నిర్ణయాల్లో మార్పులు సర్వసాధారణం. సంక్షేమ పథకాల అమలుకు, ఆదాయాన్ని పెంచుకోవడానికి అనివార్యం కూడా. ఆశించిన ఫలితాలు రాలేదనో.. ప్రైవేటు భాగస్వాములు లాభాలు ఆర్జిస్తున్నారనో నిర్దిష్ట పథకంపై కేసు పెట్టి దర్యాప్తు చేయరాదు. సదుద్దేశంతో తీసుకున్న ఆర్థిక, పరిపాలనాపరమైన నిర్ణయాలను ఎటువంటి ఆధారాలు లేకుండా నేరంగా పరిగణించరాదు" అని కోర్టు వ్యాఖ్యానించింది.

అప్పట్లో ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి. అయినా.. ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితుడిగా రెండు విడతల్లో 156 రోజులపాటు సీబీఐ ఆయనను తీహార్ జైల్లో పెట్టింది. అయితే, లంచం తీసుకున్నారని, పరస్పర ప్రయోజనం (క్విడ్ ప్రో కో) పొందారనడానికి ఆధారాల్లేకుండానే సీబీఐ ఆయనను అరెస్టు చేసి, జైల్లో పెట్టిందని ఇప్పుడు న్యాయస్థానం తేల్చింది!

మద్యం కుంభకోణంలో కీలక పాత్రధారి అంటూ అప్పటి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ ఏకంగా 530 రోజులపాటు అంటే.. దాదాపు ఏడాదిన్నర జైల్లో ఉంచింది! కానీ, ఆయన నిందితుడంటూ ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా సీబీఐ, ఈడీ చూపలేదని రౌజ్ ఎవెన్యూ కోర్టు తేల్చి చెప్పింది!

మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా గోవా ఎన్నికల కోసం ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల నిధులు సమకూర్చారని అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సీబీఐ అరెస్టు చేసింది! దాదాపు 165 రోజులపాటు ఆమెను తీహార్ జైల్లో ఉంచింది! కానీ, కవిత దోషి అని చెప్పేందుకు సీబీఐ ఒక్క ఆధారం కూడా చూపలేదని కోర్టు ఇప్పుడు స్పష్టం చేసింది!

ఆప్‌పై మోదీ, అమిత్ షా కుట్ర

» మేం అవినీతిపరులం కాదని కోర్టు కూడా చెప్పింది

» దేశానికి ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి

» దమ్ముంటే ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి

» బీజేపీకి 10 కన్నా ఎక్కువ సీట్లు వస్తే.. నేను రాజకీయాల నుంచి తప్పుకొంటా: కేజ్రీవాల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీ మద్యం కేసు పేరుతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని అంతం చేసేందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా కలిసి కుట్ర పన్నారని ఆ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. "ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన చర్య స్వతంత్ర భారతదేశంలో గతంలో ఎన్నడూ జరగలేదు. మాపై తప్పుడు కేసుతో బురద చల్లారు. నేను అవినీతిపరుణ్ని కాదు. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా నిజాయితీపరులని కోర్టు కూడా చెప్పింది. ఆప్‌ను అంతం చేయాలని ప్రధాని మోదీ, అమిత్ షా కలిసి అతిపెద్ద రాజకీయ కుట్రకు పాల్పడ్డారు. మా పార్టీకి చెందిన ఐదుగురు నేతలను జైల్లో పెట్టారు. ముఖ్యమంత్రిగా ఉన్న నన్ను కూడా తీసుకెళ్లి జైల్లో వేశారు. బీజేపీ దర్యాప్తు సంస్థలు మమ్మల్ని అవినీతిపరులుగా నిరూపించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. కేజ్రీవాల్, సిసోడియా అత్యంత నిజాయతీపరులు (కట్టర్ ఇమాన్‌దార్) అని నిరూపితమైంది. మాపై పెట్టింది తప్పుడు కేసుగా కోర్టు స్పష్టం చేసినందున దేశానికి ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి. బీజేపీ అధికారంలోకి రావడానికి మాపై తప్పుడు కేసులు పెట్టి.. 3కోట్ల మంది ఢిల్లీ ప్రజలను కూడా మోసం చేశారు. మోదీకి దమ్ముంటే ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. బీజేపీకి 10 సీట్ల కన్నా ఎక్కువ వస్తే నేను రాజకీయాల్లో నుంచి తప్పుకొంటా. ఆప్ లాంటి పార్టీలను ధ్వంసం చేసేందుకు కుట్రలు చేయడం మానుకొని.. దేశ ప్రయోజనాల కోసం పనిచేయడంపై మోదీ, అమిత్ షా దృష్టి పెట్టాలి. జీవితంలో నేను ఎప్పుడూ తప్పు చేయలేదు. నేను అవినీతిపరుణ్ని కాదు" అని కేజ్రీవాల్ కంటతడి పెట్టారు.





కుటుంబ సభ్యులతో కేజ్రీ భావోద్వేగం. ఢిల్లీలో కార్యకర్తల సంబరాలు

ఎవరీ జితేంద్రసింగ్!


మద్యం కేసులో సంచలన తీర్పునిచ్చిన రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి

సీబీఐ తీరుపై విమర్శలు గుప్పిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మాజీ సీఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో సహా 23 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ శుక్రవారం రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి జితేంద్ర ప్రతాప్‌సింగ్ వెలువరించిన 598 పేజీల తీర్పు రాజకీయ, న్యాయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీబీఐకే అక్షర జ్ఞానం లేదని.. అభూతకల్పనలు, తప్పుడు సాక్ష్యాధారాల ఆధారంగా తన చార్జిషీట్‌ను రూపొందించిందని ఆయన చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి జితేంద్ర సింగ్ లా డిగ్రీ పొందారు. ఢిల్లీ జ్యుడీషియల్ సర్వీస్‌లో సీనియర్ అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2024 అక్టోబరు నుంచి రౌస్ అవెన్యూ కోర్టు అదనపు సెషన్స్ జడ్జిగా కొనసాగుతున్న ఆయన.. ప్రత్యేక జడ్జి కింద అవినీతి నిరోధక చట్టానికి సంబంధించిన సీబీఐ కేసులను విచారిస్తున్నారు. జితేంద్ర సింగ్ ఎలాంటి ప్రలోభాలకు లొంగరని, చట్టం విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తారని పేరుపొందారు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి కేవలం అప్రూవర్ల ప్రకటనల ఆధారంగా సీబీఐ లాంటి సంస్థ కేసును నిర్మించినందుకు తీవ్రంగా విమర్శించారు. నిర్మాణాత్మక సాక్ష్యాలేవీ లేకుండా సీబీఐ కథలు అల్లిందని, అప్రూవర్ల మాటలనే వేదంగా భావించిందని.. ఇలా ఆధారపడడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ఆక్షేపించారు. మొత్తం సీబీఐ పరిశోధన జరిపిన తీరునే తప్పుబట్టిన జితేంద్ర సింగ్.. సీబీఐ పరిశోధనాధికారిపైనే శాఖాపరమైన దర్యాప్తునకు ఆదేశించడం గమనార్హం.

లోకం తీరు



మనీ లాండరింగ్ జరిగినట్లు ఆధారాలున్నాయి

» ట్రయల్ కోర్టు కోరితే వాదనలు వినిపిస్తాం

» ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు తీర్పుపై ఈడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్పందించింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్లు విశ్వసనీయమైన ఆధారాలు ఉన్నాయని, అందువల్లే దర్యాప్తును కొనసాగించామని తెలిపింది. వాటన్నింటినీ చార్జిషీట్లలో పొందుపర్చామని పేర్కొంది. అందువల్ల ఈ కేసులో మనీలాండరింగ్ కోణాన్ని ప్రత్యేకంగా పరిగణించి, విడిగా దర్యాప్తు చేయడానికి అనుమతించాలని ఈడీకి చెందిన ఓ అధికారి అభిప్రాయపడ్డారు. ట్రయల్ కోర్టు కూడా మనీలాండరింగ్ కేసులో ఈ నిర్ణయం తీసుకోలేదని, అనుమతిస్తే తమ వాదనలు కొనసాగిస్తామని వివరించారు. అయితే, పీఎంఎల్ఏ చట్టం ప్రకారం ఈడీ స్వతంత్రంగా క్రిమినల్ కేసు నమోదు చేయలేదు. సీబీఐ, పోలీసుల సిఫారసు లేదా ఫిర్యాదు ఉండాల్సిందే. విజయ్ మదన్‌లాల్(2022) కేసులో సుప్రీంకోర్టు తీర్పును బట్టి ఏదైనా అవినీతి కేసులో నిర్దోషిగా తీర్పు వస్తే దానికి అనుబంధంగా ఉన్న ఈడీ కేసు కూడా వీగిపోతుంది. ఢిల్లీ ఎక్సైజ్ కేసు కూడా అలాంటిదే ముందుగా సీబీఐ(2022 ఆగస్టు 17) అవినీతి కేసు నమోదు చేసింది. తర్వాత ఈడీ మనీలాండరింగ్ కోణంలో కేసు(2022 ఆగస్టు 22) పెట్టింది. కానీ, విశ్వసనీయ ఆధారాలు ఉన్నందున ఈ కేసులో మనీలాండరింగ్ కోణాన్ని ప్రత్యేకంగా చూడాలని ఈడీ అధికారి అన్నారు.

మద్యం కేసులో ఎప్పుడు ఏం జరిగింది?

2021, నవంబరు ఢిల్లీ ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని ప్రకటించింది.

2022, జూలై ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో అవినీతి, అక్రమాలతో పాటు మనీలాండరింగ్ కూడా జరిగిందని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సీబీఐ దర్యాప్తునకు సిఫారసు చేశారు.

2022, ఆగస్టు ఎక్సైజ్ పాలసీలో అవినీతి ఆరోపణలపై సీబీఐ (ఆగస్టు 17), మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ (ఆగస్టు 22) కేసులు నమోదు చేశాయి. ఢిల్లీలోని రాజ్ అవెన్యూ కోర్టు విచారణ ప్రారంభించింది.

2022, సెప్టెంబరు ఢిల్లీ ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని రద్దు చేసింది

2023 అక్టోబరు - 2024 మార్చి ఈ 5 నెలల కాలంలో మనీలాండరింగ్ కేసుపై ఈడీ కేజ్రీవాల్‌కు 9సార్లు సమన్లు జారీ చేసింది.

2024, మార్చి 21 ఈడీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. అంతకుముందు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలంటూ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది.

2024 మే 10 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు 2024, జూన్ 1వరకు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది.

2024, జూన్ 20 మనీలాండరింగ్ కేసులో ఢిల్లీలోని ట్రయల్ కోర్టు (రాజ్ అవెన్యూ కోర్టు) కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది.

2024, జూన్ 21 ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ట్రయల్ కోర్టు ఆర్డర్‌ను సస్పెండ్ చేసింది. దీంతో, కేజ్రీవాల్ జైల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది.

2024 జూన్ 26 జైల్లోనే ఉన్న కేజ్రీవాల్‌ను ఎక్సైజ్ పాలసీలో అవినీతి కేసులో సీబీఐ అధికారికంగా అదుపులోకి తీసుకుంది.

2024, జూలై 12 ఈడీ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ సీబీఐ కేసులో బెయిల్ రాని కారణంగా ఆయన జైల్లోనే ఉన్నారు

2024, జూలై 17 సీబీఐ అరెస్టు చేయడాన్ని కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశారు.

2024, ఆగస్టు 5 సీబీఐ అరెస్టును ఢిల్లీ హైకోర్టు సమర్థించింది

2024, అగస్టు12 ఢిల్లీ హైకోర్టు తీర్పుపై కేజ్రీవాల్ సుప్రీంను ఆశ్రయించారు.

2024, సెప్టెంబరు 13 సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే బెయిల్ వచ్చి ఉండటంతో కేజ్రీవాల్ జైలు నుంచి విడుదల అయ్యారు.

2026, ఫిబ్రవరి 12 ఎక్సైజ్ పాలసీలో అక్రమాలకు సంబంధించి మొదటి నుంచీ విచారణ జరుపుతున్న ఢిల్లీలోని ట్రయల్ కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది.

2026, ఫిబ్రవరి 27 ఢిల్లీ ట్రయల్ కోర్టు ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్, సిసోడియా, కవిత సహా 23మందిపై ఉన్న కేసులను కొట్టివేసింది



ఏయూను వైసీపీ కార్యాలయంగా మార్చారు

▸ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విచారణ నివేదిక వచ్చాక చర్యలు: లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్రా యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖ సిటీ ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టాలని, వర్సిటీలోని వసతి గృహాలు, విభాగాల్లో పనిచేస్తున్న రోజువారీ వేతన సిబ్బంది, ఎన్ఎంఆర్, 28 రోజుల వేతన ఉద్యోగులను కనీస వేతన శ్రేణి ఉద్యోగులుగా(ఎంటీఎస్) పరిగణించడం, దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ విశ్వవిద్యాలయాల్లో గత ఐదేళ్లలో వైసీపీ కార్యకర్తలను విచ్చలవిడిగా వివిధ పోస్టుల్లో నియమించుకున్నారని, దానిపై ఇప్పుడు ప్రత్యేకంగా మేన్‌పవర్ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. ఆడిట్ పూర్తిచేసి అనర్హులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంట్రాక్టు, ఎంటీఎస్ సిబ్బంది రెగ్యులరైజ్‌పై ఆడిట్ నివేదిక వచ్చాక ఫైనాన్స్‌తో సంప్రదించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవకతవకలపై విచారణ జరుగుతోందని, ఆ నివేదిక 45 రోజుల్లో వస్తుందని, నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని లోకేశ్ చెప్పారు. ఆంధ్రావర్సిటీ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 41వ ర్యాంకుకు తెచ్చామని, ఇప్పుడు టాప్-10లోకి తేవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. శనివారం విశాఖ పర్యటనలో వీసీని కలిసి వందేళ్ల ఉత్సవాల నిర్వహణపై చర్చిస్తానన్నారు. మనమిత్ర ద్వారా 943 సేవలు అందిస్తున్నామని, ఇప్పటివరకు 1.48 కోట్ల సేవలు అందించామని లోకేశ్ తెలిపారు. మనమిత్ర వాట్సాప్ సేవలపై శాసనసభలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ మనమిత్ర ప్లాట్‌ఫాంపై ఎలాంటి డేటా స్టోర్ చేయడం లేదన్నారు. మనమిత్ర యాప్‌ను యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

తిరుపతిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ: నారాయణ



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరుపతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టే యోచన చేస్తామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. తిరుపతిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ తిరుపతిలో 408.4 కిలోమీటర్ల పరిధిలో యూజీడీ అవసరముందన్నారు. పాత వాటిలో 7.5 కిలోమీటర్లు లైన్ మార్చేందుకు మార్చిలో టెండర్లు పిలుస్తున్నామన్నారు. మిగతా ప్రాంతంలో యూజీడీ కోసం నిధులపై కేంద్రంతో సంప్రదించి ముందుకెళ్తున్నామన్నారు. స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేయాలన్నారు. తుని పట్టణంలోనూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.600 కోట్లు

▸ జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి నీరు: నిమ్మల



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అసెంబ్లీలో శుక్రవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఈ మొత్తంలో రూ.500 కోట్లు పనులకు, రూ.100 కోట్లు భూసేకరణకు కేటాయించినట్లు చెప్పారు. సుజల స్రవంతితోపాటు, ఉత్తరాంధ్రలో ప్రాధాన్య క్రమంలో మరో 11 ప్రాజెక్టులు గుర్తించి వాటికి రూ.460 కోట్లు కేటాయించామన్నారు. ఈ పథకాన్ని ఫేజ్-1లో రూ.2,022 కోట్లు, ఫేజ్-2లో రూ.4,210 కోట్లతో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

1.10 లక్షల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు: గొట్టిపాటి



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించడం కోసం కూటమి ప్రభుత్వం రూ.13,722 కోట్లు ఖర్చు చేస్తోందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అలానే రైతుల కోసం ఇప్పటివరకు 1.10 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ, పామాయిల్ తోటల్లో విద్యుత్తు లైన్ల వల్ల జరిగే ప్రమాదాలపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి సమాధానం ఇచ్చారు. గోపాలపురం నియోజకవర్గంలో 177 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశామన్నారు.

చేనేత రంగానికి అధిక ప్రాధాన్యం: మంత్రి సవిత



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. అసెంబ్లీలో మండపేట ఎమ్మెల్యే జోగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో నుంచి రూ.7 కోట్ల మేర బకాయిలు చెల్లించామన్నారు. రాబోయే ఉగాది పండుగకు కూడా మరో విడత బకాయిలు చెల్లిస్తామన్నారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఏప్రిల్ 1 నుంచి అందజేస్తామని తెలిపారు. పావలా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నామని, 10 చిన్న క్లస్టర్లు మంజూరు చేశామన్నారు.

'ఉపాధి' అక్రమార్కులపై చర్యలు: నాదెండ్ల

విజయనగరం మండలంలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు చేసిన ఎంపీడీవోతోసహా తప్పు చేసిన అధికారులపై కలెక్టర్ తగిన చర్య తీసుకుంటున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శుక్రవారం శాసనమండలిలో విజయనగరం జిల్లాలో ఉపాధి హామీ పనులపై వైసీపీ సభ్యుడు పీవీవీఎస్ రాజు అడిగిన ప్రశ్నకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తరుపున మంత్రి మనోహర్ సమాధానం చెప్పారు.

వైసీపీ పాలనలో 913 కంపెనీలు వెళ్లిపోయాయి


▸ ఆర్బీఐ నివేదికతో వైసీపీ సెల్ఫ్‌గోల్: టీజీ భరత్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్బీఐ విడుదల చేసిన స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్ రిపోర్టును వైసీపీ సభ్యులు సరిగా చదవకుండానే.. తమకు అనుకూలంగా ఉందని సభలో ప్రస్తావించారని... కానీ వాస్తవాలు పూర్తి భిన్నంగా ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 450 పేజీల రిపోర్టును అధ్యయనం చేశాక వాస్తవాలు బయటపడ్డాయన్నారు. 2019-20లో రాష్ట్రంలో 16,924 పరిశ్రమలు ఉండగా 2023-24 నాటికి 16,011కు తగ్గిపోయాయని.. అంటే గత ప్రభుత్వ హయాంలో 913 కంపెనీలు వెళ్లిపోయాయని చెప్పారు. వైసీపీ సభ్యులు తమ హయాంలో బాగుందని చెప్పి సెల్ఫ్ గోల్ వేసుకున్నారన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. ఎన్నికల హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలను సృష్టించడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక జీవోఎం ఏర్పాటు చేశారన్నారు.

అన్నదాతల ఆత్మహత్యలకు ఫుల్‌స్టాప్

నూతన పాలసీ తెస్తాం.. అండగా ఉంటాం.. కౌలు రైతులనూ ఆదుకుంటాం

▸ అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



అమరావతి, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రాకూడదు. ప్రతి రైతుకూ అండగా ఉంటాం' అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. రైతుల ఆత్మహత్యలను ఆపే పాలసీని తెస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారు. 'ఒక్కోసారి కౌలురైతులు ఊహించిన దాని కంటే ఎక్కువగా 30-40 ఎకరాలు వేస్తున్నారు. దీనివల్ల నష్టం వస్తోంది. కౌలురైతుల్ని కూడా ఆదుకునేందుకు ఎంతవరకు చేయాలో అంత వరకు చేస్తాం. అయితే, వాళ్లలో కూడా పరిమితులు పెట్టుకుని చేస్తే చాలా బాగుంటుంది' అని సూచించారు. శుక్రవారం శాసనసభలో వ్యవసాయ అనుబంధ రంగాలపై సీఎం ప్రసంగించారు. 'వ్యవసాయం పెద్ద ఎత్తున సాగు చేసే రాష్ట్రం మనది. ఈ ఏడాది దేశ వ్యవసాయ వృద్ధి రేటు 0.39శాతం ఉండగా, అదే మన రాష్ట్రంలో 7.83 శాతం ఉంది. వ్యవసాయంలో దేశ జీడీపీలో 10శాతం విరాళంగా ఇచ్చే ఏకైక రాష్ట్రం మనది. గత ఐదేళ్లలో వ్యవసాయ రంగంలో అన్ని విధాలా నష్టపోయాం. అందుకే స్వర్ణాంధ్ర 10 సూత్రాల్లో వ్యవసాయ విధానం తెచ్చాం. ఇంకో వైపు రైతన్నను ముందుకు తీసుకెళ్లడానికి పంచ సూత్రాలు పెట్టుకున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు లేకపోతే.. కొన్ని పంటల్లో చాలా నష్టపోయే పరిస్థితి వస్తుంది. వ్యవసాయంలో సంక్షోభం వచ్చినప్పుడు ఆదుకునేలా రైతులకు ప్రభుత్వ మద్దతు ఉండాలి. ఇందుకోసం సాంకేతికత వాడాలి. రాష్ట్రంలో 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లు పని చేస్తున్నాయి. ఈ ఏడాది 69వేల కనెక్షన్లు అదనంగా ఇచ్చాం. వ్యవసాయానికి రూ.13,722కోట్లు 2025-26లో వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు కేటాయించాం. ఈ ఏడాది మైక్రో న్యూట్రిన్స్ 1,250 టన్నులు సరఫరా చేశాం. 'అన్నదాత సుఖీభవ' కింద రూ.20 వేలు ఇస్తామని ఎన్డీయే తరపున చెప్పాం. దీనిపై ఎవరైతే విమర్శిస్తున్నారో.. వారు ఏడాదికి రూ.7,500 ఇస్తే, ఈరోజు ప్రభుత్వం రూ.14వేలు ఇస్తోంది. నాడు రైతులకు డుబ్బులిస్తున్నామని చెప్పి.. మిగిలిన రాయితీలన్నీ కట్ చేశారు. వ్యవసాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక 47 లక్షల మందికి ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.310 కోట్లు ఇచ్చాం. ఇవి కాకుండా రూ.1,670కోట్ల బకాయిలు పెట్టి పోతే ఆ బకాయిలూ చెల్లించాం. గత ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువ జరిగాయి.

నీరు చాలా ముఖ్యం..

'నేనిక్కడి నుంచి ఎమ్మెల్యేలు, ప్రజలను ఒక్కటే కోరుతున్నా.. నీరు అనేది చాలా ముఖ్యం. నిరుడు 3-4శాతం అదనపు వర్షపాతం వచ్చింది. ఈ ఏడాది కొద్దిగా ఇబ్బంది ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది. నీటిని కాపాడుకోవడం మన బాధ్యత.' అని సీఎం అన్నారు. 'అన్నమయ్య జిల్లాలో సమర్ధనీటి నీటి నిర్వహణ చేశారు. 2024 నవంబరులో 12.97 మీటర్లు నీటి మట్టం లోతు ఉండేది. గత జనవరిలో 6.67 మీటర్లకు వచ్చింది. ఒక్క ఏడాదిలో సమర్థ నీటి నిర్వహణ వల్ల 6.3 మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయంటే అదొక చరిత్ర. దీనికి కృషి చేసిన జిల్లా పరిపాలన యంత్రాంగాన్ని అభినందిస్తున్నా. రాష్ట్రంలో సగటున 7.31 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి. భూగర్భ జలాలు పెరిగినందున 2024లో 336 మిలియన్ యూనిట్లు విద్యుత్ వాడితే.. 2025లో 221 మిలియన్ యూనిట్లు మాత్రమే వాడారు. దీనివల్ల 115 మిలియన్ యూనిట్ల ఆదాతో రూ.95కోట్లు ఆదా అయ్యాయి. మనం సమర్థవంతంగా పని చేస్తే.. ఎలాంటి ఫలితాలు వస్తాయో ఇదొక ఉదాహరణ. దీనికి అనదంగా 20వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు పెరిగాయి. దీని విలువ రూ.1,634కోట్లు. రైతులందరికీ ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా.. ఎక్కడికక్కడ అవసరమైన మెకానిజం పెట్టాం. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది.' అన్నారు.

ఖరీఫ్‌ను ముందుకు తేవాలి.. ఎమ్మెల్యే బాధ్యత!

సుదీర్ఘ సముద్ర తీరప్రాంత రాష్ట్రంలో తుఫాన్ల నుంచి పంటను కాపాడుకోవాలంటే ఖరీఫ్‌ను రెండు నెలలు ముందుకు తీసుకు రావల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని మంత్రి అచ్చెన్న చెప్పారు. తమ నియోజకవర్గాల్లోని రైతులతో చర్చించి నారు ముందుగా వేసుకునేలా, కేన్సర్‌కు కారణం అవుతున్న యూరియా వాడకం తగ్గించేందుకు ఒప్పించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దబోతోందని స్పష్టం చేశారు. సీమ బిడ్డగా ప్రతిచోటా చెప్పుకునే జగన్ సీమలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు.



అసెంబ్లీ సందర్శనకు వచ్చిన విద్యార్థులతో స్పీకర్ అయ్యన్న పాత్రుడు

బాబు దూరదృష్టితో వ్యవసాయానికి స్వర్ణయుగం

▸ అసెంబ్లీలో వ్యవసాయ మంత్రి అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలకమైన వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల ఆదాయం పెంపు, సమర్థంగా వనరుల వినియోగమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో వ్యవసాయానికి స్వర్ణయుగం వచ్చిందని, వ్యవసాయాన్ని యాంత్రీకరణ స్థాయి దాటి డ్రోన్ వినియోగం వరకూ తీసుకెళుతున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 లక్ష్యాలకు అనుగుణం గా వ్యవసాయ రంగంలో కనీసం 15శాతం వార్షిక వృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నాం. 2024-25లో 11.64 శాతం వృద్ధి నుంచి ప్రస్తుత ఆర్థిక సం వత్సరంలో 16శాతం సాధించాం. ఉచిత వ్యవసాయ విద్యుత్ 22.5లక్షల పంపుసెట్లకు రోజూ 9గంటలు ఇస్తూ రూ.13,241కోట్ల సబ్సిడీ భరిస్తున్నాం. గత ప్రభుత్వంలో ధరల స్థిరీకరణకు రూ.7700కోట్లు కేటాయించినట్లు చెబుతున్నవన్నీ అబద్ధాలే. ఐదేళ్లలో కేవలం రూ.1475కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నాలుగు లక్షల పశువులు కొనుగోలు చేసినట్లు పేపర్లలో చూపించి ఒక్కటంటే ఒక్కటి కూడా కొనుగోలు చేయలేదు. రాష్ట్రంలోని రైతులకు కేంద్ర పథకాలను సైతం(మ్యాచింగ్ గ్రాంట్ 40శాతం కట్టలేక) సద్వినియోగం చేసుకోని దుర్మార్గులు వైసీపీ పాలకులు' అంటూ మండిపడ్డారు.

రైతే రాష్ట్రానికి దన్ను

▸ వ్యవసాయ బడ్జెట్‌ల ఆమోదానికి ప్రతిపాదించిన మంత్రులు నిమ్మల, పార్థసారథి

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రైతు బలపడితేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలపడుతుందని ప్రభు త్వం గమనించి, ఈ దిశగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యమిస్తోందని పలువురు సభ్యులు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తరపున జలవనరులశాఖ మంత్రి రామానాయుడు వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్ ఆమోదానికి ప్రతిపాదించారు. వ్యవసా య శాఖకు రూ.11,535 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1853 కోట్లు, మత్స్య శాఖకు రూ.209 కోట్ల బడ్జెట్ ఆమోదానికి ప్రతిపాదించారు. అలానే హౌసింగ్, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హౌసింగ్‌కు రూ.6357 కోట్లు, సమాచార శాఖకు రూ.329 కోట్ల బడ్జెట్ ఆమోదానికి మంత్రి ప్రతిపాదించారు. అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం వ్యవసాయ అనుబంధంగా రూ.11,535 కోట్లకు పైగా కేటాయించిందన్నా రు. ప్రభుత్వం మైక్రో లెవెల్ ప్లానింగ్ చేస్తోందని, సీఎం చంద్రబాబు ప్రతి వారం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై సమీక్ష చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్లూ వ్యవసాయాన్ని క్లోజ్ చేశారని, నేడు ప్రకృతి వ్యవసాయానికి మనం పెద్ద పీట వేస్తున్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. రాయలసీమలో తక్కు వ నీళ్లతో పంట పండించుకునేందుకు మైక్రో ఇరిగేషన్ అవసరమన్నారు. అయితే, 2021-22 పులివెందుల నుంచి రైతులు వచ్చి హార్టికల్చర్‌కు సహకరించాలని అప్పటి మంత్రి కన్నబాబుకు చెబితే, ఆయన నేరుగా జగన్‌కు వద్దకు వెళ్లి రైతుల కోరికను బయటపెట్టారని, దీనిపై.. జగన్ స్పందిస్తూ.. అవన్నీ నీకు అవసరమా? అని అన్నారని తెలిపారు.

ఉన్నత విద్య ప్రక్షాళనలో తొలి అడుగు

▸ సాంకేతిక విద్యాశాఖ రద్దు.. బోర్డు, సిబ్బంది, ఆస్తులు ఉన్నత విద్యకు బదిలీ

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య ప్రక్షాళనలో తొలి అడుగు పడింది. ఇటీవల క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా శాఖల పునర్ వ్యవస్థీకరణ దిశగా అడుగులు పడ్డాయి. ఈమేరకు ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల విద్యా శాఖను ఉన్నత విద్య కమిషనరేట్‌గా మార్చారు. సాంకేతిక విద్యా శాఖను రద్దు చేశారు. దానికి సంబంధించిన సిబ్బంది, ఆస్తులను ఉన్నత విద్యలోకి బదిలీ చేశారు. కొత్తగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, శిక్షణ కమిషనరేట్ ఏర్పాటు చేశారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి పేరును మార్చారు. ఆయా అంశాలపై ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మరోవైపు ఉపాధి కల్పన, శిక్షణ డైరెక్టరేట్‌ను నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, శిక్షణ కమిషనరేట్‌గా మార్చారు. ఈ కమిషనరేట్ పరిధిలోకి నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఓంక్యాప్‌లు వచ్చాయి. రాష్ట్రస్థాయిలో మార్పునకు అనుగుణంగా జిల్లాల్లో ఉండే ఉపాధి కల్పన అధికారి పోస్టును జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాధికారిగా మార్చారు.

అడ్మిషన్ల బాధ్యత కమిషనరేట్‌కే...

కమిషనరేట్ ఏర్పాటుతో ఉన్నత విద్యామండలి అధికారాలు పరిమితం కానున్నాయి. ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యత మండలిదే. అయితే అడ్మిషన్లన్నీ ఉన్నత విద్య కమిషనరేట్ చేపడుతుంది. ఇప్పటి వరకూ డిగ్రీ అడ్మిషన్లు మండలి చూస్తోంది. ఇకపై ఆ బాధ్యత కమిషనరేట్‌దే. కరిక్యులమ్‌లో మార్పులు, వర్సిటీల ర్యాంకులు, ఇతర అకడమిక్ అంశాలకు మండలి పరిమితమవుతుంది.

నేడు విజయనగరం జిల్లాకు సీఎం

విజయనగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం విజయనగరం జిల్లా చీపురుపల్లి రానున్నారు. ఆ నియోజకవర్గంలో నిర్వహించే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీలో, రావివలసలో జరిగే ప్రజావేదికలో పాల్గొంటారు. చీపురుపల్లి ఏరియా ఆసుపత్రిలో జరిగే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు హాజరవుతారు. ఇదే కార్యక్రమాన్ని రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గంలోని రావివలస నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొంటారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా 14 ఏళ్లు దాటిన బాలికల కోసం నిర్వహిస్తున్న ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి వచ్చిన బాలికలతో సీఎం నేరుగా మాట్లాడతారు.

లడ్డూలో ఎంత తిన్నాడో తెలియదు

▸ లోపల వేస్తే సంతోషించే మొదటి వ్యక్తి నేనే

▸ వైవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి బాలినేని

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'తిరుమల లడ్డూలో ఆయన(వైవీ సుబ్బారెడ్డి) ఎంత తిన్నాడో నాకు తెలియదు. కానీ మిగతా విషయాల్లో చాలా సంపాదించుకున్నాడు' అని మాజీ మంత్రి, జనసేన పార్టీ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఒంగోలు లాయర్‌పేటలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైవీ సుబ్బారెడ్డి పేరు ఎత్తకుండానే బాలినేని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'వేంకటేశ్వరస్వామి పవిత్రత, భక్తుల మనోభావాలు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో గతంలో నేను ఒంగోలు వచ్చినప్పుడు లడ్డూ విషయంపై అలా మాట్లాడాను. అయితే దానిని అడ్డంపెట్టుకొని నేను వైసీపీలో చేరుతున్నట్లు కొంతమంది దుష్ప్రచారం చేశారు. వైవీ సుబ్బారెడ్డిని లోపల వేస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయి. ఆయనను లోపల వేస్తే సంతోషించే మొదటి వ్యక్తిని నేనే. ఒంగోలులో భూకబ్జాలు, ఇసుక, గ్రావెల్ అక్రమాలపై సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తున్నా. విషయాన్ని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తా. ఉచిత ఇసుకను ఇచ్చిన చంద్రబాబు పుణ్యాత్ముడైతే... ఒంగోలులో మాత్రం కోట్లు సంపాదించుకుంటున్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒంగోలులో బ్రాహ్మణుల స్థలాలను ఆక్రమించుకున్నానంటూ దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ స్థలాలతోపాటు ఐదింటిని ఒంగోలులో కబ్జా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెప్మాలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలి.' అని బాలినేని పేర్కొన్నారు.

సర్కార్ X చైర్మన్



▸ మండలిలో 'లడ్డూ చర్చపై వాదోపవాదాలు

▸ పాలకపక్షంపై మోషేన్‌రాజు ఆరోపణలు

▸ ఖండించిన అధికార పక్ష సభ్యులు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తిరుమల లడ్డూ ప్రసాదంపై చర్చను గురువారం పాలకపక్షమే అడ్డుకుందని చైర్మన్ మోషేన్‌రాజు అన్నారు. చైర్‌ను అవమానించారని ఆరోపించారు. దీనిని మంత్రులు, టీడీపీ ఎమ్మెల్సీలు ఖండించారు. చర్చను వైసీపీయే అడ్డుకుందని చెప్పారు. శుక్రవారం మండలి సమావేశం ప్రారంభం కాగానే.. చైర్మన్ మాట్లాడారు. 'నిన్నటి రోజు(గురువారం) సభ పునఃప్రారంభమైనప్పుడు.. ప్రశ్నోత్తరాలను డీమ్డ్ చేసిన తర్వాత కూడా అధికార పార్టీ సభ్యులు రూల్స్‌కు విరుద్ధంగా క్వశ్చన్ అవర్ జరిపించాలని అడిగి.. లడ్డూ ప్రసాదంపై లఘు చర్చను అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరం. అదే సందర్భంలో ఆర్థిక మంత్రి నాపై కొన్ని సత్యదూరమైన ఆరోపణలు చేయడం కూడా కరెక్టు కాదు. లఘు చర్చ జరిపే సన్నాహక చర్యల్లో భాగంగా సెక్రటరీ జనరల్ సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శికి లఘు చర్చ టాపిక్‌పై నోట్స్ పంపిన ప్రతిని చూపించి.. స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నేను అంగీకారం తెలిపిన పత్రంగా నమ్మబలికే ప్రయత్నం చేసి, సభను తప్పుదోవ పట్టించే యత్నం చేశారు. అదీ కరెక్టు కాదు. ఇరు పక్షాల సభ్యులూ సభ గౌరవాన్ని పెంపొందించే విధంగా నడుచుకోవాలని తెలియజేసుకుంటున్నా' అని తెలిపారు. పలువురు మంత్రులు, అధికార పార్టీ సభ్యులు తమ స్థానాల వద్ద నిలబడి ఆయన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు మాట్లాడిన దానిపై క్లారిటీ ఇవ్వాలి కదా అని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడే ప్రయత్నం చేయగా.. వద్దని చైర్మన్ వారించారు. మంత్రులు, అధికార పార్టీ సభ్యులు సార్ సార్ అంటుండగా.. 'వదిలేయండి.. చైర్‌ను ఇంకా అవమానించాలనుకుంటే కరెక్టు కాదు' అని మోషేన్ రాజు అన్నారు. మీరంటే మాకు అపారమైన గౌరవం ఉందంటూ మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్, బాలవీరాంజనేయస్వామి, పలువురు టీడీపీ సభ్యులు అన్నారు. వారు చైర్మన్ సీటును అగౌరవపరిచారని వైసీపీ సభ్యులు వ్యాఖ్యానించారు. చైర్మన్ జోక్యం చేసుకుని.. 'జరిగింది నాకు.. మీకు సంబంధం లేదు కదా' అని వారినుద్దేశించి అన్నారు.

వాళ్లే భయపడుతున్నారు: అచ్చెన్న

చైర్మన్ అంటే తమకు అపారమైన గౌరవమని అచ్చెన్నాయుడు చెప్పారు. 'పార్లమెంటరీ సంప్రదాయాల ప్రకారం ప్రతిపక్షం ఒక సబ్జెక్టు మీద చర్చించాలంటే నోటీసివ్వాలి. నోటీసివ్వకపోయినా బీఏసీలో అంగీకరించాం కాబట్టి మేమే ఒక అడుగు ముందుకొచ్చి నిన్న చర్చించడానికి కాపీలన్నీ సిద్ధం చేసి, మండలిలో పెట్టాం. ముందు రోజు అసెంబ్లీలో ప్రతిపక్షం లేకపోయినా కూడా.. మా సభ్యుడు నరేంద్రతో నోటీసు ఇప్పించి, కాపీలన్నీ సభలో పెట్టి, సంబంధిత మంత్రి దానిని చదివిన తర్వాత చర్చ సాగింది' అని తెలిపారు. 'అది అసెంబ్లీలో అవ్వొచ్చు.. ఇక్కడ (మండలిలో) ప్రొసీడింగ్స్ వేరు' అని చైర్మన్ అన్నారు. తాము చెప్పేది విన్న తర్వాత ఆయన మాట్లాడాలని అచ్చెన్న కోరారు. 'మండలిలో వైసీపీ వాళ్లు నోటీసివ్వకపోయినా మీ దగ్గర బీఏసీలో అంగీకరించాం కాబట్టి.. మీ మాటను గౌరవించాలి కాబట్టే.. వాళ్లకు ఆసక్తి లేకపోయినా మేం బాధ్యత కలిగిన ప్రభుత్వంగా కాపీలన్నీ ఇక్కడ పెట్టి మా మంత్రి చదువుతారని చెబితే.. ఆయన ప్రసంగించకుండా అడ్డుకోవడం మీరే చూశారు. దానిపైనే సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల మాట్లాడుతుంటే.. వాస్తవాలు బయటకు వస్తాయని వాళ్లు భయపడ్డారు. మేం వెనకడుగు వేయం. తిరుపతి లడ్డూపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. ఒకరోజు చాలకపోతే 4, 5, 6 తేదీల్లో మూడు రోజులూ చర్చించడానికి సిద్ధం' అని స్పష్టం చేశారు.

అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

అనంతరం.. లడ్డూప్రసాదంపై వైసీపీ సభ్యులు రమేశ్ యాదవ్, భరత్, సుబ్రహ్మణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే లడ్డూ అంశంపై చర్చ జరపాలని వారు పట్టుబట్టారు. మంత్రి నాదెండ్ల మనోహర్ సభ్యుల ప్రశ్నకు సమాధానం ఇస్తుండగా.. వైసీపీ ఎమ్మెల్సీలు చైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. లడ్డూ అంశంపై చర్చ జరపాలని ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేశారు. దీంతో టీడీపీ సభ్యులు కూడా పోడియం వద్దకు వెళ్లి సభను ఆర్డర్‌లో పెట్టాలని చైర్మన్‌ను కోరారు. అయితే ప్రశ్నోత్తరాలను సాగనివ్వకుండా వైసీపీ సభ్యులు గందరగోళం సృష్టించారు. దీంతో చైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. అనంతరం మంత్రులు చైర్మన్ చాంబర్‌కు వెళ్లారు. ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు.

సభ గౌరవానికి చైర్మనే విఘాతం కలిగిస్తున్నారు!

▸ పయ్యావులపై వ్యాఖ్యలు బాధాకరం: కూటమి ఎమ్మెల్సీలు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చైర్మన్ మోషేన్‌రాజు శాసనమండలిలో పాలక పక్షాన్ని విమర్శించడం సరైంది కాదని కూటమి ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. సభను సజావుగా నడిపించాలనే ప్రయత్నం చైర్మన్ చేయడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. లడ్డూ అంశంపై చర్చకు ప్రభుత్వం అంగీకరించినా.. చర్చ జరిగే సమయంలో దేవదాయ మంత్రి స్టేట్‌మెంట్ ఇవ్వడానికి చైర్మన్ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. మంత్రి స్టేట్‌మెంట్‌కు అనుమతివ్వాలన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌పై చైర్మన్ వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని తెలిపారు. సభ సంప్రదాయాన్ని కాపాడాల్సిన చైర్మన్.. సంప్రదాయాలకు విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ మనోభావాలు ఎలా దెబ్బతిన్నాయో తమకు అర్థం కాలేదని.. కానీ సభ్యుల మనోభావాలకు పూర్తి విఘాతం కలిగే పరిస్థితిని ఆయన కల్పించారన్నారు.

కొత్త శైలి: వీర్రాజు

'ప్రభుత్వంపైనే చైర్మన్ ఆరోపణలు చేశారు. గతంలో ఎప్పుడూ ఏ చైర్మన్ ఇలా చేయలేదు. కొత్త వ్యవహారశైలికి తెరలేపారు. తిరుమల లడ్డూపై చర్చకు మేం సిద్ధం' అని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.

స్క్రిప్టు ఎక్కడిది: అనూరాధ

వైసీపీ సభ్యులతో కలిసిపోయి చైర్మన్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ విమర్శించారు. 'అధికార పార్టీ సభ్యులే చర్చను అడ్డుకున్నారని చైర్మన్ చెప్పడం విడ్డూరం. ఇది నాటకంలా ఉంది.. ఈ స్క్రిప్టు ఎక్కడి నుంచి వచ్చింది?' అని ప్రశ్నించారు. కాగా, జగన్ రిమోట్ ద్వారా వైసీపీ సభ్యులను ఆడిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు విమర్శించారు. వారు చీప్ ట్రిక్స్ మానుకోవాలని.. పెద్దల సభను 5 కోట్ల మంది గమనిస్తున్నారని చెప్పారు. కుట్రతోనే బడ్జెట్ సమావేశాలను వైసీపీ ఎమ్మెల్సీలు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ విమర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.